జ్యోతి

మెప్సెృ మే -1963

60 నయాపైసలు

05-1963

30




అన్నపూర్ణా వారి
చదువుకున్న అమ్మాయిలు
నిర్మాత. డి.మధుసూదనరావు B.A
దర్శకుడు. ఆదుర్తి సుబ్బారావు
సంగీతం రాజేశ్వరరావు
నవయుగ విడుదల
శ్రీ సారథీ స్టుడియోస్
హైదరాబాద్
n.v.k.r.



తొలిమాట

కవరుపేజీమీద మీలాంటి అందమైన ముఖాలే రెండు "జ్యోతి" కేసి చూస్తున్నాయి. భూషణ్ ఫొటోగ్రాఫ్ చేసిన ఈ రెండిటిలోను ఒకటి హరనాథ్‌ది, మరొకటి వాసంతిది.

వారిద్దరూ అక్కడా, ఇక్కడా కాక, 17వ పేజీనుంచి వరసగా ఆరుపేజీలలో కూడా కనిపిస్తారు. ఆ పేజీలు ఒక అందమైన చిన్న కథను, ప్రతివారి మనస్సులో దాగివుండే పెద్ద కథను చెబుతాయి. ఈ నెల "జ్యోతి" కి ఆ ఫొటోశీర్షిక ప్రత్యేకాకర్షణ అ మీరుకూడా మాతో ఏకీభవిస్తారా?



జ్యోతి
సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట పోస్టు :: విజయవాడ-2

మేనేజింగ్ ఎడిటర్ : వి. వి. రాఘవయ్య
విడిప్రతి వెల : 60 న. పై. ఏడాది చందా ఏడు రూపాయిలే
సంపుటి 1 మే 1963 సంచిక 4

పాఠక మహాశయా! ఈ నెల మా

కథా-కమామీషూ

ముఖచిత్రం

"మీరు ఎక్కదలుచుకున్న బస్సు —
ఎప్పుడూ ఒక "జ్యోతి" కాలం మిస్సు".

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు

Edited and Published by V. V. Raghavaiah and
Printed by him at Andhra Printers Ltd.,
Buckinghampet post Vijayawada-2.

రాజకీయ వార్తావరణం

ఈ వ్యాసం వ్రాస్తున్న సమయానికి కరాచీలో కాశ్మీర్ సమస్యపై ఇండియా, పాకిస్తాన్ ప్రతినిధి వర్గాల మధ్య సంభాషణలు ముగిశాయి. ఇవి తిరిగి ఢిల్లీలో కొనసాగుతాయి. ఉభయదేశాల ప్రధాన వాదాలలో పెద్దగా మార్పులు జరిగితే తప్ప కాశ్మీర్ సమస్య పరిష్కారం కాగలదని ఆశించడం అనవసరమనిపిస్తున్నది.

మనకు సంబంధించినంతవరకు మన వాదంలో చేయగలిగిన మార్పులేవో ఇదివరకే చేశాము. జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రం భారతదేశంలో అంతర్భాగమని, దానిపై పాకిస్తాన్ దురాక్రమణచేసి కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్నదని, అందులోని ప్రత్యంగుళం మనకు చెందవలసిందేనని పదిహేనేళ్ళుగా మనం వాదిస్తున్నాము. ఈ సమస్య కారణంగా మన ఉభయ దేశాల మధ్య స్పర్ధలు విశేషంగా పెరిగిపోయాయి. అయితే, యిటీవల చైనా దురాక్రమణ కారణంగా మన విధానాలలో కలిగిన పెద్ద మార్పుల ప్రభావం కాశ్మీర్ సమస్యపై కూడా ప్రసరించింది. మనవాదాన్ని కొంతవరకు సడలించుకున్నాము. కాశ్మీర్‌లో యుద్ధ విరమణ రేఖను స్వల్పమైన సవరణలతో సరిహద్దు రేఖగా భావించడానికి మన సంసిద్ధతను తెలియబరచాము. పాకిస్తాన్‌ను ఇప్పటికీ దురాక్రమణ చేసిన దేశంగానే పరిగణిస్తున్నప్పటికీ, దానితో సఖ్యతను పెంపొందించుకొనే ఉద్దేశంతో, సమస్యకు గౌరవప్రదమైన పరిష్కారాన్ని సాధించాలనే ఉద్దేశంతో ఈ విధంగా కొంతభాగాన్ని పాకిస్తాన్‌కు వదలివేయడానికి సిద్ధపడ్డాము.

అయితే, పాకిస్తానుకు మనం చూపిన ఔదార్యం చాలలేదు. కాశ్మీర్‌లో ప్లెబిసైట్ ప్రసక్తి నిప్పుడు అది తేవడం లేదనుకోండి అయినా, అది అంతకంటె మూర్ఖమైన కోర్కెను పట్టుకుని వ్రేలాడుతున్నది. జమ్మూలో ఒకటి, రెండుజిల్లాలు మినహాగా మొత్తం కాశ్మీర్ తనకే చెందాలని పట్టు పడుతున్నది.

ఈ కోర్కెను మనం అంగీకరించడం ముమ్మాటికీ కల్ల. పాకిస్తాన్‌తో ఎంతగా స్నేహాన్ని కోరుతున్నప్పటికీ, మొత్తం కాశ్మీర్‌ను దానికి ధారాదత్తం చేయడానికి మనం సిద్ధంగాలేము. అంతేకాదు, అమెరికా సూచిస్తున్నట్టు, కాశ్మీర్ లోయను విభజించి కొంతభాగాన్ని పాకిస్తానుకు కట్టబెట్టడానికి కూడా మనం అంగీకరించలేము. ప్రధాని నెహ్రూ చెప్పినట్టు కాశ్మీర్‌లోయ భౌగోళికంగా, ఆర్థికంగా ఒకే భూఖండం. దాన్ని విభజించడంవల్ల అనేకానర్థాలు వాటిల్లక తప్పదు.

చైనా వైఖరి :

కొలంబోలో సమావేశమై ఇండియా, చైనా వివాద పరిష్కారానికి కొన్ని ప్రతిపాదనలు చేసిన ఆరు ఆఫ్రో-ఏషియన్ రాజ్యాలు ఈ పాటికి "ఈ రొంపిలో ఎందుకు దిగామా" అని నాలుకలు కరచుకుంటూ వుండి వుండాలి.

మనపై దురాక్రమణ చేసిన చైనా హఠాత్తుగా యుద్ధం విరమించి, తనంతట తానేవో కొన్ని షరతులు విధించి మనలను సంప్రతింపులకు రావలసిందిగా కోరింది. చైనా షరతులను మనం త్రోసి పుచ్చాము. ముందుగా దురాక్రమణను ఉపసంహరించు కోవాలని, ఆ తరవాతనే సంప్రతింపుల ప్రసక్తి అని ఖరాఖండిగా చెప్పేశాము. కనీసం 1962 సెప్టెంబరు 8వ తేదీకి ముందు పరిస్థితినైనా నెలకొల్పితే చాలునని చెప్పాము. కొలంబో సమావేశం చేసిన ప్రతిపాదనలు మన కోర్కెకు సన్నిహితంగా వుండడంచేత వాటిని ఎట్టి మినహాయింపులు లేకుండా మనం అంగీకరించాము. వాటిని చైనాకూడా అంగీకరించి అమలుచేస్తే సంప్రతింపులు జరపడానికి అభ్యంతరం లేదని తెలిపాము.

వాటిని మనం ఆమోదించడం చైనాకు గొంతులో పచ్చివెలక్కాయ ఇరుక్కున్నట్టయింది. అటు కొలంబో రాజ్యాలను పూర్తిగా వ్యతిరేకం చేసుకోవడం కూడా దాని కిష్టం లేదు. అందుచేత, కొలంబో సభను సమర్థిస్తున్నట్టు పదే పదే చెప్పడం, ఆ సభ ప్రతిపాదనలను సూత్రప్రాయంగా ఆమోదిస్తున్నట్టు ప్రకటించడం చేసింది. అంతేగాని, వాటిని ఇంతవరకు పూర్తిగా ఆమోదిస్తున్నట్టు చెప్పడంలేదు. కాగా, మొన్న ప్రధాని చౌ ఎన్-లై చేసిన ప్రకటన చూస్తే ఇక వాటిని చైనా ఆమోదించడం జరగదనే అనుకోవలసి వస్తున్నది.

తమ ప్రతిపాదనలను చైనా ఈ విధంగా తృణీకరించడం కొలంబో రాజ్యాలకు గట్టి ఎదురుదెబ్బ. చైనాచేత ఏ విధంగానైనా ఒప్పించాలని అరబ్ రిపబ్లిక్ ప్రధాని అలీ సబ్రీ ఆఖరిసారిగా పెకింగ్‌లో ప్రయత్నం చేశారు. అయితే, ఆ ప్రయత్నం ఫలించలేదని చౌ ఎన్-లై ప్రకటనే తెలుపుతున్నది.

చైనా ఏ క్షణంలో ఏం చేస్తుందో ఎవరూ చెప్పలేరు. ఒకటి చేస్తున్నట్టు నటించి మరొకటి చేయడం చైనా నాయకులకు పరిపాటి. సరిహద్దు వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలనే ఇప్పటికీ తమ వాంఛ అని, ప్రస్తుత యుద్ధవిరమణను భంగంచేసే ఎలాంటి చర్యలు తాము తీసుకోబోమని చౌ ఎన్-లై, లియూ షావ్-చీ ప్రభృతులు పదే పదే చెబుతున్నారు. మరొకవంక టిబెట్‌లో మన సరిహద్దు పొడుగునా సైన్యాలను, ఆయుధాలను సమీకరిస్తున్నారు. ఏ క్షణాన్నయినా మళ్ళీ సరిహద్దును దాటి రావడానికి వీలుగా రోడ్లు వగైరాలు నిర్మిస్తున్నారు.

చైనా ఆంతర్యం ఏమైనప్పటికీ, మన రక్షణ కృషి నిర్విరామంగా జరిగిపోతున్నది. సైన్యాన్ని త్వరలో రెట్టింపు చేయడానికి, కొత్తగా ఆరు ఆయుధ కర్మాగారాలను నెలకొల్పి ఆయుధోత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం చర్యలు గైకొంటున్నది. అమెరికా నుంచి ఆయుధసహాయం వస్తున్నది, ఇంకా రానున్నది. దీర్ఘకాలిక సహాయం సంగతి, వైమానిక సహాయం విషయం ఇంకా తేలకపోయినా, ఇటీవల అమెరికా నాయకులు చేస్తున్న ప్రకటనలనుబట్టి, మన విదేశాంగ విధానంతోగాని, పాకిస్తానుతో మనకుగల కాశ్మీర్ తగాదాతోగాని నిమిత్తం లేకుండా అమెరికా సైనిక సహాయం మనకు లభిస్తుందనే ఆశించవచ్చు.

హిందీ బిల్లు

ఈ వ్రాస్తున్నది పంపోజ్ అవుతున్న వేళకు అధికారభాషల బిల్లుపై లోక్

సభలో చర్చ జరుగుతున్నది. 1965 జనవరి 26 వ తేదీ తరవాత హిందీని అధికార భాషచేస్తున్న ఒక బిల్లును హోం మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ఇటీవల ప్రతిపాదించారు. దీని ప్రకారం హిందీ ప్రధాన అధికార భాష అవుతుంది. అయితే ఇంగ్లీషుకూడా ప్రభుత్వ వ్యవహారాలన్నిటికి వాడబడుతుంది. పదేళ్ళ తరవాత హిందీ అభివృద్ధిని పరిశీలించడానికి రాష్ట్రపతి ఒక కమిటీని నియమిస్తారు. ఆ కమిటీ నివేదికను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించి వారి అభిప్రాయాలు తెలుసుకుని హిందీని ఏకైక అధికార భాషగా చేయడమా, లేక ఇంగ్లీషును కూడా మరి కొంత కాలం కొనసాగించడమా అనేది రాష్ట్రపతి నిర్ణయిస్తారు.

ఈ బిల్లుకు పార్లమెంటు లోపల, వెలుపల కూడా చాలా వ్యతిరేకత వచ్చింది. బిల్లును ప్రవేశపెడుతున్న సందర్భంలోనే పార్లమెంటు సభ్యులు కొందరు అల్లరిగా ప్రవర్తించారు. వారిని సస్పెండు చేయడం వరకు వెళ్ళింది. ఇంగ్లీషును 1965 తరవాత కూడా కొనసాగించవచ్చునన్నదాన్ని ఈ సభ్యులు వ్యతిరేకించారు. ఇది ఒకవైపు తీవ్రవాదం అయితే, మరొకవైపునుంచి హిందీ వ్యతిరేకులు తమ తీవ్ర ప్రాతికూల్యాన్ని ప్రకటిస్తున్నారు. ముఖ్యంగా మదరాసులో ద్రవిడ వాదానికి చెందినవారు నానాహంగామా చేస్తున్నారు.

ఈ రెండు తీవ్రవాదాలకు మధ్య నిలిచిన కొందరు బిల్లును ఒక్కొక్కరు ఒక్కొక్కరకంగా విమర్శిస్తున్నారు. 1965 తరవాత ఇంగ్లీషు స్థాయిని ప్రత్యేకంగా పేర్కొనలేదని కొందరు. ఇంగ్లీషును పూర్తిగా తొలగించడానికి వేసిన ఎత్తుగడ ఇది అని మరికొందరు. ప్రధాని నెహ్రూ తన వాగ్దానాలను తానే ఉల్లంఘించారని ఇంకొందరు విమర్శిస్తున్నారు.

ఇష్టంలేని ప్రజలపై హిందీని బలవంతాన రుద్దే ప్రశ్న లేదని ప్రధానమంత్రి హోం మంత్రి కూడా మళ్ళీ లోక్‌సభలో హామీ యిచ్చారు. హిందీ మాతృభాషకాని వారు కోరినంతకాలం ఇంగ్లీషును అధికార వ్యవహారాలకు వాడుతూనే వుండవచ్చునని. హిందీని ఒక్కసారిగా ప్రవేశపెట్టబోమని. అది తగినంతగా అభివృద్ధి అయి, తగినంతగా దేశంలో వ్యాప్తి చెందిన తరవాతనే దాన్ని పూర్తిగా ప్రవేశపెట్టడం జరుగుతుందని వారుభయులు హామీ నిచ్చారు. ఈలోగా హిందీరాకపోయినంత మాత్రాన ఉద్యోగాలివ్వకుండా పోవడం జరగదని కూడా అభయం చెప్పారు.

ఒకటి మాత్రం నిజం. ఈనాడు కాకపోతే మరొక తరమో, రెండు తరాలో గడిచిన తరువాతనైనా హిందీ భారత జాతీయ భాష కాక తప్పదు. దాన్ని వ్యతిరేకించడం అనవసరం. దాన్ని ఇంగ్లీషువలె అన్ని రకాల పనులకు, ముఖ్యంగా సాంకేతికోపయోగాలకు సరిపడిన దాన్నిగా తీర్చి దిద్దుకోవడం మన బాధ్యత. దాన్ని క్రమంగా ఇతరభాషా ప్రాంతాలలో కూడా ప్రవేశపెట్టి వ్యాప్తి చెందించడం మన విధి. ●

మన ప్రతిపని
రక్షణకే
అంకితం కావాలి !

నదీ జలాల సమస్య

తురగా కృష్ణమోహనరావు

చూసి రమ్మంటే, కాల్చివచ్చిన వాడు హనుమంతుడు. ప్రజ్ఞలు పలికి యుద్ధరంగానికి పోయి, పార్థసారథిగా కూడా నిలబడ్డానికి వీలులేని పరిస్థితిలో నీళ్ళుకారి పోయినవాడు ఉత్తరకుమారుడు. పినతండ్రిని చంపబోయి, మరో అరడజను మందిని ఇటు స్వర్గానికి, అటు నరకానికి సాగనంపి వచ్చినవాడు డెన్మార్క్ రాకుమారుడు హేమ్లెట్. ఇండియాకి మరో మార్గం చూపిస్తానని బయలుదేరి, కొత్త ప్రపంచాన్నే దారిలోకి లాక్కొచ్చినవాడు కొలంబస్.

వీళ్ళంతా ఒకవిధంగా లక్ష్యాన్ని సాధించి. మరోవిధంగా దాన్ని అధిగమించినవారే. వీరిలాటి వాడే ఎన్. డి. గుల్హాతీ అనే పెద్దమనిషి. ఆయన్ను పై నల్గురిలో ఎవరితోనూ పోల్చ తగదు కాని- ఆయన, చెప్పింది చెప్పని విధంగా చేసుకొచ్చి ఐదు రాష్ట్రాల ప్రజల మనస్సుల్లో మంటలు రగిల్చాడు. ఐనా- తాత్కాలికంగా కలిగే నష్టాల సంగతి విస్మరిస్తే దేశానికి శాశ్వతమైన సేవే చేశాడు.

కొండను త్రవ్వి, ఎలకని పట్టాడు. కాని—ఎలకసంగతి మర్చిపోతే, కొండను త్రవ్వడంవల్ల శాశ్వతమైన ప్రయోజనాలే సాధించాడు.

ఎన్డీ గుల్హాతీ అధ్యక్షుడుగా, డీడీ జాయినీ, ఆర్సీ హూన్ అనే మరో ఇద్దరు సభ్యులుగా 1961 మే నెలలో స్థాపించబడిన

కృష్ణా, గోదావరీ జలాల పంపిణీ సమస్య మూడేళ్ళనుంచి రావణాసుర కాష్ఠంలా రాజుకుంటున్నది. దాన్ని చల్లార్చగలదనుకున్న గుల్హాతీ నివేదిక దాన్ని మరింత ఎగసన త్రోసింది. గడచిన నెలలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయంకూడా ఈ సమస్యను పూర్తిగా, అందరికి సంతృప్తికరంగా పరిష్కరించలేకపోయింది. మనకు సంబంధించినంతవరకు మనకు ముఖ్యమైన శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతి లభించినా, మైసూరు మహారాష్ట్రలు ఇంకా పేచీ పెడుతూనే వున్నాయి. ఏం పేచీపెట్టినా, ప్రస్తుతానికి వేడి కొంత తగ్గినట్టే భావించవచ్చు.

గుల్హాతీ సంఘం, కృష్ణా గోదావరీ నదీ ప్రాంతాలలో 6,500 మైళ్ళదూరం తిరిగి, వందలూ వేలూ విజ్ఞాపనలను పరిశీలించి(?) రాష్ట్రప్రభుత్వాల ప్రతినిధులతో వ్యక్తిగతంగాను సమష్టిగాను,పలుమార్లు చర్చలు జరిపి, పదిహేను నెలల తర్వాత, పద్దెనిమిది అధ్యాయాలతో, రాజుగారి మదపు టేనుగంత నివేదిక సమర్పించింది.

కృష్ణా గోదావరీ నదుల్లోని జలప్రవాహ ప్రమాణాలనుగురించి, ఈ నదులపై నిర్మించిన, నిర్మిస్తూన్న, నిర్మిద్దామని కలలు కంటూన్న ప్రాజెక్టుల అవసరాలనుగురించి, గోదావరీ జలాలను కృష్ణలోకి తరలించడంలో సౌలభ్యం, ఎంత తరలిస్తే ఎంత వ్యయం ఔతుందీ, వీటిని గురించీ— ముఖ్యంగా మూడు ప్రశ్నలడిగింది కేంద్ర ప్రభుత్వం. ఒక ప్రశ్నకు సమాధానం అసాధ్యం అంది కమీషన్. మరో ప్రశ్నకు అస్పష్టమైన సమాధానం ఇచ్చింది—సహజంగానే : మూడో ప్రశ్న విషయంలో— నలభై కోట్లు ఖర్చుపెట్టి పోలవరం నుంచి విజయవాడ వరకు ఒక కాలువ, మరో నలభై కోట్లు ఖర్చుపెట్టి సంగారెడ్డి నుంచి పులిచింతల వరకు మరో కాలువ త్రవ్వ వచ్చునంది.

ఇలా త్రవ్వితే — మొదటి కాలువ ద్వారా 211 శతకోటి ఘనపుటడుగుల నీరు, రెండవకాలువద్వారా 95 శతకోటి ఘనపుటడుగుల నీరు — గోదావరినుంచి కృష్ణలోకి 'యూస్ ఫుల్'గా బదిలీ చేయవచ్చునంది. గోదావరి పై భాగంలో నీరు చాలకపోతే? పెన్‌గంగ నుంచి ఒక కాలువ త్రవ్వితే పాతిక మొదలు ముప్పై శతకోటి ఘనపుటడుగుల నీరు గోదావరిలోకి పారించవచ్చునంది. దీనికి ఖర్చెంత ఔతుందో అంచనా వేయలేదు.

పోలవరం, సంగారెడ్డి కాలువల త్రవ్వకానికి వేసిన అంచనాకి ప్రాతిపదిక ఏమిటో కమిషన్ వివరించ లేదు. ఖర్చు యింతకు మించి చాలా వుంటుం దంటారు ఆంధ్ర ఇంజనీర్లు.

పైగా - ఈ నదులపై ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలు ప్రతిపాదించిన నాలుగు విద్యుచ్ఛక్తి పథకాలు, ఐదు (నీటి పారుదల, విద్యుత్తు) మిశ్రమ పథకాలను, పై రెండు కాలువల పథకాలను కలిపి ఒక బృహత్పథకం తయారు చేయడానికి చర్యలు వెంటనే తీసుకోమ్మంది కేంద్రాన్ని. ఈ బృ. ప. యొక్క ప్రాథమిక నివేదిక తయారైతేనే-
1. గోదావరి నుంచి బదిలీ అయ్యే జల ప్రమాణాన్ని బట్టి నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎంతది ఉండాలో నిర్ణయించ వచ్చునట !
2. నాగార్జునసాగర్ విద్యుచ్ఛక్తి పథకం ఉండాలో ఊడాలో తేల్చవచ్చునట !
3. శ్రీశైలం ప్రాజెక్టు ఎంతుండాలో లెఖ్ఖ తేల్చుకో వచ్చునట !

గుల్హాతీ కమీషన్ ఇంకో మాట కూడా అంది : పెన్‌గంగ నుంచి పోచంపాడు వద్ద గోదావరిలోకి నీరు పారబోసే పథకానికి ప్రాథమిక పరిశీలన జరిగిన తర్వాతనే - పెన్‌గంగ జల విద్యుచ్ఛక్తి పథకాన్ని చేపట్ట వచ్చునంది. కమీషన్ ఇంకో మాట కూడా అంది : 'నీరు నిలవేసుకుంటే తప్ప, పోచంపాడు వద్ద నీటి సాగు పథకమూ వీల్లేదు; విద్యుచ్ఛక్తి పథకమూ వీల్లేదు' అని.

మదరాసుకి మంచినీటి సరఫరా విషయంలో, కృష్ణనుంచి నీరు తీసుకోడమే ఉత్తమోత్తమమైన మార్గం, పొదుపైన పద్ధతీను అని కూడా అంది గుల్హాతీ కమీషన్. ఇద్దీ అర్ధరిచ్చిన గిరాకీదారుకి చట్నీ, సాంబారూ, కారప్పొడీ ఇచ్చిన పక్కిలో— ఈ సలహా కేవలం ఉచితం. కమీషన్‌ను ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించమని అడగ లేదు. కమీషన్ ఇచ్చిన మరో సలహా నదీ మండలుల స్థాపనకి సంబంధించినది.

మదరాసు ఇంకా రామపాద సాగరాన్ని పూర్తిగా మరచిపోని రోజుల్లో, కోయినా ప్రాజెక్టు కొరకరాని సమస్య కాక పూర్వం, ప్లానింగు కమీషన్ పిలుపుమీద, కృష్ణా గోదావరి జలాలను పంచుకోడానికి హక్కున్న మదరాసు, మైసూర్, మధ్యప్రదేశ్, బొంబాయి, హైదరాబాదు ప్రభుత్వాల ప్రతినిధులు ఒకచోట కలుసుకున్నారు. లక్ష్యం? ఈ నదుల్లో జలాలను ఎలా వినియోగించుకోడం, ప్రథమ పంచవర్ష ప్రణాళిక రెండవ దశలో చేర్చదలచిన ప్రాజెక్టుల 'తరతమ పరిశీలన.' స్థలం, సందేహం లేకుండా కొత్తఢిల్లీ. తేదీలా? 1951 వ సంవత్సరం జూలై నెల 27, 28. తమ తమ ప్రతినిధులు కలిసి చేసుకున్న ఆనాటి ఒప్పందాన్ని రాష్ట్రప్రభుత్వాలన్నీ ధ్రువపరిచాయి తర్వాత ఒఖ్ఖ మైసూర్ తప్ప.

అదీ 1951 నాటి ఒప్పందం. 1976 వరకు నిరభ్యంతరంగా చెల్లిపోవల్సిన ఒప్పందం - రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరగకపోతే, మహారాష్ట్ర కోయినా నుంచి కృష్ణా నదీ జలాలను అరేబియా సముద్రం వైపు తరలింపను యత్నించక పోతే !

1956 లో రాష్ట్రాల పునర్విభజన జరిగింది. అంతకు ముందు మూడేండ్ల క్రితమే ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది కదా? ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. బొంబాయి చీలి-

మహారాష్ట్రం ఏర్పడి, మరాఠ్వాడాను కూడా లీనం చేసుకొంది. మైసూరులో కర్ణాటకం కూడా కలిసిపోయింది. మదరాసు కృష్ణకీ గోదావరికీ కూడా దూరమైంది. 1951 వ సంవత్సరపు ఒప్పందంలో చేయవలసిన మార్పులు కేంద్రజల విద్యుచ్ఛక్తి మండలి సూచించింది. అవి రాష్ట్రాలకు రుచించ లేదు. 1960 సెప్టెంబరు 26, 27 తేదీల్లో కొత్తఢిల్లీలో జరిగిన సమావేశం వల్ల ఫలితం లేకపోయింది. ఆంధ్రప్రదేశ్ తప్పిస్తే, మిగిలిన రాష్ట్రాలన్నీ 1951 ఒప్పందాన్ని మరిచిపోయి, సమస్యని తిరగతోడ మన్నాయ్. "నాగార్జునసాగర్‌కి వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టెయ్యండి. మరే ప్రాజెక్టుకీ అంగీకరించకండి" అని మైసూర్, మహారాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చాయి.

కేంద్రమంత్రి శ్రీ హాఫిజ్ మహమ్మద్ ఇబ్రహీం ఈ మార్చి 23 వ తేదీన పార్లమెంటులో ఒక ప్రకటన చేశారు. ఈ నదీ జలాల ప్రవాహ ప్రమాణాలను గురించి లెఖ్ఖలు సేకరించడానికి చర్యలు ప్రారంభిస్తున్నాం అన్నారు. కృష్ణా గోదావరీ ప్రవాహ ప్రాంతాలకు సంబంధించిన ఒక బృహత్పథకాన్ని తయారు చేయడానికి (బహుశః నిర్వహించడానికి) నదీ మండలులను స్థాపించవచ్చు నన్నారు.

మూడవ, నాల్గవ, ఐదవ పంచవర్ష ప్రణాళికలలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మైసూరు రాష్ట్రాలు నిర్మించగలిగిన ప్రాజెక్టులు అన్నీ కలిపినా, వరుసగా ఎనిమిది వందలు, నాలుగు వందలు, ఆరు వందలు, శతకోటి ఘనపు టడుగుల నీటినికన్న ఎక్కువ ఉపయోగించలేవనీ, ఆ నీరు సులభంగా దొరుకుతుందనీ అంటూ కేంద్ర మంత్రి ఆ విధంగా పంపిణీ చేశారు. ఐదవ ప్రణాళిక ఆఖరున (1976 నాటికి) 1951 వ సంవత్సరపు ఒప్పందానికి ఎలాగూ తులసి నీళ్ళు పోయాలి అన్నా రాయన. మదరాసుకి మూడు ఐదులు పదిహేను శత కోటి ఘనపు అడుగుల నీరు తాగడానికి ఇవ్వడానికి రాష్ట్రాలన్నీ ఒప్పుకున్నందుకు ఆయన సంతోషం ప్రకటించారు.

మంత్రి పైగా ఇంకోమాట అన్నారు. 1951 వ ఒప్పందం న్యాయ శాస్త్రరీత్యా చెల్లదని లా శాఖ అభిప్రాయ పడిందనీ, అటార్నీ జనరల్ కూడా ఆ ఒప్పందం ఇప్పుడు చెల్లనేరనిదిగా భావించాలని అన్నారనీ ఆయన తెలిపారు. ప్రారంభంనుంచీ సాక్షికంగా ఆ ఒప్పందం చట్టవిరుద్ధమే అన్నారుట అటార్నీ జనరల్.

ఈ మూడు, నాలుగైదు రాష్ట్రాల ప్రజలు ఈ మూడు సంవత్సరాలలో గుల్జారీగారి పేరు ఉచ్చరించినంత తరచుగా ఘంటాసురుడుకూడా శ్రీహరి నామం ఉచ్చరించి ఉండడు. మార్చి 23 వ తర్వాత రికార్డు బ్రేకయింది. గుల్జారీగారే శిష్ట రక్షణ! దుష్టశిక్షణకీ దిగి వచ్చిన శ్రీహరి అవతారమైతే- ఈ పాటికి 2,21,000 చ.మై. కృష్ణా గోదావరీ ప్రాంతాలలో నివసిస్తున్న ఆరుకోట్లమంది దాక్షిణాత్యులకీ స్వర్గ ద్వారాలు తెరుచుకొని ఉండాలి.

నదీజలాల ప్రవాహప్రమాణాలను 86 శాతంగా లెఖ్ఖవేస్తే (అంటే నూరు సంవత్సరాలుగా ఏటేటా ఎంతెంత ప్రవాహం నదిలో వుందో లెఖ్ఖలు తీసి, తక్కువ నీరున్న పద్నాలుగు సంవత్సరాల కొలతల్ని విస్మరించి, అవరోహణాక్రమంలో 86 సంవత్సరాల నీటి ప్రమాణాలను ప్రాతిపదికగా తీసుకోడం) కృష్ణలో నీరు 1746 శతకోటి ఘనపుటడుగుల నీరు ఉండవచ్చునని 1951 వ సంవత్సరంలో నిర్ణయించబడింది. ఆ ప్రాతిపదికని కాదని, కేంద్రమంత్రి 75 శాతాన్ని ప్రాతిపదికగా స్వీకరించారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని ఆంధ్రులు వాదిస్తున్నారు.

"మహారాష్ట్రంలోనూ మైసూరులోనూ నిర్మిస్తున్న, నిర్మించనున్న ప్రాజెక్టుల కన్నిటికీ తలఊపి, ఆంధ్ర ప్రాజెక్టులకు షరతులు విధిస్తున్నారు. మూడో ప్రణాళికలో చేర్చిన ప్రాజెక్టుల కోసమే 764 శ. కో. ఘ. అడుగుల నీరు కావాలి. ఐతే—ఇక రానున్న ప్రాజెక్టులకై మిగిలేది 36 శ. కో. ఘ. నీరేనా? ఖోస్లా కమిటీవారే నాగార్జున సాగర్‌కి 300 శ. కో. ఘ. కావాలన్నారే? వీళ్ళు 264 ఇస్తానంటారేమిటి? కృష్ణా డెల్టా ప్రాంతాలకి కావల్సిన 186 శ. కో. ఘ. నీటి ప్రస్తావన లేదే? పోచంపాడు వద్ద మొత్తం 220 శ. కో. ఘ. నీరు అవసరమైతే, 66 మాత్రం అనుమతించబడింది గదా? మహారాష్ట్ర వేసిన పది విద్యుచ్ఛక్తి పథకాల క్రింద 226 శ. కో. ఘ. నీటిని అరేబియన్ సముద్రంలోకి తరలించడం ఏం న్యాయం?"—ఇదీ శ్రీ పిల్లలమర్రి వేంకటేశ్వర్లుదీ, ఇతర ప్రతిపక్ష నాయకులదీ స్థూలంగా వాదం. వాదంలో ఒక భాగం.

"1951 వ సంవత్సరపు ఒప్పందం కంటె, ఇప్పుడు మనకి ఎక్కువ నీరు వస్తుందా తక్కువే వస్తుందా అన్నది అప్రస్తుతం. నదీజలాలను ఎవరు ముందుగా ఉపయోగించడం ప్రారంభించారో, అంత వరకూ వారిది హక్కు. అది కాదనడానికి తర్వాత ప్రాజెక్టులు నిర్మించేవారికి హక్కు లేదు. ఈ సూత్రాన్ని ధ్రువపరుస్తూ అమెరికన్ సుప్రీమ్ కోర్టు నిర్ణయాలున్నాయి. (వ్యోమింగ్ వెర్సస్ కొలరేడో, నెబ్రాస్కా వెర్సస్ వ్యోమింగ్) ఈ సూత్రాన్ని ప్రాతిపదికగా చేసుకోడంలోనే 1951 వ సంవత్సరపు సుగుణం ఉంది. ఈ సూత్రం గమనించకనే, నాగార్జున సాగర్ పనికి ఆపివేయమని మైసూరు, మహారాష్ట్ర గోల చేస్తున్నాయ్. సంప్రదాయసిద్ధంగా వచ్చే హక్కులకు ప్రస్తుతనిర్ణయం ఒక గొడ్డలి పెట్టు. ఈ విధంగా చేస్తే—రెండు శతాబ్దాలనుంచి దివిసీమ ప్రజలు అనుభవిస్తున్న హక్కులేం కావాలి? ఉత్తర భారతంలో యూపీ పంజాబుల మధ్య, పంజాబు రాజస్థానుల మధ్య హక్కులన్నీ తారుమారౌతాయి" — అని, శ్రీ తెన్నేటి విశ్వనాథం, వారి మిత్రులూ, అనుయాయులూ చెబుతున్నారు. పైగా—1960 లో కేంద్రం ప్రతిపాదించిన 983 శ. కో. ఘ. లకు ఇప్పుడిస్తున్న 800 శ. కో. ఘ. లకు, 183 తేడా ఉంది. ఆ నీటితో పది లక్షల ఎకరాలవరకూ సాగు చేయవచ్చు అంటారు వారు.

"1951 వ సంవత్సరపు ఒప్పందం ప్లానింగ్ కమీషన్, కేంద్ర జల విద్యుచ్ఛక్తి కమీషన్ ప్రతినిధుల ఆధ్వర్యాన జరిగింది.

ఆ ఒప్పందాన్ని కాదని వారే అంగీకరించ తంలో న్యాయం లేదు. రాష్ట్ర శాసన సభల చర్చల తర్వాతనే గుల్హాతీ కమిషన్ నివేదికను వెలువరిస్తామని హామీ యిచ్చిన శ్రీ హా. మ. ఇబ్రహీం తమ మాట నిలబెట్టుకోలేక పోయారు. నదీ జలాలను ముందు దాహం తీర్చడానికి, తర్వాత నేల సాగు చేయడానికి, తర్వాత మాత్రం విద్యుచ్ఛక్తి అవసరాలకి ఉపయోగించా లన్నది జగమెరిగిన సూత్రమైనా, అరేబియా సముద్రంలోకి కృష్ణనీళ్ళు విద్యుచ్ఛక్తి కోసం తరలించడం అన్యాయం. నది ఎక్కడ నుంచి వస్తుందో అక్కడి వారి హక్కులకే ప్రాధాన్యం ఉంటుందంటే - మదరాసుకి కృష్ణనీరు ఎలా ఇస్తారు ?" అని శ్రీ వావిలాల ప్రభృతుల వాదన.

నదీమండలులస్థాపనను వ్యతిరేకించాలని వీరిలో చాల మంది వాదిస్తున్నారు. ప్రస్తుతం అంగీకరించడం లేదని మంత్రి శ్రీ సుబ్బారెడ్డి కూడా అన్నారు.

ఈ వాదనలన్నీ విని, తల ఊచిన తర్వాత, ఒక్క విషయం మనం గుర్తుంచుకోవాలి. పోచంపాడు, శ్రీశైలం ప్రాజెక్టులకు అనుమతి లభించడం వర్తమానంలో మనకు లాభం. పోలవరం - విజయవాడ కాలువ క్రమంగా రామపాదసాగరం కలలను కొంతవరకైనా నిజం చెయ్యవచ్చు. మహారాష్ట్ర ఇంకా కృష్ణనీరును పశ్చిమంగా తరలించడానికి వీల్లేదని కూడా మంత్రి చెప్పారు.

గుల్హాతీ కమీషన్ దేశానికి చేసిన గొప్ప సేవ సరియైన సమాచారం లేకుండా రాష్ట్రాలన్నీ ప్రాజెక్టులను నిర్మించుకుంటున్నాయనడంలో, ఆవిరైపోతూన్న నీరును గురించి, భూగర్భ జలాలను గురించి, జలాలను రైతులు ఉపయోగించుకొనడంలో పద్ధతి, క్రమం ప్రవేశపెట్టటం గురించి, నదులన్నీ - రాష్ట్రాల సరిహద్దు లెరుగని నదులన్నీ - వివిధ పరిపాలనా వ్యవస్థల క్రిందకి రావాలని సూచించడంలో ఉంది. కేంద్రప్రభుత్వం ఈ సందర్భంలో కొన్ని చర్యలు తీసుకొంటూంది, కొన్ని తీసుకోబోతోంది. 1976 నాటికి వేడి తగ్గి, మన ఏరులు ఎన్నెలల సొగసుల్ని మన పాలు చేసి మురిపిస్తాయని ఆశిద్దాం. ●



"నవ్వు నాలుగిందాల చేటు" అన్నారు. అలా అనని వాళ్ళు "సంతోషం సగం బలం" అన్నారు. ఏ కారణం లేకుండా సుంకహాసం చేయగలిగినవాళ్ళు పిచ్చివాళ్ళయినా అయివుంటారు; మహాత్ములైనా అయివుంటారు, అందుచేత మీరు ఊరికే నవ్వుతుంటున్నా. ఎందుకో నవ్వుకుంటున్నా పక్కింటి లావుపాటి పిన్నిగారు చూస్తే ప్రమాదం. ఏమైనా నిత్యదుఃఖితుడి కంటె నిత్యసంతోషి మెరుగు; మీకు నిత్య సంతోషం కలిగించాలనే "జ్యోతి" ప్రయత్నిస్తుంది. ఉదాహరణ కావాలంటే రత్నామహీధర్ వ్రాసిన "నవ్వండి" అనే స్కిట్ 57వ పేజీలో వుంది, చదవండి.

మానసోల్లాసము

వి.ఎ.కె. రంగారావు

ఆనందోపాసనకు ఆలోచన అవసరమైనట్లే ఆత్మావలోకనమూ అవసరమే. ఈ అవలోకనము , యోగులు, మునులు చేసే ఆత్మవిచారము - నేను అంటే ఎవరనే ప్రశ్న, ఆత్మ, మనసు, బుద్ధి వీటి తేడాల పరిశీలన — కాదు. సామాన్యమానవుని పరంగా చెప్పుకున్నప్పుడు ఆత్మావలోకనమంటే మనలో నున్న లోటుపాట్లను తెలుసుకోవడం. ఈ ఆత్మ పరీక్ష వలన బయటపడిన లోపాలు సరిదిద్దుకోగలిగితే మంచిదే కాని తెలుసుకోవటం అంతకన్న ముఖ్యం. కొన్ని లోట్లను సరిదిద్దుకోలేక పోయినా అవి మనలోవున్నవని గ్రహించడం వలన, అందువలన కలిగే అవాంఛనీయమైన ఫలితాలను కొంతవరకు నిగ్రహించుకోవచ్చు.

ఈ ఆత్మవిమర్శలో మొదట తెలుసుకోవలసింది మనలోనున్న స్వార్థం. తెలుసుకున్న వెంటనే ఈ స్వార్థవృక్షాన్ని కూకటి వేళ్ళతో పెళ్ళగించి పారవేయాలనే ప్రయత్నం మాత్రం చేయకూడదు. స్వార్థం అందరిలోను వేరు వేరు పాళ్ళలో వుంటుంది. ఉంటుంది కాదు ఉండాలి. లేకపోతే మనకు తెలిసిన విధంగా జీవిత చక్రం పరిభ్రమించదు. "స్వార్థం కూడదు, నిస్వార్థ జీవివై బ్రతుకుము" మొదలగు సూక్తులు రెండవ తరగతి, మూడవ తరగతి వాచకాలలో చదువుతాము. ఆ సూక్తుల ఆచరణకోసం ప్రయత్నం ఆ వయసులోనే ఆగిపోవాలి. అవే పెడబుద్ధులు పెద్దరికంలో అలవరచుకొనడం కన్నా తెలివితక్కువతనం మరొకటి వుండదు. ఈ ఆచరణలు యోగిపుంగవులకు, యతీంద్రులకు, పరమహంసలకు విడచిపెట్టవలసిందే. అలాకాక యెవరికి వారే తగుదునమ్మా అని ఆచరిస్తే జీవిత రథం పథం తప్పుతుంది. సంసారసాగరం సంక్షుభితమౌతుంది. మానవ వంశవృక్షం ప్రళయ ఝంఝానిలానికి తల్లడిల్లి పోతుంది.

ఆ ప్రమాదం వాటిల్లడానికి అవకాశం అంతగాలేదు. తరచి చూస్తే స్వార్థాన్ని మరచి నిస్వార్థ జీవితాన్ని గడిపేవారు

మహాత్ములు, మహిమాన్వితులు తప్ప ఒక్కరూ ఉండరు. కాని ఒక కార్యాన్ని తమ సంతోషం కోసమే చేస్తూ ఇతరుల కోసం నిస్వార్థంగా చేస్తున్నానని తమను తామే మభ్యపెట్టుకొనే వారు చాలమంది వుంటారు. మీరు కూడా అదే విధంగా ఆత్మవంచన చేసుకొంటున్నారా? కాఫీ హోటలు నుంచి బయటకు వస్తూ దేహి అని చేయి చాచిన బిచ్చగాని చేతిలో కాణీ వేసినపుడు మీ మనసులో వున్న భావమేమిటి? ఆహా, ఎంతటి ఉదారకార్యం చేస్తున్నామనా? సుష్టుగా తిని వచ్చిన తరువాత ఆకలికి మాడుతున్న మరొక మానవుణ్ణి చూస్తే కడుపులో కలియ బెట్టిందా? ఆ వికారాన్ని కానీ దానంతో తుడిచి పెడదామనా మీ ఉద్దేశం? ఎంత మంది కేవలం దానంగానే ఆ కానీని పరిగణిస్తున్నారు?

మరొక విషయం. ఈ రోజు ఒక స్నేహితునికి ఒక సహాయం చేశారు. ఎంత నిస్వార్థమైన పని చేశానని నలుగురితో చెప్పుకోకపోయినా మనసులో మురిపెంగా అనుకున్నారు. ఆరు నెలలయిన తరువాత ఆ స్నేహితుడు మీరు కోరినది చేయలేకపోతాడు. లేక కోరినది చేస్తాడు. అప్పుడు మీరనే, మీరనుకొనే మాటలు - కృతఘ్నుడు, చేసిన మేలైనా గుర్తు పెట్టుకోలేదు—యివేనా? మీరు మేలు చేసింది అతని కృతజ్ఞత కోరే అయితే అందులో వున్నది స్వార్థమేగా?

సరే. ఆ సహాయం చేసినపుడు అతని కృతజ్ఞత కోరలేదు. స్నేహితునికి మేలు చేయడమే ఆనందమని భావించి చేశారు, అయితే మీకు ప్రతి ఫలం - ఆ ఆనందం-ముట్టింది కదా! ఇంకెందుకు అతడు మీకు ఋణపడి వుండాలి?

ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా చేసిన పనే నిజంగా నిస్వార్థ కార్యమౌతుంది. అది సాధారణులకు సాధ్యం కాని పని. ఒకొక్కరు కోరే ప్రతిఫలం కూడా వేర్వేరు రూపాలలో వుంటుంది. కొంతమంది డబ్బు కోరతారు. వీరికి లంచగొండులనే నీచమైన నామాంతరం ఇస్తారు. కొందరు కీర్తిని కామిస్తారు. నచ్చితే గొప్పవాడంటారు. నచ్చకపోతే వారికి కీర్తి కండూతి అని నిరసిస్తారు. కొంతమంది కేవలం కృతజ్ఞతనే వాంఛిస్తారు. వీరిని స్నేహితులని పొగడుతారు. మరికొందరు ప్రేమను ఆరాధిస్తారు. వీరిని ఉత్తము లంటారు. ఎందుకూ అనురాగం కోసం త్యాగం చేశారని. ఆపేక్షకు విలువ కట్టాలనే నీచప్రయత్నం చేశారని నిందించరు. లంచగొండులకీ, వీరికీ, ఆ మాటకొస్తే పై వారందరికీ తేడా ఏమిటి? ఒకరు కోరేది ఒకటయితే మరొకరు కోరేది మరొకటి. తేడా, కోరిన ప్రతి ఫలంలో వుంది కాని చేసిన పనికి బదులు కోరడంలో లేదు.

ఆనందాన్వేషకులు గమనించ వలసినది అది. ఇతరులు నిస్వార్థంగా ప్రవర్తిస్తారనే భ్రమనుంచి వైదొలగాలి. ఇతరులకు సహాయం చేసేటప్పుడు వారినుంచి యేది వాంఛిస్తున్నామో, యేది పొందగలమో ముందే తెలుసుకో గలగాలి. అప్పుడే అనవసరమైన అపనిందలు వేయము. భరించము. అప్పుడే ఆనంద సోపాన పంక్తిలో మరొక ముఖ్యమైన మెట్టు యెక్కినట్టు. ●






నాకు చూపించవూ? ప్లీజ్-


అహా.
నీకాపీ నువ్వు కొని చూసుకో


సన్నగా పొడుగ్గా చక్కగా వుండే విగ్రహం—
విశాలమైన కళ్లు — చిరునవ్వులొలికే నోరు—
కాలేజీ చదువూ సంస్కారం ఉట్టిపడే స్వరూపం-
అందాతి అందం - చందాతి చందం - ఆహా! ఓహో!
బ్యూటిఫుల్ - వన్స్‌మోర్ - బ్యూటిఫుల్!


ఐతే - ఆ బొమ్మ నాదే అన్నమాట!
ఏయ్ ఏయ్ ఇలాతే-





మగవారి మాటలకు మరో అర్థముందిలే

ముందు పేజీలలో మీరు చూసిన ఈ ఆహ్లాదకరమైన ఛాయాచిత్ర కథను రూపొందించినవారు భూషణ్. ఇందులో నాయికా నాయకులు వాసంతి, హరనాథ్‌లు మా ప్రార్థన వివరించగానే హుషారుగా ఒప్పుకుని, సరదాగా ఈలవేసి (హీరో మాత్రమే) సహకరించారు, వారి ఉత్సాహంవల్ల మా "షూటింగ్" కార్యక్రమం కూడా ఉల్లాసంగా జరిగిపోయింది.

ఆ రోజున మద్రాసు బీచిరోడ్డులో ఆఫీసువేళ ట్రాఫిక్ రద్దీగా వుంది. అంత హడావిడిలోను పలువురు తీరిక చేసుకుని ఆగి, మా హీరో హీరోయిన్‌లను-బహుశా మమ్మల్ని కూడా చూసి-ఆనందించారు. విద్యార్థులు చాలమంది వచ్చారు. వాసంతిని చూసి అమ్మాయిలు. హరనాథ్‌నుచూసి అబ్బాయిలు లక్కీ-ఫెలో అన్నట్టు నవ్వారు.

"అవర్ బ్రదర్స్ --" అన్నాడు హీరోనాథ్ బి య్యే.

" --ఎండ్ సిస్టర్స్" అంది వాసంతి బి. ఎల్ (ఇంటర్వెల్).

"డ్యూయట్టు పాడతారా" అన్నాడు ఫొటోగ్రాఫరు భూషణ్.

ఈ సన్నటి చక్కటి చిన్నది, చురుకైన పొడుగైన చిన్నవాడు అనురూపావారి "అనురాగం"లో అనురాగ మనురాగాన్ని సర్వజన మనోహరంగా ప్రస్తరిస్తున్నారన్న సంగతి మీకు తెలిసిందే.

డబ్బు! డబ్బు!

ధనమూల మిదం జగత్
అందుకే ధనాన్ని.... ....

కార్మికుడు ఆర్జిస్తాడు
బ్యాంకరు అప్పిస్తాడు
నకిలీగాడు అనుకరిస్తాడు
ఆడవాళ్ళు ఆర్పేస్తారు
అల్లుడు ఆరగిస్తాడు
అల్పుడు అడుక్కుంటాడు
కోడలు కొట్టుకొస్తుంది
ధర్మాత్ముడు దానం చేస్తాడు
ధనవంతుడు వృద్ధిచేస్తాడు
దూబరాగాడు తగలేస్తాడు
పన్నువేసేవాడు గుంజేస్తాడు
చచ్చేవాడు వదిలేస్తాడు
వారసుడు స్వీకరిస్తాడు
కూడబెట్టేవాడు దాచేస్తాడు
బందిపోటు దోచేస్తాడు
జూదరి పోగొట్టుకుంటాడు

మరి మీరో................ ?
60 న. పై. పెట్టి "జ్యోతి" కొంటే
అదే వాళ్ళకు పదివేలు
అందులో మీ నికర లాభం
తొమ్మిదివేల తొమ్మిదివందల నలభై న. పై.

జి. జి. కె.

సంభాషణలు

కొడవటిగంటి కుటుంబరావు
రావి కొండలరావు

క్త్వార్థక్రియ

—పరీక్షలొస్తున్నాయి, కాస్త శ్రద్ధగా చదవరా!

— చదివి?

—పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకో

—తెచ్చుకుని?

—మంచి ఉద్యోగం సులువుగా సంపాదించుకో

—సంపాదించుకుని!

—డబ్బు గడించుకో

—గడించుకుని?

—పెళ్ళాం పిల్లల్ని పోషించుకో

—పోషించుకుని?



—(విసుగెత్తి) నీ యిష్టం వచ్చినట్టు చావు!

—చచ్చి?......

అగ్నిపరీక్ష

—అబ్బాయ్, ఒకచిన్న సలహాచెప్పూ.

—ఓ, ఏ విషయం?

—నాదగ్గర ఒక అయిదువేలు చేరింది. ఏంచేస్తే బాగుంటుందంటావు?

—ఏదన్నా పెట్టుబడి చేస్తేసరి.

—అదేగా నిన్నడుగుతూంట?

—ఇళ్లస్థలం కొనిపారెయ్యి.

—పారెయ్యమన్నావుకావు నయం. చేతిలో ఉన్నడబ్బుకాస్తా పోతుంది. స్థలం స్థలంగానే ఉంటుంది.

—ఇల్లుకట్టి అద్దెకియ్యి.

—ఇల్లు కట్టటానికి డబ్బేది? మన కొచ్చే అద్దెకన్న అప్పుమీద వడ్డీ జాస్తి అవుతుంది.

—వడ్డీ కావాలంటే ఎవరికన్నా అప్పు పెట్టు.

—బాగాచెప్పావులే. వాడు కాస్తా ఎగ్గొడితే కోర్టుచుట్టూ తిరగలేకచావాలి.

అయితే సేవింగ్స్‌బాండ్లో, సర్టిఫికెట్లో కొను.

—పావలా వడ్డీరాదు. ఇదేనా నీ సలహా?

—పోనీ ఏదన్నా వ్యాపారం చెయ్యి.

—నష్టం వస్తే?

—నీకు నష్టం రాకూడదు, మంచి వడ్డీ గిట్టుబాటుకావాలి, వడ్డీలకివ్వగూడదు, డబ్బు స్థిరాస్తిగా మారరాదు, చరాస్తిగాను ఉండరాదు! ఇక నేను నీకేంచెప్పనూ?

—నేను నువేదో చెబుతావుగదా అనుకుంటే, నువు నన్నే అడుగుతున్నావూ? సరిపోయింది!...

అనుమాన పిశాచి

—ఈ చీనా వాళ్ళున్నారే-

—ఏ చీనావాళ్ళు?

—ఏ చీనావాళ్ళేమిటి? నా శ్రాద్ధం!

—సిల్కు అమ్మేచీనావాళ్ళా? పళ్ళుకట్టే చీనావాళ్ళా? రంగుకాగితాల చుట్టలూ, విసనకర్రలూచేసే చీనావాళ్లా? హోటళ్ళు నడిపే చీనావాళ్లా?...

—వీళ్ళమాట కాదోయ్. రాజకీయాల మాట చెబుతున్నాను!

—రాజకీయంగా అయినా హాంకాంగ్‌లో చీనావాళ్ళున్నారు. మలయాలో ఉన్నారు. సింగపూర్లో ఉన్నారు. ఇండోచీనాలో ఉన్నారు. కొరియాలో వున్నారు. తాయివాన్‌లోవున్నారు. అమెరికాలో వున్నారు — ఎవరని?



—మనసరిహద్దున అఘోరిస్తున్న వాళ్లు!

—ఏది మన సరిహద్దు? నీఫాసరిహద్దా, లడాఖ్ సరిహద్దా, సింకియాంగ్ సరిహద్దా, నేపాలు సరిహద్దా, భూతాను సరిహద్దా — ఏ సరిహద్దు?

—మాక్‌మహాన్ సరిహద్దు మాటోయ్!

—అదెక్కడ వుంది? ఎవరికీ స్పష్టంగా తెలీటంలేదుగా? వాళ్లొకటంటున్నారు, మనవొకటంటున్నాం! వాళ్ళదినిజమా, మనదినిజమా? చర్చలు సాగితేగాని తేల్దు. చర్చలింకా జరగలేదు. అప్పుడే జరిగేట్టులేవు. మనమప్పుడే మక్‌మాహన్ సరిహద్దంటే ఎలాగా?

—నీతో మాట్లాడవే బుద్ధిపొరపాటు!

—ఎంచేత బుద్ధిపొరపాటూ?

—నా బొందచేత!

—బొంద అంటే అర్థవేవిటీ? ఆమాట నిఘంటువులోకూడా లేదే?...

తూటుకుండ

—"ఏంమనుషులు!" పిక్చరు చూశారూ,

—చూశాను.

—తప్పకుండా చూడవలసిన పిక్చరు.

—నాలుగుసార్లు చూశాను.

—అసలు టైటిల్సే తమాషాగాఉన్నాయి

—చూశాను.

—టైటిల్స్ బాక్‌గ్రౌండ్‌లో అన్ని పాటలూ కొంచెం ఇరికించారు.

—అది రికార్డు చేసేటప్పు డక్కడే ఉన్నాను.


—కథ ఎంతషోగ్గా-

—అవును

—మధ్యలో ఎత్తుకుని-

—అలా చెయ్యమని నేనే సలహా ఇచ్చాను.

—పాత కథంతా అక్కడక్కడా ఫ్లాష్ బాక్ ఇచ్చుకుంటూ-



—అదీ నా ఐడియామే.

—కాని సత్యనారాయణ మేకప్‌లో తేడా లేకుండాపోవటంచేత కొంచెం కన్‌ఫ్యూషన్-

—నే చెబితే విన్నారుకారు.

—ఆ డ్యూయెట్‌లో సత్యవతి సైలెంట్ యాక్షన్ అద్భుతంలెండి! మీరు చూసి తీరాలి.

—షూటింగప్పుడు నేను సెట్టుమీదే ఉన్నాను.

—కాని క్రెడిటంతా సత్యవతికిస్తే నేను ఒప్పుకోను. డైరెక్షనండీ, డైరెక్షను!

—నాకు తెలుసు. డైరెక్టరు మా అన్నయ్యే.

—ఏమిటీ, చెప్పారుకారూ? అయితే మీరు పిక్చరు చూసేఉంటారు! ఎన్నాళ్ళు నడుస్తుందంటారు.

—రెండోవారం కాగానే ఎత్తేస్తున్నారు.

—తొందరపనుంది, వస్తా!...

నానుడుకట్టె

—భలేగమ్మత్తు జరిగింది, తెలుసా?

—ఏవిటది?

—నవ్వినా నాపచేనే పండుతుందని ఊరికే అన్నారా?

—ఏవిటా గమ్మత్తు?

—అసలు మా అమ్మమ్మ బతికి వన్నాళ్ళూ చెబుతూనే ఉండేది: నమ్మి చెడినవాళ్ళేడు, నమ్మక చెడిపోతే పోమేరూ అని!

—ఏమిటా గమ్మత్తు?

—నిజంగా ఆవిడ అన్నట్టే మా నాన్న నమ్మక చెడ్డాడు. పొలాలకి మళ్ళీ ధర లొస్తాయి, తొందర పడకయ్యా అంటూంటే వినక ఎకరం ఎనిమిదొందల కాడికి ఉన్నదంతా అమ్మిపారేశాడు. ఇవాళ ఎనిమిదొందలకి ఎనిమిది సెంట్లు కూడా రావటంలేదు. అంచేతా-

—ఏవిటో గమ్మత్తన్నావు, ఏవిటది!

—గమ్మత్తుకాదూ మరీ? నువు దాచేపల్లి కిష్టయ్య నెరుగుదువు గదా.

—అతనికి సంబంధించిన గమ్మత్తేనా?

—అబ్బ కాదయ్యా! నమ్మి బాగుపడ్డవాడంటే కిష్టయ్యను చెప్పాలి. మా నాన్న జ్ఞాపకం వచ్చినప్పుడల్లా విధిగా దాచేపల్లి కిష్టయ్య జ్ఞాపకం వొస్తాడు మరి. వస్తాడంటే రాడూ?-

— ఏవిటా గమ్మత్తు:

—గమ్మత్తా? గమ్మత్తేవిటి?

—ఏవీ లేదని నేను మొదటే అనుమాని చాలే.

—ఇదుగో! నిన్నే! ఆ గమ్మత్తేదో నాక్కూడా కాస్త చెప్పి పోదూ!...... ఇదుగో! ఛీ, ఏం మనిషి!......

కబంధుడి పట్టు

—ఇక చచ్చినా పానకాలరావును నమ్మను.

—ఏం?

—ఏ పానకాలరావన్నైనా అడగ లేదేం?

—నువు చెబుతుంటే అదే తెలుస్తుంది గదా అనుకున్నాలే. ఏ పానకాలరావు?

—పోస్టాఫీసు కెదురు సందులో ఉంటాడే - నొక్కులజుట్టూ, ఇంతలావద్దాల కళ్ళజోడూ, పీక్కుపోయిన దవళ్లూ-

—తెలీదు.

—తెలీదూ? అయినా ఫరవాలేదు. మనిషి తత్వం చెబుతావిను. అర్జంటుగా పదిరూపాయలు సర్దుతావుటయ్యా అన్నా. తప్పకుండా సర్దుతాను. దీపాలుపెట్టేవేళ రమ్మన్నాడు.

—ఊఁ.

—వెళ్లా! ఇంటోలేదు. సినిమాకెళ్ళాడు. రాత్రి పద్దాకా రాడన్నారు.

—ఊఁ.

—నువు వింటంలేదు. వింటే అలాగా అని ఆశ్చర్యపడొద్దూ?

—ఆశ్చర్యపడుతూనే ఉన్నానయ్యా. బాబూ. చెప్పుకుపో.



—మర్నాడుపొద్దున వెళ్లా. ఇంటోనే ఉన్నాడు. కాని చేతిలో ఉన్నదికాస్తా అయిపోయిందిటా. సాయంతరం కనిపించమన్నాడు. వెళ్లా. ఎవరో ఇస్తామన్నారుట. ఇంకా వాళ్లు రాలేదుట. కాస్సేపు కూచోమన్నాడు. నాలుగ్గంటలుకూచుని, బస్సులేక నడిచి ఇంటికి అఘోరించా.

—అలాగా?

—అలాగా అంటావేవిటయ్యా? ఎంత ఘోరవనో, ఎంత దురన్యాయవనో అనకా!

—కాదూ మరీ?

—నువు సరిగా వింటంలేదు.

—వింటూనే ఉన్నానయ్యా. బాబూ. ఆతరువా తేవయిందీ?

—మర్నాడుపొద్దున, అంటే ఇవాళ పొద్దునవెళ్ళా. ఇంటోలేడు! ఉన్నాడోలేడో నే చూసేదిచానా ఏవిటి? లేడన్నారు. ఎప్పుడొస్తాడన్నా. ఏవోనన్నారు. వింటున్నావా?

—ఊఁ!

—నువు వినటంలేదు. వింటున్నవాడివైతే ఆశ్చర్యపడిపోయి "అలాగా?" అనవూ

—నన్నుచంపక చివర కేంచేశాడో తెములూ!

—ఇంకా చేసేదేవిటి? ఏవీ చెయ్యలేదనే చెబుతూంట. ఇవ్వదలచనివాడు-పోనీ ఇవ్వలేనివాడు- మరోచోట చూసుకోమని చెబితే సరిపోదూ?

—ఉఁ హూఁ!

—ఉఁహూఁఏమిటి? నాదారిననేను వాగుతున్నాను. నువ్వింకేదో ఆలోచిస్తున్నావు.

—ఇదుగో, పదిరూపాయలు, పని గడుపుకో.

—పదిరూపాయలక్కాదయ్యా. నాపని గడిచేపోయింది. మనిషిధోరణికి చెప్పా...

అటూఇటూ

—కాని, వెంకటేశంగారు నిజాయితీఐన మనిషి. బ్రతికినన్నాళ్ళూ రాజులాగా బ్రతికాడు. చచ్చినా రాజులాగే చచ్చాడు.

—పాపం!

—పాపంఏమిటండి-బ్రతికాడంటేసరా- ఒక ధర్మసత్రం కట్టించాడా- ఒక వృక్షం నాటించాడా? ఏం గొప్ప సాధించాడు?

—అవును-

—అవునంటే ఒప్పుకోవాలిగాని. ఆ పిల్లలు సామాన్యులుటండీ- ఓపట్టాన ఒప్పుకోరు ఏదానికీ- కానీ, ఖర్చుపెట్టనిచ్చేవారు- వెంకటేశంగారు ఏం చెయ్యగలడు?

—అలాగామరి!

—అలాగే మరేం కాదులెండి. కొడుకులు అంతగా ఖర్చు పెడుతూ వుంటే నోరుమూసుకున్న తండ్రిని ఇతన్నే చూశారు. సాగదీసి చెవులు రెండూ ముయ్యాలి. వాళ్ళన్నదే మాటా, ఆడిందే పాటా ఐతే ఎట్లా?

—మమకారం!

—మమకారమా, సింగినాథమా! మరి మనకు పిల్లలు లేరా - మనకు మమకారాలు రావా-

—నిజమే లెండి.

—నిజమే ఐనా, కొంత హద్దులుండాలి. పిల్లల్ని మనం చూడాలిగాని పరాయి వాళ్ళు చూస్తారటండీ-మనం దేనికి కన్నాం పిల్లల్ని?

—కాదామరి?

—కాదామరి అని అంత సపోర్టు చేస్తే చస్తాం మళ్ళీ. హద్దులు లేకపోబట్టి వెంకటేశంగారు అట్లా చచ్చాడు:

—మ్చ్ !

—అంత పెదవి విరవాల్సింది ఏంలేదు లెండి. చేసుకున్నవాడికి చేసుకున్నంత !

—అంతేగా !

—అంతే ఐనా, దాన్ని మనం తప్పుకోవచ్చును. అది మనచేతిలో తిరగాలిగాని, కర్మచేతిలో మనం తిరగరాదు. ఏమంటారు?

—ఏమీ అనను !

తలోదారి

—లక్షమ్మగారూ - పేపర్లో ఈవార్త చదివారూ ? పాము ఆరేళ్ళకుర్రాడిని అమాంతంగా మింగేసిందట !

—అట్లాగేం ! మా చిన్నతనంలో ఒకసారి ఏం జరిగిందంటే-



—అన్నట్టు నేను పదేళ్ళమ్మాయిని. తోటలో నేను మానేస్తం చుక్కమ్మా- చుక్కమ్మను మీరెరుగుదురుగా, రంగనాథరావుగారి కోడలు-

—మేమందరం దాగుడుమూతలు ఆడుకుంటున్నాం. ఇంతలో ఎక్కడ్నుంచి వచ్చిందోగాని పిన్నిగారూ-

—చుక్కమ్మ ముందు పామును చూడనేలేదు. నేను చూశాను. చూసేసరికి ఏమైందీ- పేద్ద—

—ఎంతలావుందో నేను చెప్పలేను. ఇంతింత కోరలు, ఇంకా తోకా-

—ఆ కేకకు ఎవరూ రాలేదు. ఎవరొస్తారు చెప్పండీ. ఆ మారుమూల ? నేనే ఒక పెద్ద కర్రతీసుకుని-

—మహా భయంకరంగా వుందనుకోండి. అసలే మేము పాము అంటే ఎరగం. మరీ చిన్నపిల్లలమాయె-

—కర్ర తీశానేగాని,

—మేం ఏంచెయ్యగలం. అలా...

వండర్ ఫూల్

—నిన్న నేనూ వెంకటరత్నంగారూ సినిమాకు వెళ్ళాం-

—సినిమాకు !

—అవును సినిమాకే. వెళితే, మా యింట్లో ఎవరూ వుండరని, మా పాత మిత్రుడు

—పాతమిత్రుడు!

—పాతమిత్రుడే. ఎందుకూ దానికంత ఆశ్చర్యం? సాంబశివరావును ఇంట్లో కాపలా వుంచాను.

—కాపలా!

—నీఆశ్చర్యం మండిపోను! వుంచితే వాడు అర్ధరాత్రివరకూవుండి, మాతో చెప్ప కుండా తలుపులు

—తలుపులు!

—తీసుకొని వాళ్ళింటికి వెళ్ళిపోయాడు!

—వాళ్ళింటికి!

మాటపొదుపు

—ఇదిగో అబ్బాయ్!

—ఆఁ!

—మీ నాన్నగారున్నారా?


—లేరు.

—ఎక్కడికెళ్లారు?

—ఏమో.

—ఎప్పుడొస్తారు?

—ఏమో.



—వూళ్లోనే వున్నారా?

—ఆఁ!

—సాయంకాలానికల్లా రా వచ్చు నా ఏవిటి?

—తెలీదు.

—రేపుదయం వస్తే వుంటారా?

—తెలీదు.

—సరే, నేను వచ్చేనని చెబుతావురా?

—ఆఁ !

ఆంగ్లాంధ్రులు

—విల్ యూ ప్లీజ్ టెల్ మీ వేర్ ది రామచంద్రయ్యర్ స్ట్రీట్ ఈజ్!

—రామచంద్రయ్యర్ స్ట్రీటా - అటు ప్రక్కకెళ్లాలి - ఈ రోడ్డుకు సరాసరి!

—విల్ ఇట్ బి టూ ఫార్?

—ఆఁ అంత దూరం వుండదులెండి. నాలుగు ఫర్లాంగులు!

—ఈజ్ దేర్ ఎనీ బస్?

—ఆఁ బస్సా - బస్సెందుకండీ. నడిచిపోవచ్చును.

—ఆల్ రైట్. ఐ హావ్ టు గో స్ట్రెయిట్ — ఈజిన్ టిట్?

—స్ట్రెయిట్‌గా వెళ్ళి, అదిగో అక్కడ తిరగాలి, తిరిగి, మళ్ళీ కుడికి వెళ్ళి అక్కడ అడగండి.

—థాంక్యూ. ఎందుకులెండి. రిక్షా చేసుకునిపోతాను—

—బెటర్— ఇటీజ్ సో కాంప్లికేటెడ్—

—అదే, అందుకే రిక్షాలో పోతే —

—యూ కెన్ టేక్ ఏ రిక్షా దేర్!

—వస్తానండి ●

రుక్మిణీదేవికి అరిసెలూ, అప్పాలూ ఇష్టము. సత్యభామకు తీపి సహించదు. ఎప్పుడైనా ఏ నోముకైనా తీపిచెయ్యడం తప్పనిసరైతే ఆవుపాలతో అటుకుల పరమాన్నము చేయిస్తుంది, అంతే.

రుక్మిణీదేవికి మినపపప్పు పచ్చడిమీద మోజు. కమ్మగా వేయించిన మినపపప్పు ఘుమఘుమలనుబట్టి తెలుసుకోవచ్చు, అది రుక్మిణీదేవి పాకశాలా ప్రాంతమని. సత్యభామకు మామిడికోరు పెరుగుపచ్చడి మహాఇష్టము. తనే స్వయంగా కోరుతుంది పక్వానికొచ్చిన మామిడికాయను. పోపులో ఒక్క చిటికెడు ఆవాలు, ఉండీలేనట్టు-కాస్త కరివేపాకు. కాని, ఏమి సువాసన! సత్యభామకోసమని ఆమె తోటలో పన్నెండు నెలలూకాసే మామిడి అంటును పాతించాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడు రుక్మిణీదేవి ఇంటికొస్తే ఏమి అట్టహాసము, ఏమి వైభవము! అదేదో కల్యాణంలా ఉంటుంది, తూర్యనినాదాలతో. అతను వస్తున్నాడనగా, గబగబ కాళ్ళు తొట్రుపడుతూ, ద్వారబంధముకేసి పరుగెత్తుకు వస్తుంది రుక్మిణి. వసంతపు నీళ్ళతో దిష్టితీసి, హారతిచ్చి, కాళ్ళుకడిగి, ఆనీళ్ళు నెత్తిమీద చల్లుకుంటుంది. తనపైట కొంగుతో అతనిపాదాలనొత్తి, పదిలముగా శ్రీకృష్ణుని లోనికి తీసుకువెళుతుంది పాలపోళీలు ఫలహారం పెట్టడానికి.

సత్య ఇంటికొస్తే అలాకాదు. శ్రీకృష్ణుడు సత్యాదేవి అంతఃపురానికి ఎప్పుడు వస్తాడో ఎప్పుడు వెడతాడో ఎవరికీతెలియదు! ఆమె గుమ్మంఎదుట నిలుచున్న ప్రతీహారిమాత్రం ప్రభువుకు వంగి నమస్కారం చేస్తాడు. పరిచారిక పైడిపాదుకలను తొడుగుతుంది. పంజరాలలోని చిలుకలు "ఇటు, ఇటు, స్వామీ!" అంటూండగా, "సత్యఏదీ? "సత్యఏదీ?" అంటూ వెతుక్కుంటూ వెళ్ళవలసిందే శ్రీకృష్ణుడు. అంతఃపురంలో ఎక్కడా కనిపించదు సత్య. ఆవతల వసంతోద్యాన వనంలో, పోకమొక్కల మధ్య పచ్చిక తివాసీమీద కూర్చొని కళ్ళెదుట చలువరాతి కాలువలో ప్రవహించిపోతూన్న చల్లని నీటిని కాళ్ళతో చిలుకుతూ, కృష్ణుని మెడలో వెయ్యటానికి పొగడదండను గుచ్చుతూ ఉంటుంది సత్య. "ఇక్కడున్నావా సత్యా!" అంటూ దగ్గరకు వస్తాడు శ్రీకృష్ణుడు. పూలదండతోనే లేవబోయే ఆమెను వారించి, ఆమెను తన నిండు కౌగిటిలోకి తీసుకుంటాడు. పైడిగిన్నెలో ఉంచిన పటికబెల్లమూ ఏలకపొడుమూ కలిపిన నిమ్మపండ్ల పానకము అతని పెదవుల కందిస్తుంది సత్య. తాను రుచిచూచి మరీ ఇస్తుంది కృష్ణునికి ఇష్టమైన అల్లనేరేడు పండ్లను, అతనికి.

ఎప్పుడైనా ఊరి ప్రయాణము వస్తే, రుక్మిణీదేవి ఇట వారంరోజులు ముందునుంచీ ఏక హడావుడే! క్రొత్తబట్టలు కుట్టించడమూ, క్రొత్త సరంజామూ ఏక తొందర తొక్కిడిగా ఉంటుంది. అందరూ అన్ని

ఆచంట జానకిరామ్

పనులూ చేస్తున్నా. బయలుదేరేవేళ మించి పోతున్నా. రుక్మిణీ, ఇంకా తెమలదు. ఇంకా సర్దుతూనే ఉంటుంది. ఒక పట్టానగాని పూర్తిగాదు ఆసర్దుడు. శ్రీ కృష్ణుడు చిరాకు పడతాడుకూడాను. ఎలాగో అలాగ తయారై రధమెక్కినా ఏదో మరచిపోయానంటూ రుక్మిణి మళ్ళాఒక్కమారు అంతఃపురంలోకి వెళ్ళవలసిందే!

సత్యభామ అలాకాదు. వారు ప్రయాణము మీద వెళుతున్నారని తెలియనే తెలియదు ఎవరికీని. ఆఖరు నిమిషంవరకూ కూడా సత్యభామ తోటలో ఏదో పని చేయిస్తూనే ఉంటుంది. మాధవీలతను మామిడిచెట్టుపైకి తానే స్వయంగా ఎక్కించాలి. జాజిపందిరను సరిజేయించాలి. బొండు మల్లె మొక్కలకు బోదులు చేయించాలి. రథం సిద్ధమైంది అని కబురు వచ్చాకనే. తన గదిలోకి వెళ్ళి పేము పెట్టెలో రెండు తెల్ల జరీచీరెలూ, రెండు పట్టు రవికెలూవేసి. కృష్ణునికి రెండు జతలబట్టలుతీసుకుని. "పదండి. వెడదాము!" అంటుంది, సత్య. "ఏమన్నా కావలిస్తే అక్కడ కొనుక్కోవచ్చు లెద్దురూ!" అంటుంది. కాని, బంగారపు పంజరంలోని తన పెంపుడు చిలుకను మాత్రము మరచిపోదు. "అక్కా! అక్కా!!" అంటూ ఆ చిలుక ఎక్కడకు వెళ్ళినా ఉండవలసినదే!

నగల విషయంలో, ఒంటినిండా నగ లుంటేగాని తోచదు, రుక్మిణీదేవికి. ఒక్క నగ లోపించినా ఏదో బోసిగా ఉంటుంది, ఆమెకు. మెళ్లో కంటే, కట్ల కాసుల పేరూ. నడుమున గజ్జల వడ్డాణమూ చేతులకు వంకీలూ దండ కడియాలూ ముక్కుకు అడ్డ బాసా. ముక్కుపుడకా చెవులకు దుద్దులూ బవిలీలూ, తలపైన నాగరమూ కాళ్ళకు అందెలూ కడియాలూ - ఇవన్నీ ఉండవలసి నదే.

సత్యాదేవికి ఇన్ని నగలూ ఉన్నాయి. తమ పుట్టింటారిచ్చిన వజ్ర వైడూర్యాలు తాపిన రకరకాల గాజులూ ఉన్నాయి. ఎన్నోజతలు. కాని, ఆవేమీ పెట్టుకోదు, సత్య. మెళ్ళో మంచి ముత్యాల పేరూ ముక్కున మూడు పలకల ముక్కుపుడకా. చెవులకు కనక పుష్పరాగపు కమ్మలూ, మోచేతిదాకా జాజిరేకులకంటే సన్నని రంగు రంగుల సాదాగాజులూ నడుమున వయ్యారమైన పటకా వడ్డాణమూ. అంతే. అన్నట్టు అప్పుడప్పుడు, బుద్ధి పుట్టినప్పుడు, తలపైన ముద్దులు మూటగట్టే రత్నాల చంద్రవంక పెట్టుకుంటుంది, శ్రీకృష్ణుని కోసము.

రుక్మిణీదేవి నిత్యమూ విధిగా ఒంటినిండా పసుపు పూసుకుంటుంది. ముఖాన అరకాసంత కుంకము బొట్టు పెట్టుకుంటుంది. సత్యకు పసుపు గిట్టదు. ఏదో, శాస్త్రం కోసం కుడిచెంప పైన కాస్తా పాదాలపైన కాస్తా. కనిపిస్తాయి పసుపు ఛాయలు - అంతే. ముఖాన, కనిపించీ కనిపించనట్టు మిణుకు మిణుకు మంటుంది నక్షత్రమంత కస్తూరి బొట్టు.

ఒకనాడు మాత్రము, గౌరిదేవీ వ్రతము చేస్తూ, సత్యాదేవి ఒంటినిండా పసుపు పూసుకుని తలంటి నీళ్ళు పోసుకుని, అగరు ధూపాలతో తడి ఆర్చిన తలకట్టునిండా సంపెంగ పువ్వులు తురుము కుంది. ముఖాన కళ్యాణపు బొట్టూ, బుగ్గను చుక్కా. చలువ చెయ్యని జరీఅంచు తెల్ల జరీచీర; చంద్రకాంతపు రంగు మఖమల్ రవికె. మోచేతిదాకా. మంచిగంధము పూసుకుని. కళకళ్ళాడుతూ వచ్చి పీటలమీద కూర్చుంది ముని మునినవ్వులతో శ్రీకృష్ణుని సరసను.

ఆమెకేసే రెప్పవాల్చక చూస్తూన్న శ్రీకృష్ణుడు పూజ ప్రారంభించాక; అమ్మవారి ఒడిలో వెయ్యవలసిన పువ్వులను పసుపు పూసిన సత్యాదేవి కాళ్ళపైన వేశాడు, పరధ్యానంగా.

రుక్మిణీదేవికి కోపంరాదూ, మరి! ●

మీలో మీకు పోటీ

వెయ్యి నూట పదహార్లు బహుమతి

ఈ నెల లగాయతు 'నారద'గారు మా పాఠకులమధ్య ఆరోగ్యవంతమైన కలహాలు పెడుతూ వుంటారు. ఓపికున్నవాళ్ళు యిందులో ప్రవేశించవచ్చునని రెండు చేతులా ఆహ్వానిస్తున్నాం.

మనలో మనకు రహస్యాలెందుకు? అసలుసంగతి చెప్పేస్తాం. తదితర సోదర పత్రికలవారు తమ పాఠకులు పత్రికలో పాల్గొనాలని ఆశిస్తారు. (పత్రిక కొంటే చాలదట! పాలూ కొనాలి!) మేము పాలవ్యాపారం మొదలుపెట్టలేదు. పెడితే మీరు మాదగ్గరే పాల్గొంటారు. పాఠకులు పాల్గొనడం కోసమే యితర పత్రికలు ప్రశ్నోత్తరాలు, ఉత్తరాలు, సందేహాలూ. సమాధానాలు ఇత్యాదులూ, వగైరాలూ మొదలైనవి నడుపుతున్నాయి. తలచుకుంటే మనమూ అలాంటివి పెట్టేయొచ్చునుగాని వద్దులెద్దురూ. అచ్చులోమీ పేరు చూసి మీరు మురిసిపోయేటంత అల్పసంతోషులనే అపోహ మాకెప్పుడూలేదు.

ఇక ప్రస్తుతానికి వద్దాం. ఈనెల పోటీ ఏమిటంటే? మురార్జీదేశాయిగారు, సువర్ణసుందరీ (అనగా బంగారం) కలిసి పాడే డ్యూయెట్టు (అ) పింగళి నాగేంద్రరావు (ఆ) కొసరాజు రాఘవయ్యచౌదరి (ఇ) మల్లాది రామకృష్ణశాస్త్రి గార్లలో ఏ ఒక్కరైనా ఎలా వ్రాస్తారు? ఊహించి పంపించండి. ఒక పల్లవి చరణం చాలు!

వచ్చినవాటిలో 'నారద'గారికి నచ్చినదానికి వెయ్యి నూట పదహార్లు బహుమానమిస్తాం. (అన్నట్టు రూపాయిలు కాదండోయ్! బీదవాళ్ళం కాబట్టి అన్ని నయాపైసలు కచ్చితంగా ఇచ్చుకుంటాం.)

గుడ్‌లక్! ఇంక మీ చాకచక్యం చూపెట్టండి!

అన్నట్టు, మే 15వ తేదీకల్లా మాకు మీ రచనలు చేరాలి.

కూనలమ్మ పదాలు
ఆరుద్ర

తొలుత కట్టిన బొప్పి
దొసగు వివరము చెప్పి
తొలగ జేయును నొప్పి
ఓ కూనలమ్మా

భాగవతమున భక్తి
భారతములో యుక్తి
రామ కథయే రక్తి
ఓ కూనలమ్మా



బహు దినమ్ములు వేచి
మంచి శకునము చూచి
బయలుదేరఘ హాచ్చి
ఓ కూనలమ్మా


చీట్ల పేకల క్లబ్బు
చివికి కొట్టెడి గబ్బు
మధ్య తరగతి జబ్బు
ఓ కూనలమ్మా

అంతు చూసేవరకు
అకట! ఆంధ్రుల చురుకు
నిలువ వుండని సరుకు
ఓ కూనలమ్మా



భర్తతోడను సీత
పట్టు పట్టుటచేత
అట్లు తగలడె రాత!
ఓ కూనలమ్మా

మరచె చేసిన మేలు
చరచె పోరికి కాలు
వాడు చైనా ఫూలు
ఓ కూనలమ్మా



పేజి పేజికి వధలు
ప్రజలు వొల్లని కథలు
ఆరగించును చెదలు
ఓ కూనలమ్మా

పేదలే కానిమ్మ
ప్రభువులే కానిమ్మ
చివర కవరా దుమ్మ
ఓ కూనలమ్మా



కాలవశమున మారి
చాల ముడుపులు కోరి
దేవుడే వ్యాపారి
ఓ కూనలమ్మా!

జోలె కట్టె నవాబు
జాలి చూపె గరీబు
మూట కట్టె షరాబు
ఓ కూనలమ్మా



చెరకు రసముల వూట
చిన్మయత్వపు తేట
యోగివేమన మాట
ఓ కూనలమ్మా

రంకు శంకల మగడు
రాజుపెట్టిన నెగడు
రమణి ప్రేమకు తగడు
ఓ కూనలమ్మా



దాసుగారి కథలు

(హరిదాసు లెంతమంది ఉన్నా దాసుగారు ఒక్కరే! వారు శ్రీమదజ్జా డాదిభట్ల నారాయణదాసుగారు)

దక్షిణాదినుంచి ఒకానొక గాయకుడు ఉత్తరసర్కారులకు వచ్చాడు. మహా ఘటికుడు, ఒకచేత్తో ఆదితాళం, ఇంకో చేత్తో రూపకతాళం వాయిస్తూ పల్లవిపాడే దిట్ట. చేతికి ఘంటాకంకణంకూడా వుంది. కాకినాడలో తన విద్యని ప్రదర్శించి తనను ఓడించే వా శ్ళెవరైనా వున్నారా అన్నట్టు చూశాడట. కాకినాడవాళ్ళు విజయనగరం వెళ్ళమన్నారట.

అయ్యరుగారు విజయనగరం వెళ్ళారు. తనవిద్య కొందరిముందు ప్రదర్శించారు. అందరూ చకితులయ్యారు. ఇమిటేషను ఆచార్యులవంటివాళ్ళు దాసుగారివద్దకు పరుగెత్తారు. "అయ్యా, ఎవరో ఘటికుడొచ్చాడు. గంటయ్యరట!" అని చెప్పారు.

"గంటయ్యరా- మెడలో జోలికూడా వుందా?" అని దాసుగారు అడిగారు. "రమ్మను వాడివిద్య చూద్దాం!" అన్నారట.

అయ్యరుగారు దాసుముందు మళ్ళీ తన విద్య చూపించాడు. దాసుగారు మెచ్చుకున్నారుగాని, విజయనగరాన్ని ఈ పరాయివాడు గెలుచుకొనిపోవడం మంచిది కాదని సమయస్ఫూర్తితో ఒక సవాలు చేశాడు: "నాయనా! ఒకచేత్తో ఆదితాళం - ఇంకో చేత్తో రూపకతాళం వేశావు, బాగుంది. ఆదితాళం వేసినచేత్తో రూపకం, రెండోచేత్తో

ఆదితాళం వేస్తూ ఆదే పల్లవి పాడు!" అన్నాడు దాసుగారు. అయ్యరుగారు పాడబోయి అలవాటులేక తాళం తప్పాడు.

సాయంత్రందాకా సాధనం చేసి వచ్చి చూపించు అని దాసుగారు పంపించేశారు. గాని అయ్యరు వచ్చేలోగా అయిదు తాళాల L. C. M. లెక్క కట్టి, రెండు చేతులతో, రెండు కాళ్ళతో రెండు రెళ్ళు నాలుగు వివిధ తాళాలు, ముఖంలో యింకొకటి మొత్తం అయిదు తాళాలు వేస్తూ పాడడానికి ఒక కీర్తన తయారుచేసి 'పంచముఖి' అనే పేరుపెట్టి సంగీత అవధానానికి పునాది వేశారు.

అయిదుగురు తాళశాస్త్రజ్ఞులు కూర్చొని అయిదురకాల తాళాలను వేస్తూవుంటే, గాయకుడు ఒకే పల్లవిపాడుతూ ఎవరి తాళం వాళ్ళకి అప్పచెప్తూ ఒప్పించడమనే బ్రహ్మ విద్యని దాసుగారు సృష్టించారు.

దాసుగారు ఒకసారి మధురవెళ్ళారు. అంతకుముందే వారికీర్తి అక్కడకువచ్చి నివాసం ఏర్పరచుకొంది. స్థానికవిద్వాంసులెందరో దాసుగారి ఐసకువచ్చి, చిన్న సభ చేశారు. వాళ్ళు దాసుగారిని ఆనందభైరవి పాడమన్నారు. సభాసదులకోరిక మన్నించి దాసుగారు రాగం ఎత్తుకున్నారు. దివ్యంగా పాడేస్తున్నారు. తమ గాత్రంలో ఒదిగే హిందూస్థానీ సంగతులు, చమక్కులు గుప్పించేశారు. పాట దివ్యంగావుంది గాని దాసుగారు పాడిందీ ఆనందభైరవిమాత్రం కాదు. హిందూస్థానీ భైరవి. సభలోని ఒక ధైర్యవంతుడు ఎలాగో సాహసంచేసి "స్వామీ తమరు హిందూస్థానీ భైరవి పాడారు!" అన్నాడట.

"మావైపు ఆనందభైరవి యిలాగే వుంటుంది" అని దాసుగారు కచ్చితంగా చెప్పారు.

ఈ పండితుడితో వాదం పెట్టుకొంటే, ఎక్కడో బోల్తా కొట్టిస్తాడు. ఇంతకీ మహా విద్వాంసుడుకదా అని స్థానిక గాయకులు సరిపెట్టుకొని వెళ్ళిపోయారు.

అందరూ వెళ్ళాక శిష్యులు దాసుగారిని "గురువుగారూ తాము పాడినది హిందూస్థానీ భైరవే కదా?" అని ప్రశ్నించారు.

"అవును! వీళ్ళముందుకూడా ఆనంద భైరవి పాడితే నెగ్గుకు రాగలమా! అది వాళ్ళ సొమ్మే!" అని దాసుగారు లౌక్యం విడమర్చారు.

కాకినాడ గానసభల్లో ప్రతిఏడూ దాసుగారి హరికథ రుచిగా వుండేది. ఆసభల్లోనే ఒకానొక దక్షిణాది వయిలిన్ విద్వాంసుడికి రెండు కచేరీలు వుండేవి. ఒకటి తానొక్కడూ వాయించడానికి రెండోది - ఇంకోగాత్ర విద్వాంసుడితో కలిసి వాయించడానికి ఆ రెండు కచేరీలు.

దాసుగారు ఆ విద్వాంసుడిలాగే తనకూ రెండు రోజులు కేటాయించాలని అడిగారు. గానసభలు నిర్వహించే కొమ్మిరెడ్డి సూర్యనారాయణ నాయుడుగారు సవినయంగా "దాసుగారూ! ఇది గానసభల కోసం ప్రత్యేకించిన సంస్థ. తమకోసం మాత్రం ఒక్క హరికథ ఎలా పెట్టుకోం. క్షమించండి!" అన్నారట.

దాసుగారు 'సరే' అని ఆ విద్వాంసుడి కచేరీ వున్నరోజున వేరొకచోట టిక్కెట్లు పెట్టించి తమ హరికథ చెప్పారట. సంగీత కచేరీలో హాలు ఖాళీ!

ఆ వయిలిన్ విద్వాంసుడు గోవిందస్వామి పిళ్ళె! అపరతుంబురుడు.

[సంగీతరావు చెప్పిన ఈకథలు సాహిత్యరావు రిపోర్టు చేశాడు.]

●

నడి వేసవి

అజంతా

ఒంటరిగా కూర్చున్నాను గదిలో
ఎవరో కత్తులు విసురుతున్నారు హృదిలో

కిటికీ అవల పూలతోటలో హంతకుడు

తెరుచుకుంటున్న ఆలోచనల కత్తుల బోనులలో
మధ్యాహ్న సుందరి మండుతున్న వేసవి మంటల గుబురులలో
ఆకలి ఆకారంలో పెద్దపులి

ఒంటరిగా కూర్చున్నాను గదిలో
ఎవరో సమాధి నిర్మిస్తున్నారు హృదిలో

కిటికీ అవల
సూర్యుని నఖాంకుశాల ఆవల
క్షుద్ర దేవత పరిరంభం అవల
పొగ వృక్షాల నీడలలో
ఎవరో నన్ను పోలిన ఆగంతుకుడు

ఒంటరిగా కూర్చున్నాను గదిలో
మృత్యువు అనేక రకాలు,

ఆదితాళం వేస్తూ ఆదే పల్లవి పాడు!" అన్నాడు దాసుగారు. అయ్యరుగారు పాడ బోయి అలవాటులేక తాళం తప్పాడు.

సాయంత్రందాకా సాధనం చేసి వచ్చి చూపించు అని దాసుగారు పంపించేశారు. గాని అయ్యరు వచ్చేలోగా అయిదు తాళాల L. C. M. లెక్క కట్టి, రెండు చేతులతో, రెండు కాళ్ళతో రెండు రెళ్ళు నాలుగు వివిధ తాళాలు, ముఖంలో యింకొకటి మొత్తం అయిదు తాళాలు వేస్తూ పాడడానికి ఒక కీర్తన తయారుచేసి 'పంచముఖి' అనే పేరుపెట్టి సంగీత అవధానానికి పునాది వేశారు.

అయిదుగురు తాళశాస్త్రజ్ఞులు కూర్చొని అయిదురకాల తాళాలను వేస్తూవుంటే. గాయకుడు ఒకే పల్లవిపాడుతూ ఎవరి తాళం వాళ్ళకి అప్పచెప్తూ ఒప్పించడమనే బ్రహ్మ విద్యని దాసుగారు సృష్టించారు.

దాసుగారు ఒకసారి మధురవెళ్ళారు. అంతకుముందే వారికీర్తి అక్కడకువచ్చి నివాసం ఏర్పరచుకొంది. స్థానికవిద్వాంసులెందరో దాసుగారి ఐసకువచ్చి. చిన్న సభ చేశారు. వాళ్ళు దాసుగారిని ఆనందభైరవి పాడమన్నారు. సభాసదులకోరిక మన్నించి దాసుగారు రాగం ఎత్తుకున్నారు. దివ్యంగా పాడేస్తున్నారు. తమ గాత్రంలో ఒదిగే హిందూస్థానీ సంగతులు. చమక్కులు గుప్పించేశారు. పాట దివ్యంగావుంది గాని దాసుగారు పాడిందీ ఆనందభైరవిమాత్రం కాదు. హిందూస్థానీ భైరవి. సభలోని ఒక ధైర్యవంతుడు ఎలాగో సాహసంచేసి "స్వామీ తమరు హిందూస్థానీ భైరవి పాడారు!" అన్నాడట.

"మావైపు ఆనందభైరవి యిలాగే వుంటుంది" అని దాసుగారు కచ్చితంగా చెప్పారు.

ఈ పండితుడితో వాదం పెట్టుకొంటే, ఎక్కడో బోల్తా కొట్టిస్తాడు. ఇంతకీ మహా విద్వాంసుడుకదా అని స్థానిక గాయకులు సరిపెట్టుకొని వెళ్ళిపోయారు.

అందరూ వెళ్లాక శిష్యులు దాసుగారిని "గురువుగారూ తాము పాడినది హిందూస్థానీ భైరవే కదా?" అని ప్రశ్నించారు.

"అవును! వీళ్ళముందుకూడా ఆనంద భైరవి పాడితే నెగ్గుకు రాగలమా! అది వాళ్ళ సొమ్మే!" అని దాసుగారు లౌక్యం విడమర్చారు.

కాకినాడ గానసభల్లో ప్రతిఏడూ దాసుగారి హరికథ రుచిగా వుండేది. ఆసభల్లోనే ఒకానొక దక్షిణాది వయిలిన్ విద్వాంసుడికి రెండు కచేరీలు వుండేవి. ఒకటి తానొక్కడూ వాయించడానికి రెండోది - ఇంకోగాత్ర విద్వాంసుడితో కలిసి వాయించడానికి ఆ రెండు కచేరీలు.

దాసుగారు ఆ విద్వాంసుడిలాగే తనకూ రెండు రోజులు కేటాయించాలని అడిగారు. గానసభలు నిర్వహించే కొమ్మిరెడ్డి సూర్యనారాయణ నాయుడుగారు సవినయంగా "దాసుగారూ! ఇది గానసభల కోసం ప్రత్యేకించిన సంస్థ. తమకోసం మాత్రం ఒక్క హరికథ ఎలా పెట్టుకోం. క్షమించండి!" అన్నారట.

దాసుగారు 'సరే' అని ఆ విద్వాంసుడి కచేరీ వున్నరోజున వేరొకచోట టిక్కెట్లు పెట్టించి తమ హరికథ చెప్పారట. సంగీత కచేరీలో హాలు ఖాళీ!

ఆ వయిలిన్ విద్వాంసుడు గోవింద స్వామి పిళ్ళై! అపరతుంబురుడు.

[సంగీతరావు చెప్పిన ఈకథలు సాహిత్యరావు రిపోర్టు చేశాడు.]

●

నడివేసవి

అజంతా

ఒంటరిగా కూర్చున్నాను గదిలో
ఎవరో కత్తులు విసురుతున్నారు హృదిలో


కిటికీ అవల పూలతోటలో హంతకుడు

తెరుచుకుంటున్న ఆలోచనల కత్తుల బోనులలో
మధ్యాహ్న సుందరి మండుతున్న వేసవి మంటల గుబురులలో
ఆకలి ఆకారంలో పెద్దపులి

ఒంటరిగా కూర్చున్నాను గదిలో
ఎవరో సమాధి నిర్మిస్తున్నారు హృదిలో

కిటికీ అవల
సూర్యుని నఖాంకుశాల అవల
క్షుద్ర దేవత పరిరంభం అవల
పొగ వృక్షాల నీడలలో
ఎవరో నన్ను పోలిన ఆగంతుకుడు

ఒంటరిగా కూర్చున్నాను గదిలో
మృత్యువు అనేక రకాలు.



క్రేసులోని ఆఖరి సిగరెట్టు కూడా యాష్ట్రేలో చుంయ్‌మని పోయింది. మామూలు కుర్చీనే ఈజీచైర్‌గా భావించుకుని, గోడకు కాళ్ళు సంధించి, వెనక్కు జేరబడి దీర్ఘాలోచనా పరుడై వున్న రాజుకు, ఐడియా మాత్రం ఇంకా కుదరలేదు.





కనబడుటలేదు...

రావి కొండలరావు



ఆవరికారంగానే క్రిందపుస్తకాలమధ్యలో శేషపాన్పుపైన పవళించిన విష్ణుమూర్తులవారి పోజులో ఎడమచేతిని నేలకు నించి - అర చేతిలో తలను పెట్టుకుని అంతకంటే ఆలోచనాపరుడైవున్న రామారావుకుకూడా 'క్లూ' దొరకలేదు.

ఈ మిత్రులిద్దరూ రెండుగంటల ముప్ఫయ్యారు నిమిషాలయి అట్లా ఆలోచనలో గడ్డ కట్టుకుపోయినట్టు - టేబిలుమీదనున్న గడియారం ఖచ్చితంగా చెబుతున్నది. అటా గడ్డకట్టుకుపోవటానికి కారణం ఏమిటంటే - రామారావు కాలేజీకి కట్టాల్సిన ఫీజుకట్టలేదు. పైనుకోత్తవలసిన సమయం కూడా మించి పోతున్నది. తండ్రిదగ్గర రామారావు కాలేజీ ఫీజుకని వసూలుచేసిన రొక్కాన్ని ఈ ఇద్దరుమిత్రులూ సినిమాలకూ, సిగరెట్లకూ, తిరగటానికీ వినియోగించారు. రాజుఒక్కడూ రూమ్‌లో వుంటున్న విద్యార్థి. రామారావు తలిదండ్రుల చాటునపెరుగుతున్న విద్యార్థి. రాజు తాను కట్టాల్సిందేదో కట్టేశాడుకాబట్టి, అతనిదగ్గరడబ్బులేదు; రామారావుకు ఎక్కడ నుంచీ డబ్బురాదు. ఇప్పుడా డబ్బు సంపాయించి, ముందు కాలేజీకి ముడుపు చెల్లించాలి. దానికోసమనే ఈ ఉభయులూ ఆలోచనమీద ఆలోచన గావిస్తూ, మధ్యలోపోజులు మారుస్తూ, సిగరెట్లు పీలుస్తూ ఇంతసేపాయి కిందా మీదా పడుతున్నారు.

క్రిందనున్న శేషశాయి. చెయ్యి మార్చుకొని నిట్టూర్చి 'హోహో' అన్నాడు. కుర్చీలోని రాజుగారు 'హా హా' అన్నారు.

'హోహో అంటున్నావు-ఏదయినా తట్టిందేమిటోయ్?' అన్నాడు లేవకుండానే రామారావు-అతనికి ఏకోశానా తట్టిచావదనే దృఢ నమ్మకం గలవాడవడంచేత.

'నా బొంద తట్టింది. నువ్వు 'హాహా' అన్నావని నేను హో హో అన్నాను' అన్నాడు రాజు. పొరపాటున ఎక్కడైనా సిగరెట్టు నక్కివుందేమోనని కేసులో గాలిస్తూ.

మరో పదినిమిషాలుపాటు ఇద్దరూ తలకాయలు బ్రద్దలుచేసుకున్నాక 'రాజూ' అన్నాడు రామారావు లేచి కూచుని.

'ఏంమంత్రీ? ఐడియా దొరికిందా?'

'దొరికింది. ఈరకం ఆలోచన ఇంక లాభం లేదనేది'

'ఇంకోరకం ఆలోచన ఎట్లా చేద్దామో అదీ చెప్పు'

'ఎక్కడికయినా వేటకు వెళితే?'

'నయాపైసా రాలదు. ఆపైన నీయిష్టం'

ఇద్దరూకలిసి ఎక్కడైనా డబ్బుదొరికే చోట్లు వున్నాయేమోననీ, ఎవడైనాఅప్పిచ్చేనాథుడున్నాడేమోననీ తెగ ఆలోచించారు మళ్ళీ. దమ్మిడీ లాభం లేకపోయింది.

'వైద్యుడెవడైనా నీకు తెలిసినవాడు లేడూ, అప్పిస్తాడ'అన్నాడు రామారావు.

"అప్పిచ్చువాడు వైద్యుడన్నారనా-ఏవైద్యుడూ ఇవ్వడు. కనీసం 'మాకు'కూడా ఇవ్వడు!"

"ఏం సాధనం?"

అంటే

"ఏం సాధనం?" అనుకున్నారిద్దరూ.

టానిక్ తాగితే బలంవచ్చినట్టుగా - టీ తాగితేఐడియావస్తుందని ఎవరో చెప్పారుట-ఇద్దరూబయల్దేరి రాజుజేబులోమిగిలిన చిల్లరడబ్బులతోటీలు తాగారు. కొంతదూరం అట్లా అట్లా నడిచారు. రోడ్లు కొలిచారు. వీధులన్నీ సర్వే చేశారు.

ఇక తిరగలేక, రాజూ రామారావూ ఒక సందు ప్రక్కనే వున్న తూముగట్టుమీద చతికిల బడ్డారు. ఈతిరగడంలో కొంతమంది మిత్రులలాంటి వారు తారసిల్లగా, ఋణమో రుణమో ప్రాధేయపడ్డారు. ఉన్న మిత్రులంతా కలిసి తలో ఐదూ, కనీసం మూడూ ఇచ్చినా చాలని అభిప్రాయపడ్డారు. అదీ పారలేదు. ఇంతవరకూ ఒక్కకానీ ఐనా దొరక్కపోగా కనీసం అర్థ అయిడియా ఐనా దొరకలేదు.

తూము గట్టుమీద జేరబడిపోయినరాజుకు దూరంగాపోతున్న ఓ అబ్బాయిని చూడగానే అద్భుతమైన, మహోన్నతమైన ఐడియా వచ్చేసింది. ఒక్కనిమిషం ఆలోచించి - తన్మయుని లేచినించుని 'దొరికింది' అని అరిచాడు.

"గట్టిగా పట్టుకో. వదలకు" అన్నాడు రామారావు హాస్యంగా.

"చూస్తూవుండు. దీన్ని మించిన పథకం లేదు. పద రూమ్‌కు" అనిలేచాడు. చెబితేకాని లేవనన్నాడు రామారావు. వస్తేకాని చెప్పనన్నాడు రాజు. కొంతసేపటికి రాజే నెగ్గాడు.

రూములో కూచుని ఇద్దరూ మళ్ళీ మొదటి పోజుల్లోకి వచ్చారు. రాజు ప్రారంభించాడు-

"ఏమిటంటే మీ నాన్నకు నువ్వుఅంటే ప్రియమేగా ?"

"లక్ష రూపాయలు ఖరీదనుకో"

"మధ్యలో నువ్వేం మాట్లాడనవసరం లేదు. చెప్పిందంతా విను. అంచేత, ప్రియమైనా చవకయినా ఏతండ్రీ, కొడుకు కనిపించలేదంటే కంగారు పడతాడు. ఈ క్షణం నుంచీ నువ్వు మీ నాన్నకు కనిపించవు. ఎవరికీ కనిపించవు. నా రూమ్‌లోనే వుంటావు. రెండు రోజులుపోయాక, నీ కోసం అని నేను మీ యింటికి వెళతాను. ఈలోపలే మీ నాన్న నువ్వుకనిపించలేదనినీకోసంరావచ్చుననుకో. అప్పుడు నువ్వు బాత్‌రూములో వుంటావు. నీకోసం అంతటా గాలిస్తాము. ఎక్కడా దొరకవు. ఇంక గత్యంతరం లేదని, నీఫొటో పేపర్లో ప్రకటించి- ఫలానావాడు తప్పిపోయాడనీ, వెదికి తీసుకొస్తేనూరురూపాయలు బహుమానమనీ వేస్తాము. నేను బయల్దేరి తీసుకొస్తానంటాను. బయల్దేరతాను. రెండు రోజులు పూరుకున్నాక నిన్నుతీసుకెళ్ళి మీ నాన్నకు వప్పగించి ఆ నూరో నూటపదార్లో పుచ్చుకుంటాను. ఇది ధోకాలేని ఐడియా. ఇన్ని గంటలనేపు అవస్థ పడబట్టీ, ఇంత చక్కనిది తట్టింది. తిరుగులేదు. ఆ వచ్చిన డబ్బులో కాలేజీకి కట్టాల్సిందేదో కట్టేసి, మిగిలినదాంతో...." అని రాజు తక్కున ఆగిపోయాడురామారావుని చూసి. ఈమహత్తరమైన ఐడియాను, ఐడియాలోనినూరురూపాయలనువిన్న రామారావుఅమాంతం మూర్ఛపోయాడు. తన ధోరణిలో ప్రసంగించుకుంటూ పోతూ రాజు ఇది గమనించనేలేదు.

"ఓయ్ రామారావూ-రామ్...." అని నీళ్ళుచల్లి లేవగొట్టి-సగర్వంగా నవ్వొకటి వెదజల్లాడు రాజు.

"ఏమిటో అనుకున్నాను రాజూ! నువ్వు సామాన్యుడివికావు-నీతలకాయ ఈలోకంలో వుండవలసినదికాదు. ఏమి ఐడియా రాజూ,

ఏమి ఐడియా అన్నాడు రామారావు వొళ్ళు మరచిపోయి.

"సరే. ఇంక నువ్వు చెయ్యాల్సింది చాలావుంది. నువ్వే ఇంక రాజువి. అంతే మరేంలేదు. రాజులాగా ఈ రూమ్‌నే కోటగా భావించుకుని. కాలు కదపనక్ఖర్లేకుండా. కొన్నాళ్ళు జీవిస్తావు. మన మీల్స్‌టిక్కట్లు పెట్టికారియర్‌తెప్పించుకుంటాము. నీకుకావలసిన సదుపాయాలన్నీ నేనుచేస్తాను. నువ్వు మాత్రం చాలా జాగ్రత్తగా ఎవరికంటా పడకుండా...."

"ఒకవేళ జానకి ఈ వీధిలోంచిపోతేనో?"

"పోయినా. ఇక్కడికివచ్చి నిన్ను పిలిచినా సరే-నువ్వున్నట్టు తెలియనివ్వరాదు. కాస్త-జారిందా. గోవిందా! ఆతర్వాతచాలా అవస్థ."

"సరే నువ్వుకూడా ఎవరికీ చెప్పరాదు. నాకోసం నువ్వు కాఫీ. టిఫినూతెస్తున్నప్పుడు ఎవరైనా నిన్ను చూస్తే గీస్తే...."

"చూడనీ నాకోసమే అనుకుంటారు. ఐనా అదంతా నేను చూసుకుంటాలేవోయ్-నువ్వుమాత్రం...."

"చాలా జాగ్రత్తగా వుండాలి-జైల్లోనున్న దొంగలాగా."

"అదిగో. అట్లా మాట్లాడితే నాదేంలేదు. నీయిష్టం. ఒక్క నాలుగురోజులుకష్టపడు. కష్టమేమిటసలు. సుఖపడు. తర్వాత వుందిగా! నీకోసంపత్రికలూ. పుస్తకాలూతెచ్చిపడేస్తాను. సరే. నువ్వువుండు. నేను వెళ్ళివస్తాను" అని రాజులేచి. ముఖం కడిగి-రూముకు తాళంపెట్టి వెళ్ళిపోయాడు. రామారావు ఉషారుగా ఈలొకటివేసి - 'లాలా లలా లలలా' అని పాడి. క్రిందదొర్లాడు.

రామారావుకు ఆ సాయంత్రం హాయిగానే గడిచిపోయింది. రోజు టిఫినూ కాఫీ వాళ్ళ దగ్గరకు తీసుకొచ్చి ఇచ్చాడు. మరి కాస్సేపటికి బాత్‌రూములో దూరి చల్లగా స్నానం చేశాడు. రాజు పంచకట్టుకున్నాడు. టేబిలులైటువేసి. పత్రిక తీసిచదువుకున్నాడు. అప్పటికి ఆరున్నరయింది. రామారావుకు పత్రికా పఠనం సాగలేదు. ఆలోచనలో పడ్డాడు. సాయంత్రం పూట ఇంట్లోవుండడం అన్నది బహుశా తన జీవితంలో ఇదే ప్రథమం. ఈ పాటికి తెల్లటి గుడ్డలు వేసుకుని సిగరెట్లు కాలుస్తూ-అన్నట్లు ఈ రాజుగాడు సిగరెట్లు ఇవ్వకుండా పోయాడే. అని తిట్టుకున్నాడు. అక్కడెక్కడేనా ఏమైనా మిగిలాయేమోనని చూశాడు. కాల్చి పారేసినపీకలు తప్ప సిగరెట్ల జాడే కనిపించలేదు. సరే— ఈ పాటికి తెల్లటి గుడ్డలు వేసుకునిసిగరెట్లు కాలుస్తూ ఏ సినిమా హాలు గేటు దగ్గరో. జానకివీధిలోనో ఉండవలసిన తను. ఇట్లాఎవడిదో వూరివాడి ఎరువుపంచ ధరించి. దొంగతనంగా పడివున్నాడు.

రామారావు విధి. కర్మ. రాత వంటి మాటలూ. 'రాజే కింకరుడేను....' అన్న వాక్యాలూ గుర్తుకు తెచ్చుకుని నవ్వుకున్నాడు. ఈ పాటికే తనవాళ్లు తన కోసం ఆరాట పడరు. ఎందుకంటే. తను సాధారణంగా తొమ్మిదింటికి గాని ఇల్లు చేరడు. ఒకవేళ తొందరగా చేరితే. చదువుకోవాలనే మిష మీద భోజనంచేసి వెంటనే బయల్దేరి ఏ సినిమాకో పోతాడు. అంచేత చెప్పకుండా ఎక్కడికి వెళ్ళడం అని గాని. ఎక్కడైనా ఉండిపోవటం అని గాని సామాన్యంగా తన పద్ధతిలో జరిగే పనికాదు. ఈ రాత్రి తొమ్మిది తర్వాతగాని. ఏ అలజడీ బయల్దేరదు. తెల్లవారేసరికి తను కనిపించ లేదన్న సంగతి పూరంతా ప్రాకి పోతుంది. అంతా ప్రాకకపోయినా. తన ఇంటి చుట్టు పట్లా—తన స్నేహితుల చుట్టూ. కాలేజీ ప్రాంతాలా ప్రాకవచ్చును. జానకికి కూడా తెలుస్తుందా? ఫలానా రామారావెవడో కనిపించటం లేదని తెలిస్తే తెలియవచ్చును. అంతకన్నా ఆ అమ్మాయికేమీ తెలియదు. తనెవరో జానకేం ఎరుగును. జానకిని తనెరుగును గాని! రామారావు చాలాసేపు ఇట్లాగే చాలా చాలా ఆలోచించాడు. ఎందుకనో అతనికి నెమ్మదిగా నిద్ర పట్టింది.


సుమారు తొమ్మిది గంటల ప్రాంతాల రాజు టిఫిన్ పొట్లాలతో వచ్చి తలుపు తాళం తీసి. లోపల ప్రవేశించాడు. "వా రాజే" అనుకున్నాడు రాజు. నిద్రపోతున్న రామారావును చూసి. తలుపుకు లోపలవేపు గడియవేసి. దుస్తులు మార్చుకుని రామారావును లేపాడు.

"వూఁ—ఇదేమిటయ్యా పొట్లాలు తెచ్చావు? భోజనమో?" అన్నాడు రామారావు బద్ధకంగా లేస్తూ.

"భోజనానికి కారియరు దొరకలేదు. రేపు సర్దుతా నన్నాడు హోటలు వాడు. ఈ పూటకు ఈ టిఫిను కాసీ. దీనికి డబ్బుల కోసం నేనెంత యాతన పడ్డానో నువ్వెరగవు" అన్నాడు రాజు. మాట్లాడకుండా రామారావు ఆ పొట్లాలు విప్పి. తిని - మంచినీళ్ల త్రాగి—

"ఏమనుకుంటున్నారోయ్?" అన్నాడు ఏదో ఘనకార్యం చేసిన వాడల్లే పోజు కొడుతూ.

"ఇంకా ఏమీ అనుకోవడం లేదు. అనుకుంటాల్లే. ఈ రాత్రి కళ్లు మూసుకో.



"చాలా ఇబ్బందిగా వుంది రాజూ: నువ్వయినా లేవు"

రాజు సమాధానం చెప్పలేదు. తెచ్చిన సిగరెట్లు అతని ముందు పడేశాడు. కాస్సేపు ఇద్దరూ ఏవేవో మాట్లాడుకుని దీపం ఆర్పేసి, నిద్రకు ఉపక్రమించారు.

కాస్సేపటికి వీధి తలుపు చప్పుడయింది. 'రాజుగారూ' అంటూ ఎవరో పిలుస్తున్న పిలుపు విన్నారు.

"వచ్చాం" అన్నాడు రామారావు చటుక్కున లేచి కూర్చుని.

"ఏమీ చావనఖ్ఖర్లేదు. కాస్సేపు బాత్ రూములోకి పో. నేను చూసుకుంటాను"

"ఆ వచ్చేవాడు బాత్‌రూములోకి వెళ్ళాలని ఏమన్నా అంటే ?"

"అంటే చూద్దాంలేవయ్యా — నువ్వు వెళ్ళు" అని రామారావును పంపించేసి, తానువెళ్ళి తలుపు గడియతీసి 'ఎవరూ' అన్నాడు.

"నే నండీ - రామారావు తమ్ముడిని. మా అన్నయ్య ఇంకా ఇంటికి రాలేదు. ఇక్కడున్నాడేమోనని...."

"ఇక్కడ లేడే. ఏం, ఎంతసేపయింది వెళ్ళి ?" అన్నాడు రాజు. బాత్‌రూములో పొంచివున్న రామారావుకు కూడా ఈ మాటలు వినిపించాయి. అతను పొంగిపోయి చిటికె వేశాడు.

"మధ్యాన్నం గావును వెళ్ళాడు. ఇంకా ఇంటికి రాలేదు."

"భోజనానికి రావాలన్న మాట"

"అవునండి"

రామారావుకు చిరాకేసింది. వాడికి మరికొంత ఆత్రుత కల్పించి పంపెయ్యక ఈ దాతాఖానీ ఎందుకని విసుక్కున్నాడు.

"వస్తాడులే—ఏ సినిమాకన్నా వెళ్ళాడేమో" అన్నాడు రాజు.

"అన్ని సినిమాలూ విడిచిపెట్టేశారండీ" అన్నాడా అబ్బాయి.

"ఐతే మరి ఎక్కడికెళ్ళి వుంటాడబ్బా!....ఏమోనాయనా, నాకు తెలియదు. పొద్దున్నెపుడో నాకు కనిపించాడు గాని, మళ్ళీ కనిపించనేలేదు. ఇక్కడికివస్తే వెంటనే పంపించేస్తాలే...." అన్నాడురాజు. సరేనని ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు. రాజు తలుపు గడియవేసి వెనక్కి తిరిగేసరికి రామారావు పకపక నవ్వుతూ కనిపించాడు.

"నెమ్మదిగా నవ్వు నాయనా — మీవాడింకా మెట్లు దిగివుండడు" అన్నాడు రాజు నెమ్మదిగా.

"సరేగాని .... కోటలో పాగావేసినట్టే చూశావా. పదిన్నరకే అలజడి కలిగిందీ" అన్నాడు రామారావు పక్కమీద వాలిపోతూ.

ఆ మర్నాడు ఉదయం మళ్ళీ ఎవరన్నా వస్తారేమోనని మిత్రులిద్దరూ చూశారు. ఎవరూ రాలేదు. కారియర్ భోజనం ఏర్పాటు చేసి, తానింత తిని రాజు కాలేజీకి బయల్దేరాడు.

"మాయింటి మీదుగా వెళతావా రాజూ" అన్నాడు రామారావు.

"ఉండవయ్యా. మనంకాదు ఆతురిత పడవలసింది—వాళ్ళు" అన్నాడు రాజు.

"అందుక్కాదు. రాత్రి మా తమ్ముడు వచ్చాడుగా. నేను వచ్చానో లేదోఅని మా యింటికి వెళ్ళవచ్చునేమో అని ...."

"చూద్దాంలే" అని రాజు, తలుపు తీసుకుని బయట తాళం పెట్టి వెళ్ళిపోయాడు. రామారావుకు ఏకుపొచ్చినంత పనయింది. 'వీడి పొగరూ వీడూనూ' అనుకున్నాడు. 'ఇప్పుడు ఏవానికీ నేను మాట్లాడరాదనేగా వీడి ప్రవర్తన:....కానీ కానీ ఎన్నాళ్లు!'అని రామారావు పత్రికలు తీశాడు- అవి రుచించలేదు. విసిరేశాడు.

రాజు రామారావు ఇంటి గుమ్మంముందు ఆగి—'రామారావూ' అని కేకవేశాడు. లోపల్నుంచి రామారావు తల్లి వచ్చింది.

"ఏం నాయనా- మావాడు కనిపించాడా? నిన్ననగా వెళ్ళాడు. రాత్రి రాలేదు, పొద్దున్నా రాలేదు. అసలు ఎక్కడా వుండే అలవాటే లేదు వాడికి. మహా వుంటే నీతోనే వుంటాడు. ఎక్కడికి వెళ్ళాడో నీకూ చెప్పలేదా రాజూ"? అని అడిగింది ఆమె ఆతృతగా అన్నీ ఏకరువు పెడుతూ.

"లేదండీ—నిన్న పొద్దున్నే నాకు కనిపించాడు. మళ్ళీ లేదు. నిన్న రాత్రి మీ అబ్బాయి వచ్చాడు. అప్పుడే వద్దామనుకున్నాను. ఐనా కాస్సేపటికి వచ్చేస్తాడేమో అని రాలేదు. ఇదేమిటండీ, ఇంతవరకూ రాకపోవడం ఏమిటీ ?" అని రాజు ఒకటో నెంబరు మేటి నటుడల్లే— ఆశ్చర్యం అభినయించాడు. ఇంతలో రామారావు తండ్రిగారు లోపల్నుంచి రాగా ఆ ఆశ్చర్యంలోనే చెమ్మాడు సానుభూతిని మిళాయించి - 'నమస్కారమండీ' అన్నాడు.

"ఏం, తెలిందా వీడి సంగతి :" అన్నాడాయన.

"ఏమిటో నాకూ ఇప్పటిదాకా తెలియదండీ. ఇప్పుడే అమ్మగారు అంటూవుంటే విన్నాను. మీరేమన్నా కేకలు వెయ్యడం వంటివి ఏమయినా చేశారా ఏమిటి ?" అన్నాడు రాజు.

"ఏమీలేదు నాయనా. వాడిని కేకలేసేది ఎవరు ఈ యింట్లో ? ఇదిగో, ఎప్పుడైనా అంటే ఈయన అంటారు ఓ మాట. అదీ ఏమిటి - మరీ చదువు ఎగవేస్తూ వుంటే" అన్నది రామారావు తల్లి. ఇంతలో రామారావు తమ్ముడు వీధిలోంచి వస్తూ "అమ్మా ! ఉదయం సుబ్రమణ్యానికి కనిపించాట్ట" అన్నాడు. రాజు గుండె తటిమని ఆగిపోయింది. "ఎ ఎ ఎ....క్కడ ?" అన్నాడు.

"అదెక్కడో చెప్పలేదు గాని, పొద్దున్న చూశానే అన్నాడు" అన్నాడు రామారావు

● "అదేమిటిసార్! మీకు బాగా బట్టతల వచ్చేస్తోంది. మా హేరాయిల్ వాడారా?"

"లేదండీ, వృద్ధాప్యంవల్లే అయివుంటుంది."

తమ్ముడు. రాజుకు కాళ్ళూ చేతులూ గిల గిల తన్నుకొన్నట్టయింది. కొంపదీసి ఈ వెధవ బయటకొచ్చేయ లేదుగదా : ఎట్లా వస్తాడు - తాళం తన దగ్గర వుంటూంటే. అతనికేమీ అర్థంకాలేదు.

"ఐతే ఆ సుబ్రమణ్యం ఏమన్నాడు?" అన్నాడు రామారావు తండ్రి.

"ఏమో, నేను అడిగితే ఆ మాట అన్నాడు - మళ్ళీ ఏమీ అనలేదు"

"ఏడిసినట్టుంది. వాడి నిర్వాకమూ, నీ నిర్వాకమూ" అని గసుసుకున్నాడు ఐట్ట తలాయన కొడుకుమీద.

"ఎందుకు - నే కనుక్కుంటా లెండి" అని రాజు బయల్దేరాడు.

బయల్దేరిన రాజుకు ఎటు వెళ్ళడమో తేలలేదు. తన రూముకు వెళ్ళి రామారావు వున్నాడో లేడో చూసుకోవడమా, సుబ్రమణ్యాన్ని కలవడమా : సుబ్రమణ్యమే అబద్ధం చెప్పాడో, రామారావు తమ్ముడే కోశాడో అతనికి అర్థంకాలేదు. 'దిక్కుమాలిన సొద' అని విసుక్కున్నాడు. తన రూమువేపు వెళ్తూ.

రూము తాళం వేసింది వేసినట్టే వుంది. తాళంతీసి చూడగా —— గుడిలో దేవుడల్లే రామారావు కనిపించాడు.

"మళ్ళీ వచ్చావేం?" అన్నాడు రామారావు.

"నా బొంద - నా కర్మానూ ఇదేదో ఈ అవస్థలతోనే పోయేట్టుంది. నువ్వేమో ఉదయం ఆ సుబ్రమణ్యానికి కనిపించావని వాడు చెప్పగా - నీ తమ్ముడు మీ ఇంటికెళ్ళి చెప్పాడు. ఇంతలో ఎవరిమాట అబద్ధం? - అబద్ధం మాటకేంగాని - నో తాడు తెగింది. మళ్ళీ పోలోమని పోవాలి" అని చిరాగ్గా వెళ్ళి తలుపు తాళం పెట్టి నిష్క్రమించాడు రాజు. రామారావు ఏదో అంటున్నా వినిపించుకోకుండా.

రాజుకు ఇంత చిరాకు ఎందుకో రామారావుకు అర్థం కాలేదు. ఈ బందిఖానా బతుక్కి తాను చిరాకు పడాలి గాని, వీడికెందుకో చిరాకు ? కొంపదీసి —— ఏదన్నా దురూహతో లేడుగదా : అంటే ఈ డబ్బు కాస్తా తనచేత జిక్కించుకుని, తనను పో పొమ్మనడుగదా : ఏడిశాడు —— అదేమయినా జరిగితే తను లేడూ సత్యాన్ని లోకానికి చాటడానికి : పోతే తన పరువూ పోతుందిగాని, రాజుగాడి పథకం పారనిస్తానా:....ఐనా రాజు అటువంటివాడుకాడు, అటువంటిపని చెయ్యడు అని సర్దుకున్నాడు రామారావే.

కాలేజీలో రాజూ, సుబ్రమణ్యం కలుసుకున్నారు.

"ఏంవయ్యా——నీకు రామారావు కనిపించాడా ?" అని అడిగాడు రాజు.

"ఏ రామారావు ?" అన్నాడా సుబ్రమణ్యం ఏదో లోకంనుంచి దిగివచ్చిన వాడల్లే.

"ఏ రామారావు ? ఏ. రామారావే"

"లేదే."

"ఐతే మరి పొద్దున చూశానని రామారావు తమ్ముడితో చెప్పావుట"


"అదా, అవును——మా అన్నయ్య కనిపించాడా అని అడిగాడు——'ఆఁ'అన్నాను కనిపించాడేమో ననుకుని...." అన్నాడు సుబ్రమణ్యం ఏడిసినట్టు.

"చంపావుగదయ్యా——రామారావు నిన్నట్నుంచి కనిపించక అందరమూ అవస్థపడుతున్నాము. నువ్వేమో చూశానంటే ఎక్కడో కనుక్కుందా మనుకున్నాను.కోతలకయినా అర్థం వుండాలి" అని రాజు చరచరా వెళ్ళిపోయాడు.

"ఏమిటీ——రామారావా - నిన్నట్నుంచా-కనిపించకపోవడమా——మైగాడ్ : రామారావు కనిపించకపోవడమే !.... రామారావు కనిపించడంలేదు, రామారావు కనిపించడం లేదు" అని ఎలుగెత్తి అరుస్తూ కాలేజీ ఆవరణలోకి పరుగెత్తాడు సుబ్రమణ్యం.

ఆ సాయంత్రం కాలేజినుంచి వస్తూనే రాజు, రామారావు ఇంటికి వెళ్ళాడు. తండ్రి లేడు. తల్లి మాత్రం వుంది. ఆమె స్థితి చూడగానే రాజుకు జాలి కలిగింది. ఆమెకు మధ్యాన్నం తిండి లేదుట - ఒకటే బెంగట : ఈ నాటకం ఎందుకు ఆడుతున్నామా పాపం అనిపించింది రాజు హృదయంలో ఓమూల.

"మీరేం దిగులు పడకండి అమ్మగారూ, వస్తాడు. నేను తీసుకొస్తాగా. ఏమైపోతాడు? చిన్నవాడా చితకవాడా - అర్జెంటుగా ఏ వూరన్నా వెళ్ళాల్సి వచ్చిందేమో ! ఇవాళ చూదాం. రాకపోతే నేను వెళ్ళి నాలుగూ గాలించి, రేపు సాయంత్రానికల్లా లాక్కొస్తాను. మీకెందుకు —— వాడిని తీసుకొచ్చే బాధ్యత నాదిగా" అని ధైర్యం చెప్పి, రాజు బజార్లో కాస్త టిఫిను, పొట్లాం కట్టించుకుని రూము చేరాడు.



"ఏమయ్యా రాజా : ఇంకెన్నాళ్ళీ బందిఖానా : చస్తున్నాను బాబూ నీకేం ?" అని రామారావు ఏడుపు మొహం వేశాడు.

"ఉండవయ్యా రామచ్యా. ఇంకెంత రేపొక్కరోజు :"

"రేపొక్కరోజు ఎట్లాగేం - మా నాన్న ఫొటో ఇవ్వాలి - అది పత్రికలో పడాలి - పడిన వెంటనే నువ్వు నన్ను తీసుకుపోతే బాగుండదు. మరో రెండురోజులు ఆగాలి. ఓయ్ నాయినోయ్"

"ఇష్ —— అట్లా కేకలెయ్యకు - వ్యవహారం మంచి పట్టులో వుంది" అని రాజు జరిగిన విషయాలన్నీ చెప్పాడు.

ఆ రాత్రి రామారావు, రాజు ప్రాణం తీసినంత పని చేశాడు. సెకండు షో సినిమాకు పోదాం అంటాడు, రాత్రిపూట ఎవడు చూడొచ్చాడంటాడు, బ్రతుకు దుర్భరంగా వుందంటాడు, కావాలంటే తలపాగా చుట్టుకుని, క్రింద క్లాసులో కూచుంటానంటాడు: రామారావును సముదాయించి, బుజ్జగించి, ఒక్కరోజు ఓపిక పట్టమని ప్రాధేయపడి - అతన్ని ప్రక్కమీద పడుకోబెట్టి, చిచ్చికొట్టి, జోలపాడి నిద్రబుచ్చినాక గాని, రాజుకు స్తిమితం కళగలేదు.

రామారావు కనిపించక రెండు రాత్రులయింది కాబట్టి, ఇంక 'పత్రికా ప్రకటన' మాట ఎత్తవచ్చునని, కాల రెత్తుకుని రాజు రామారావు ఇంటికి వెళ్ళాడు. బట్టతలాయన బయట కూచుని చుట కాల్చుకుంటున్నాడు. రాజును చూసి, ఆయన పలకరించను కూడా లేదు.

"ఏం, రాలేదాండీ ?" అన్నాడు రాజు విచారంగా.

"వచ్చాడు" అన్నాడు తండ్రి, తుపుక్కున్న ఉమ్మి.

రాజు గుండె మళ్ళీ ఢామ్మంది. రావడం ఏమిటి ? ఇదేమిటాని బాబూ అనుకున్నాడు.

"వాడెందుకొస్తాడయ్యా - రాడు ! ఈ ఇల్లు చేదు, మేమంతా విషం పెడుతున్నాం. ఎందుకు వస్తాడు మరి ! రాడు" అన్నాడు తండ్రి నిబ్బరంగా.

'అమ్మయ్యా' అనుకున్నాడు రాజు. "ఏమిటోనండీ, ఉన్నట్టుండి ఎందుకిట్లా ప్రవర్తించాడో. అర్థంకావటం లేదు" అన్నాడు ఓరగా ఆయనను చూస్తూ.

"వెధవ ప్రవర్తనలకు అర్థం ఒకటి ఏడుస్తుందేమిటి ? చావనీ నాకేం" అన్నాడు రామారావు తండ్రి మహా కోపంగా.

"మీరు కోప్పడకండి. ఏమిటో, ఏం జరిగిందో, నిన్న నేను అందర్నీ అడిగాను. అన్ని వీధులూ చూశాను. మా స్నేహితులు అనుకున్న వాళ్ళందరి ఇళ్ళూ తిరిగాను. ఎక్కడా లేడు. బహుశా ఈ వూళ్ళో లేడేమోననిపిస్తుంది"

"ఏడవమను. నేనూ ఇవాళ కనుక్కొచ్చాను. కాలేజికి డబ్బు కట్టలేదుట. అది కాస్తా పట్టుకుని ఉడాయించాడు. పోతే పొమ్మను. అంతే ఆ వెధవకి అదే దక్కుడు"

"కాలేజీకి డబ్బు కట్టలేదూ ? నాతో కట్టానన్నాడే" అన్నాడు రాజు ఏదో అనాలని.

"అదో అబద్ధం. ఇటువంటి అబద్ధాలకోరూ, దొంగవెధవా పోవడమే మంచిది. శని వదిలింది" అని రామారావు తండ్రి లేచి, కండువా బుజంమీద వేసుకుని లోపలకు పోయాడు. బట్టతలాయన అగ్గిబుగ్గయిపోతున్నాడే. ఎట్లా అనుకున్నాడు రాజు. అక్కడ కాసేపు చతికిలబడి, ఆయన ఎంతకూ రాకపోగా లేచి లోపలకు వెళ్ళాడు.

"నాకు ఒక ఐడియా వచ్చిందండీ. రామారావు ఫోటో పత్రికలో వేయించి, తప్పిపోయాడు అని రాయించి...." అని రాజు చెప్పబోతున్నాడు.

"చెట్టంత వెధవ తప్పిపోవడం ఏమిటి, లేచిపోయినాడు అని వేయించు" అని చిరాకు పడ్డాడాయన.

"లేకపోతే కనబడుటలేదు అని వేస్తాం. దీనివల్ల ఓ నూరో, నూటపదార్లో మీకు ఖర్చయినా, మనవాడు గ్యారంటీగా దొరుకుతాడు. ఇటువంటి కేసులన్నీ ఇట్లా పరిష్కారం కావాలసిందే"

"నూరో నూట పదార్లో ఏమిటి"

"అదే మనవాడిని తీసుకొచ్చిన వారికి బహుమానం. ఆ ఆశపెడితేనేగాని, ఎవరూ తీసుకురారులెండి. డబ్బు అంటే ఎక్కడున్నాసరే ఎవరయినా పడతారు."

"ఇది నీ తెలివా, మరోడిదా—తెల్లారినట్టుంది బతుకు. వాడి ఫోటో పత్రికలో ప్రకటించే దండగ చాలక, బహుమానం ఒకటా-చాలు చాల్లే ఐన దండగేదో ఐంది. చాలు" అని కోప్పడ్డాడు రామారావు తండ్రి.

"దండగ ఏమిటండీ - ఎంతయినా మన అబ్బాయి" అన్నాడు రాజు కిరెక్కించాలని.

"అబ్బాయ్ ఈ పప్పులేం ఉడకవు. ఈ వెధవని రాళ్ళెత్తమన్నానా - గుళ్ళు మొయ్యమన్నానా - లక్షణంగా బుద్ధిగా చదువుకోరా అని బోలెడంత డబ్బు పోసి చదువు చెప్పిస్తూ వుంటే - అది కిట్టక పోయిన వెధవకోసం మళ్ళీ ఈ ఖర్చు కూడా ఎందుకు ? పోతేపోతాడు. చూదాం ఎంతదూరం వెళతాడో. నేనేం వెతకను - వెతికే ప్రయత్నమూ చెయ్యను" అన్నాడు రామారావు తండ్రి - దూరంగా చుట్ట విసిరేస్తూ. రాజు గుండెలు గడ గడ లాడ సాగాయి. కథేదో అడ్డం తిరిగేట్టుందని భయపడ్డాడు. ఈయన మామూలుగా ఒప్పుకుంటాడేమో అని అనుకుంటే ఇదేదో బ్రహ్మప్రళయం అయేట్టుందే !

"మీరట్లా అంటే ఎట్లా - మనవాడు, మన బిడ్డ ఏమయిపోతాడోనని మనం దిగులుపడాలి....మనం....మరి." అన్నాడు రాజు ఏమంటాడో తనకే అర్థంకాక.

"పోవయ్యా - వెధవను గంగలో దూకమను. నాకేం ! నా దేమయినా తప్పుందా ? ఉంటే నువ్వు చెప్పుతో కొట్టు: భరిస్తాను. వాడిని ఓమాట అన్నానా - ఓ ఇదన్నానా - జీతం కట్టరా అని డబ్బిచ్చి నాలుగురోజులో ఐదు రోజులో అయింది. వాడిమీద నమ్మకం వుండబట్టేకదా రశీదు అడగలేదు. మరి అటువంటి నమ్మకద్రోహి

● సభలో మైక్ చెడిపోయింది. ఉపన్యాసమిస్తున్న ఆసామీ ఆఖరి వరసలో కూర్చున్నవాణ్ణి "మీకు వినిపిస్తోందా నే చెప్పేది ?" అని అడిగాడు.

"లేదండి"

మధ్య వరసలో కూర్చున్నవా డొకడు ఆఖరివరసవాడితో; "నాకు వినిపిస్తోంది. మీరిక్కడికి రండి, నే నక్కడ కూర్చుంటాను."

ఇంకా ఎందుకయ్యా నా గడపలో! పోనిద్దూ వాడిష్టం వచ్చిన చోటుకుపోనీ. మనకెందుకు. నువ్వుకూడా ఎక్కడా వెతక్కు. నేనూ వెతకను. వాడే వస్తాడు. చూస్తూ వుండు" అన్నాడు రామారావు తండ్రి ఖచ్చితంగా.

రాజుకు ఇంకేమీ తోచ లే దు. వళ్ళు వేడెక్కిపోయింది. కాళ్ళూ చేతులూ గిల గిల లాడసాగాయి. గుండె తొందరగా కొట్టుకుంటోంది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. "ఐతే ప్రకటన వేయించ వద్దంటారా" అన్నాడు రాజు - తడబడుతూ.

"అంటారా ఏమిటి—అన్నాను. అంతే! ఏమీవద్దు - ఏమీ వేయించను"

"మీకు తెలీదు...."

"నా కన్నీ తెలుసును పోవయ్యా" -

రాజు మూర్ఛపోయినంత పనిజేశాడు. అంటే - కొంపదీసి తమ వ్యవహారం ఎరుగునా ఏమిటి - చచ్చాం!

"అంటే ?" అన్నాడు నెమ్మదిగా.

"అంటేలేదు, కొంటేలేదూ. నువ్వు నా ప్రాణం తియ్యకు. మన తప్పే మీ లేకుండా, వూరికినే పారిపోయిన వెధవ కోసం డబ్బు ఖర్చుపెట్టాలా - ఛీ! ఛీ! దరిద్రగొట్టు వెధవ—పోనీ" అని బట్ట తలాయన లేచి వెళ్ళిపోయాడు. రాజుకు తలా తోకా అందలేదు. నీటమునిగి పోతున్నవాడిలాగా కొట్టుకున్నాడు. ఆయన వెళ్ళిన - వెనకే వెళ్ళి మళ్ళీ చెప్పాడు. ఆయన వినలేదు. ఆయన భార్య చేత కూడా చెప్పించాడు. ఏమీ లాభం లేక పోయింది. వాడి విషయం ఎత్తితే ఇంక వూరుకునేది లేదనికూడా రామారావుతండ్రి గద్దించాడు.

రాజు కాళ్ళీడ్చుకుంటూ రూముచేరి, ఈ శుభవార్త కాస్తా రామారావు చెవిని వెయ్యగా, రామారావు కొయ్యబారి పోయాడు.

"ఇంకేది దారి రాజూ" అన్నాడు రామారావు.

"ఇదేదారి. ఇట్లాగే పోయావంటే మీ ఇల్లొస్తుంది"

"హాస్యం ఆడుతున్నావా, ఇప్పుడా !" అన్నాడు ఏడుపుమొహం వేసి రామారావు.

"మన పాచిక పారనందుకూ, ఈ పడిన అవస్థకూ నవ్వొస్తోంది. ఏడుపూ వస్తోంది. హాస్యం ఒక్కటేగాదు, విషాదంకూడా పలికిస్తాను" అని వాగసాగాడు రాజు.

"ఐతే ఏం చెయ్యమంటావు ?"


"చేసేది ఒకటే. ఇంత మీ నాన్న ఎట్లాగూ దానికి ఒప్పుకోడు. ఎన్నివిధాల చెప్పాలో అన్నివిధాలా చెప్పాను. మీ అమ్మగారు చెప్పింది - ఆయన పట్టే ఆయనది. నువ్వే వస్తావనే నమ్మకంతో వున్నాడు. నువ్వు కాలేజీకి డబ్బు కటని సంగతికూడా ఆయనకు తెలిసిపోయింది. కాబట్టి నువ్వు ఈ రాత్రి ఇంటికివెళ్ళి ఏదో పెద్ద బొంకు బొంకు. ఆ డబ్బు విషయం కూడా ఏదో చెప్పు. ఆయనే డబ్బిస్తాడు. అది తీసుకెళ్ళి కాలేజీకి కట్టు. అంతే. అంతకన్నా చేసేదేంలేదు. ఐందేదో ఐంది. ఇంకా నయం, ఆ అడిగేదేదో ఇవాళే అడిగాను. రెండురోజులు ఆగానుకాదు" అన్నాడు రాజు.

జరిగినదానికి వగచి లాభం లేదని రామారావూ తెలుసుకొన్నాడు. ఇంటికి వెళితే తన తండ్రి ప్రాణాలు తీసెయ్యడు. తిడితే తిడతాడు. పెద్ద అబద్ధం అడితే అదే సర్దుకుపోతుంది. అత్యాశకుపోతే ఇట్లాగే అవుతుంది - అని నీతిపాఠాలుకూడా చెప్పుకుని యింటికి పోవడానికే నిశ్చయించుకున్నాడు రామారావు.

కొంత భయంతోనూ, మరికొంత ఆలోచనతోనూ రామారావు వెంటనే ఇంటికి బయల్దేర లేకపోయాడు. రాత్రే వెళితే మంచిదని అతనికి తోచింది. తన తండ్రిదీ అదోరకం కోపం. రానంతసేపు రాదు. వచ్చిందా అది ఆగదు. ఆ భయంతోనే అతను నెమ్మదిగా ఆరాత్రి ఇంటికి బయల్దేరాడు.

తలుపు కొట్టటానికి రామారావుకు భయంగానే వుంది. తను చేసిన పనిమీద అసహ్యం కూడా కలిగింది. పెద్ద సాధించేవాడల్లే ఈ దంభాలూ, పథకాలూ తలచుకుని తనను తనేతిట్టుకున్నాడు. రాజుఐడియా ఇచ్చాడు. ఇచ్చినంత మాత్రాన తనెందుకు ఒప్పుకున్నానని, ఇప్పుడు బాధపడ్డాడు. కాస్సేపు పోయాక తలుపు తట్టి పిలిచాడు. పిలిచీ పిలవగానే వాళ్ళమ్మ వచ్చి తలుపుతీసి 'నాయనా' అని బావురుమంది.

"ఏంరా, ఎక్కడికి దయచేశావు ? కొంప ఇప్పుడు తెలిసిందా, వెళ్ళి అక్కడెక్కడో వుండకపోయావూ! భయం భక్తీ లేకుండా నీ ఇష్టం వచ్చినట్టు తిరగడమా పోపో - నా ఇంట్లోకి రాకు-పో" అని తలుపులు మూసేశాడు తండ్రి. రామారావు తల్లి ఎంతచెప్పినా, గోలపెట్టినా కూడా ఆయన తియ్యలేదు. బయటనుంచి రామా



రావు "నాన్నా, నాన్నా" అని ఎన్నిసార్లు పిలిచినా ఆయన తలుపు తియ్యసూలేదు, సమాధానం చెప్పసూలేదు.

పిలిచి, పిలిచి రామారావు ఆ అరుగు మీద చీకట్లో చతికిలబడ్డాడు. దాగా ఏడు పొచ్చింది. ఏడిచాడు. తనవంటి వెధవకు కావలసిందే అనుకున్నాడు. తన తండ్రి మొండి పట్టుదల ఇప్పు డర్థమయింది. తన కింక ఈ ఇంట్లో స్థానం లేదా ? ఏవేవో ఆలోచించుకుంటూ, చాలసేపు ఆ అరుగు మీదే కూచున్నాడు రామారావు.

తెల తెల వారుతూ వుండగా రామారావు తండ్రి లేచి, నెమ్మదిగా తలుపుతీసి తన కుమారుని కోసం అరుగువంక చూశాడు. రామారావు అక్కడ లేడు! ఆయన గాభరాగా అటూ ఇటూ చూశాడు. రెండు మూడు సార్లు పిలిచాడు. ఎక్కడా జాడ లేదు. రామారావు తల్లీ, తండ్రి ఇద్దరూ గొల్లుమన్నారు. రామారావు ఈసారి నిజంగానే ఎక్కడికో వెళ్ళిపోయాడు.

రెండురోజులు గడచిపోయింది. ఆ రాత్రి రామారావు రాజు రూముకు వెళ్ళ లేదు. రామారావు తండ్రి, తమ్ముడూ, రాజూ అతనికోసం అంతటా చూశారు. ఎక్కడా కనిపించలేదు.

"వాడికి బుద్ధొస్తుందేమోనని ఆ మాట అన్నాను బాబూ! లేకపోతే రేపొద్దున్న కూడా ఇట్లాగే చేసి ఇంటికొచ్చి తలుపు కొడతాడు. తీసి లోపలకు రానిస్తే మనం లోకువ అవుతాం గదా అని, కాస్త శిక్ష విధిద్దామని అట్లా చేశాను. మళ్ళీ ఇంతపని చేస్తాడనుకోలేదు. వెళ్ళినవాడు ఇంటికి వచ్చాడని ఎంతో సంతోషించాను. ఈసారి ఎక్కడికి వెళ్ళాడో, ఏమైనాడో నాకు మరీ దిగులుగా వుంది" అని రామారావు తండ్రి కళ్ళు తుడుచుకున్నాడు. రాజుకు కూడా కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

మరి కాస్సేపటికి రామారావుతండ్రి ఏదో వూహ తట్టిన వాడల్లే చట్టున లేచి గదిలోకెళ్ళి రామారావు ఫోటో ఒకటి వెతికి తీసి బల్లమీద పెట్టాడు.

"ఎంత బహుమానమయినా ఇద్దాం. ఆ పత్రిక చిరునామా ఏమిటి నాయనా రాజూ !" అంటూ ఆతృతగా బయట కొచ్చాడు రామారావు తండ్రి, కలంతోనూ, కవరుతోనూ సహా !

నిర్వచనాలు

స్వగృహం : మనం ఆడింది ఆట, పాడింది పాటగా చెల్లుబడి అయ్యే ప్రదేశం (పెళ్లికాకముందు)

డాక్టరు: ఇతరులు బాగపడుతున్నంతకాలం బాధ పడనక్కర లేనివాడు



ఈ మధ్య మా యింటికి మా బంధువొకాయన భోజనానికి వచ్చాడు. భోజనం చేస్తుంటే మా క్రిష్ణ "హి హి హి" అన్నాడు. దాంతో ఆయనకి కోపంవచ్చి "నవ్వటానికి ముందు ఏదేనా కారణంవుండాలోయ్. ఊరికే అలా నవ్వకూడదు" అని చల్లగా చీవాట్లేశాడు. వెంటనే నాకు నవ్వొచ్చింది. కానీ ఆయన అన్నది ఎంత వరకూ నిజమా అని ఆలోచించసాగాను.

"నీ ముఖం అందంగా వుండాలంటే ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ ఉండు" అని ఒక గొప్ప సౌందర్యవతి తన రహస్యం ఓ సారి నాతో అంది. అసలు నవ్వుగురించి మన శాస్త్రకారులు కూడా చాలా రాశారు. స్త్రీకి చిరునవ్వు చిందే పెదాలు ఎంతో శోభ నిస్తాయని ఒకరంటే ఎప్పుడూ నవ్వటం ఎంతో ఆరోగ్యమైన విషయం అని యింకొకరన్నారు. ఎప్పుడూ నవ్వకుండా ఉన్నవాళ్ళని చూస్తే వడ్లగింజ వేస్తే పేలగింజ అవుతుంది దాని ముఖంమీద అంటారు. సరే నవ్వమన్నారు కదా అని కాస్త ఎక్కువ నవ్వామో "అంత వెకిలితనమేమిటి హన్నా" అని మందలిస్తారు. ఒకవైపు నవ్వండి అంటూ యింకోవేపు వెకిలితన మంటే ఎలా ?

అసలు ఆడవారి నవ్వుగురించి శాస్త్రంలో యిరా— అంటే యిన్ని రకాలుగా చెప్పేరు. 'స్మిత, హసిత, విహసిత, అపహసిత, అతిహసిత. కళ్ళలో కాంతి కొంత కలిగేటట్టు నవ్వితే స్మిత అని. కొంచెం పళ్ళు కూడా కనిపిస్తే హసిత అని, దీనికితోడు చిన్న ధ్వని చేస్తే విహసిత అని, శరీరంకూడా కదిలితే అపహసిత అని అంటారుష. అలాగే మనం కిల కిల నవ్వటమనీ, పక పక నవ్వటమనీ అంటూంటాము.

అసలు నవ్వేందు కొస్తుందోయ్ అంటే "ఆత్మానందమే కారణం తల్లీ" అంటారు ఇదెంతవరకూ నిజమంటారు ? నవ్వినప్రతివారి హృదయంలోనూ సంతోషం, ఆత్మానందం నిండి ఉందా ? అని ప్రశ్నిస్తే లేదు అని చెప్పాల్సిందే. ఒక్కొక్కసారి రోడ్డుమీద అరటిపండు తొక్కమీద కాలు వేసి జారిపడినాయనను చూసి నాలికపక్కకి పెట్టి పళ్ళు బయటపెట్టి నవ్వుతారు. ఇది మనోబలహీనతకు నిదర్శనమని నా అభిప్రాయం. కొన్ని సమయాల్లో మన నవ్వు అనేకమందికి అనేకార్థాలు కలిగిస్తుంది.

ఇది చెబుతుంటే ఒక కథ జ్ఞాపకం వచ్చింది. వెనకటికి రాములవారు, సీతాదేవి సింహాసనంమీద కూర్చొన్నారు.పట్టాభిషేకానికి. హనుమంతులవారు రామ పాదాలదగ్గర కూర్చున్నారు. భరతశత్రుఘ్నులు వింజామరలు వీస్తున్నారు. ఇంతలో లక్ష్మణుడు కిసుక్కున నవ్వేశాడు. ఇహ చూసుకోండిసార్ రియాక్షన్. "ఎందుకు లక్ష్మణుడు నవ్వేడు చెప్మా. అపును నేను పద్నాలుగు సంవత్సరాలు రావణుడి దగ్గర ఉండి తిరిగి తగుదునమ్మా అని రాముడిదగ్గర కొచ్చాను. అందుకే నవ్వి వుంటాడు ఈ లక్ష్మణుడు" అనుకొందిట సీతాదేవి. ఇక భరతుడు ఈ విధంగా అనుకున్నాట్ట—"అన్నగారు లేకుండా రాజ్య మేలుదామనుకొన్నాడుకానీ. యిప్పుడు నక్కవినయం చూపిస్తున్నాననుకొంటున్నాడేమో లక్ష్మణుడు.అందుకే నవ్వి వుంటాడు." ఇక హనుమంతుడు తాను కోతి మొహంగలవాడని నవ్వేడనుకున్నాడట. ఈ కలవరమంతా గ్రహించిన శ్రీరాముడు తమ్ముడిని దబాయించి కారణం చెప్పమనే సరికి 'మహాప్రభో నాకు ఈ పద్నాలుగేళ్ళు రాని నిద్ర యిప్పుడొచ్చింది. అంచేతనవ్వేను"అని ధాన్యపుగింజలో బియ్యపుగింజ లాగ చెప్పేశు. చూశారా ఆనాడు కూడా ఈ నవ్వు నాలుగువిధాల చేటయింది.






కొన్ని సమయాల్లో ఆత్మబలహీనత తను దాచేందుకు నవ్వు అడ్డుగా పెట్టుకుంటాము. ఎదుటివారు చెప్పింది మన కర్థం కాకపోయినా, మనం చెప్పింది ఎదుటివారి కర్థం కాకపోయినా నవ్వు వస్తుంది. పెద్దవాళ్ళేదైనా చెప్పినప్పుడు వినకపోయి నప్పుడు కూడా "నవ్వులాటగా వుందా ?" అని చీవాట్లు తింటాము.


ఒకొక్కప్పుడు నవ్వు ముఖానికి అందంకంటే వికారం కలుగ చేస్తుంది. ఎదుటి వారిమీద అసూయ ఉంది, వారిని ఎలాగైనా నొప్పించాలనుకుంటే నవ్వుతూ చెప్పబోతాము. ఉదాహరణకు మా మిత్ర వరేణ్యుడు నేను రాస్తున్న వ్యాసాలు చూసి నవ్వుతూ 'బాగానే వున్నాయి' అన్నాడు. ఆ నవ్వు ఉంది చూశారూ, అతని ముఖానికి ఆవదం పూసినట్టుంది. కడుపునొప్పి వస్తే పెట్టిన మొహంలా వుంది.

కడుపునొప్పి అంటే జ్ఞాపకం వచ్చింది. మా మామయ్యకి యింజక్షను తీసుకోడమంటే చచ్చే భయం. ఒకసారి జ్వరం వస్తే డాక్టరు యింజక్షను యిచ్చాడు. అప్పుడు ఆ భయం కప్పిపెట్టటానికని ఆయన నవ్వటం మొదలెట్టాడు. ఇంజక్షన్ సిరింజి వేసోసారి చూడనూ, నా వేపు చూసి మూతి ఈ చెవినుంచి ఆ చెవుకి సాగదీశాడు. అది నవ్వట. దీన్నే కాబోలు 'ఏడవలేక నవ్వట'మంటారు.

మొన్న ఒకసారి "జ్యోతి" చదువుతూ పకాలున నవ్వాను. తల ఎత్తేసరికి మా చిట్టి వస్తున్నాడు. తన్ను చూసే నవ్వేననుకొని జోరుగా వెళిపోయాడు. నా నవ్వు నా కానంద మిచ్చినా ఎదుటి వ్యక్తిని బాధించింది. ఇలా అనేక రకాలుగా ఉన్న ఈ నవ్వుని అందరూ యిష్టపడతారు. జీవితంలో కోరుకుంటారు. అందుకే నవ్వాలి. నవ్వించాలి. నవ్వండి. ●







బాకీ జమ

భమిడిపాటి రామగోపాలం

శేఖర్రావుకి నవ్వు వచ్చింది.

పాపం అన్నపూర్ణ! అనుకున్నాడు.

పొద్దున ఆఫీసుకి వస్తూ వుంటే మడత పెట్టిన కాగితం వొకటి అతని చేతి కిస్తూ "కవరు కొని నాన్నగారి ఎడ్రసు రాసి పోస్టులో వెయ్యండీ" అన్నది అన్నపూర్ణ.

కవరు తెప్పించి జేబులోంచి కాగితం తీశాడు శేఖర్రావు.

ఉత్తరం చాలా తేలిగ్గా వుంది.

తను మామగారికి ఉత్తరం రాసి చాలా రోజులయిపోయింది. ఆ మధ్య "మనవణ్ణి చూడాలనుంది. ఓసారి

రావాలనుకుంటున్నాను" అని వ్రాశాడాయన. 'రండి, చాలా ఆనందిస్తాము; అసలు రమ్మని మేమే రాద్దామనుకుంటున్నాము. చిట్టిగాడు తాత, తాత అంటున్నాడు' అని వ్రాయాలని (లేకపోతే బాగుండదని), అనుకున్నాడు తనే. కాని ఏమిటో రాయడమే పడలేదు.

పైగా మామగారికి ఉత్తరం రాయవలసిన సంగతేదైనా ఉంటే ఇద్దరి తరఫునా అన్నపూర్ణే రాయడం మామూలు. అన్నపూర్ణ రాస్తోంది గదా అని తను ప్రత్యేకం రాయకపోడం - ఏదో అలా అశ్రద్ధ అయిపోతూ వస్తోంది.

పోనీ ఓ పేజీ ఖాళీగా వుంది, ఇందులో రాద్దామనుకుంటూ, అసలు అన్నపూర్ణ ఏమి వ్రాసిందో చూద్దామని, చదివాడు.

అన్నీ సరే కాని.

"ఎప్పుడో నాగవల్లి నాడు మీ రిస్తానన్న ఉంగరం ఇవ్వలేదని మీ అల్లుడుగారికింకా బాధగానే వుంది. ఏదో సమయం చూసి నన్ను దెప్పిపొడుస్తూ వుంటారు. ఈ మధ్యనే ఓమారు అన్నారు కూడాను. అందుచేత ఈమారు మీరు వచ్చేటప్పుడు ఆయనకి మీ రివ్వవలసిన ఉంగరం చేయించుకొని రావలెను. మరిచిపోవద్దు. అన్నయ్య వేలి కొలత...."

ఈ వాక్యాలు చూసేక శేఖర్రావుకి నవ్వు ఆగలేదు.

ఆ ఉంగరం సంగతి అతనెప్పుడో మరిచి పోయాడు.

మామగారు ఏవో ఇస్తాననడం, తను ఏవో కావాలనుకోడం, వాటికోసం పట్టుదలగా అడుగుతూ సమయం దొరికిందే చాలని సాధిస్తూ ఉండడం, ఇలాటివంటే అసహ్యం శేఖర్రావుకి. చీటికీ మాటికీ మామగారిమీద ఆధారపడడం, వారు తన కోర్కెలు తీర్చకపోతే అలిగీ, కోపపడీ బాంధవ్యాన్ని కలుషితం చేసుకోడం, అందువల్ల పరస్పరం పెరిగి లోపల్లోపల వుడికి ఎప్పుడో వొక్కసారి బైటపడే ద్వేషాలూ - యివేవీ శేఖర్రావు తత్వానికి సరిపడవు. శక్తి వుంటే మనం కష్టపడి కొనుక్కోవాలి. లేకపోతే ప్రాప్తం లేదని వూరుకోవాలి - అంటాడతను.

అన్నపూర్ణని మొన్న నీ మధ్య ఆ విషయమై ఏదో అన్నట్టు అతనికి జ్ఞాపకం లేదనే చెప్పాలి. అతికష్టం మీద వేళాకోళానికి అనడం జరిగిందని గుర్తు తెచ్చుకున్నాడతను.

అదెలా జరిగిందంటే, శేఖర్రావు అక్కగారు ఆ మధ్య వచ్చి ఓ వారం ఉండి వెళ్ళింది. మాటల సందర్భంలో ఆవిడేమో సరదాగా 'మీవాళ్ళు సామ్యం నిజం చేస్తున్నట్టున్నారే మరదలా. నాటినించీ నేటివరకూ పెట్టుపోతల్లేవు. తిరిగి చూసినట్టయినా లేదూ!' అన్నది. ఆ మాట మీద శేఖర్రావు 'అంతవరకూ ఎందుకూ, నాగవల్లి నాడిస్తానన్న ఉంగరమే ఇంతవరకూ ఠికాణా లేదు.' అన్నాడు ఎగతాళి చేసినట్టు.

అన్నపూర్ణ ఆనాడు ఆ మాటకి జవాబు చెప్పలేదు; శేఖర్రావూ అదంతా అప్పుడే మరిచిపోయాడు. ఆ మాటని ఆమె మనసులో భద్రపరుచుకొని మామగారికి రాసే

ప్రతీ ఉత్తరంలోనూ రాసేస్తోందేమో నని శేఖర్రావుకి బాధ కలిగింది.

నిజం చెప్పవలిసి వస్తే శేఖర్రావు తన వారెవరో ఎదుట వున్నప్పుడు అన్నపూర్ణని - మీ వాళ్ళు, మీరూ, అలా చేశారు, ఇలా చేశారు - అంటూ ఎగతాళి పట్టించినా, అతనికి ఆమె అంటే వున్న గౌరవాభిమానాలు ఆమెకి బాగానే తెలుసును. ఇలాటి చిన్న చిన్న విషయాలు శేఖర్రావు పట్టించుకోడనీ ఇచ్చిపుచ్చుకోడాల మీద అతనికి చాలా మెచ్చుకో తగ్గ అభిప్రాయా లున్నాయనీ ఆమెకి తెలుసును.

అలాటి అన్నపూర్ణ యిలా రాసిందంటే శేఖర్రావుకి నవ్వు వచ్చి ఆ నవ్వు వెనక బాధ స్ఫుటంగా తెలియజేసింది. తను రాద్దామనుకున్న ఉత్తరమూ వ్రాయలేకపోయాడు, రాస్తే అన్నపూర్ణ వాక్యాల్ని తను సమర్థించినట్టొచ్చే అర్థం స్ఫురించి. అన్నపూర్ణ వ్రాసిన ఉత్తరానికి తన బాధ్యత ఏదో వుందని బాధపడసాగాడతను. అసలు ఆమె అలాటి ఉత్తరం రాసిందని తనకి తెలిసిన తరవాత తను ఆ ఉత్తరాన్ని వెళ్ళనివ్వనే కూడదనీ అనుకున్నాడు. ఆ కవరు మీద తన దస్తూరీతో ఎడ్రసు ఉన్నా అందులో వాక్యాలు తన సమ్మతి పొందాయని అర్థం వొస్తుందేమో. అన్నపూర్ణ వ్రాసే ప్రతీ ఉత్తరమూ తన సమ్మతి పొందాలనుకోడమూ అన్యాయంగానే కనిపిస్తోంది.

శేఖర్రావు నవ్వుకుంటూ ఆలోచించుకుంటూ కవరుమీద ఎడ్రసురాసి పోస్టుకి పంపించేశాడు.

"అయితే, అన్నపూర్ణా ఎన్నో ఉత్తరమిదీ?" అన్నాడు శేఖర్రావు నవ్వుతూ కంచం దగ్గిర కూచుని.

"ఏమిటి ఎన్నో ఉత్తరం?"

"అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. మీ నాన్నగారికి నువ్వు రాసిన ఉత్తరం చూశా నివాళ - బాగా రాశావులే — మొత్తం మీద నేను మరిచిపోయినా నువ్వు మరచిపోలేదా ఉంగరం సంగతి. ఏమైనా మీ నాన్నగారు ఇలాటి వాటికి లొంగే ఘటం కాదు-"

శేఖర్రావు చెయ్యదల్చిన యీ కృత్రిమ అవహేళన కృత్రిమంగానే వొచ్చింది. అతను మాటల కోసం తడుముకోసాగాడు.

అన్నపూర్ణ మాటాడలేదు.

"మాట్లాడవేమీ? అంత సుళువుగా?-"

"అంత బాగా అర్థం చేసుకున్నారన్న మాట, మీ రాయన్ని."

"ఏముంది యిందులో - అర్థం చేసుకోడానికీ మానడానికీనూ. మన పెళ్ళయి ఏడేళ్ళయి పోయింది. పాపకే వెళుతున్నాయి ఆరేళ్ళు. ఇంకో ఏడేళ్ళు కళ్ళు మూసుకుంటే మనమూ అల్లుడికి ఉంగరమూ, వాచీ, సైకిలూ కొనే అవసరం వొస్తుంది. ఇంకా ఎక్కడి నాగవల్లి అలకలు, ఎక్కడి ఉంగరాలు!"

"మా వాళ్ళేదీ అలా మరిచిపోరు. ఈ మాటు తెస్తారు చూడండి"

'తేరు'

'తెస్తేనో?'

'లేకపోతేనో?'

'పోనీ పందెం వేయ్యండి. తెస్తే ఏమి స్తారు ?'

'నీకేమిటి ఇవ్వడం మధ్యని !'

'మీ కెలాగా సరదా లేదు. నాకిచ్చే స్తారా ఆ వుంగరం ?'

"నీ కెందు కిస్తానూ ? అంతగా నువ్వు అడుగుతున్నావు గనక ఇదే పందెం. మీ నాన్నగారు ఉంగరమే గనక యిచ్చినట్టయితే ఏ దారేపోయే దాన్నయ్యకో యిచ్చేస్తా నది. లేకపోతే ఆ యేడుకొండల వాడి కిచ్చేస్తాను సరా !"

"ఎవ్వరికీ యివ్వరూ. మహా చక్కగా పెట్టుకుంటారు. బంగారమా బలుసు కొయ్యా ?"

"చూద్దువుగాని, ఇంతకీ ఆయన ఇచ్చి నప్పటి మాట కదా !"

"ఆయన యివ్వనూ యిస్తారు, మీరు పుచ్చుకోనూ పుచ్చుకొంటారు. ఎందు కొచ్చిన పందేలు ? ఇంతకీ మిమ్మల్నా ఉత్తరం ఎవరు చదవమన్నారు ?"

'చదివితే చదివాను. నువ్వందులో ఉంగరం సంగ తెందుకు రాశావూ ?'

"నేనేం నాకోసం రాయలేదు. మీకే గదా ఒస్తుంది ఉంగర మని ఏదో రాశాను. అడగండీ యెవరిస్తారు ?"

"అడిగితే అడుగు గాని. నే నేదో సాధిస్తున్నాననీ, దెప్పుతున్నాననీ రాయడ మెందుకూ ?"

"ఏదో రాశానండీ. మీ రవన్నీ చదవడ మేమిటి ?"

"నయం, ఇప్పటికేనా చదివి నీ తత్వం తెలుసుకున్నాను. ఇంకా ఎవ రెవరికి ఎలా ఎలాటి ఉత్తరాలు రాసేస్తున్నావో ఏమో. ఇక ముందు అన్నీ చూస్తూ ఉంటాను"

శేఖర్రావుకి ప్రమోష నొచ్చింది. ఈ ప్రమోషన్ కోసం అతను నాలుగేళ్ళనించీ ఎదురు చూస్తూ అవస్థ పడుతూ వున్నాడు. ఒక ఆఫీసరు డిపార్టుమెంటల్ టెస్టు ప్యాసవలేదనీ, ఇంకొకాయన ప్రభుత్వం వారిచ్చిన కమ్యూనల్ జీ. వో. ప్రకారం నీకిది రాదనీ, యిలా ముప్పతిప్పలూ పెట్టగా పదకొండు మంది తనకన్నా జూనియర్లు, తనపాటి టెస్టులు ప్యాసవని వాళ్ళూ ముందు ప్రమోట్ కాగా యీ మాటు అతని కొచ్చింది ఈ ప్రమోషన్. భర్త యిన్నాళ్ళూ అడ్డమైన వాళ్ళ కాళ్లూ పట్టుకుంటూ అడ్డదార్లు తొక్కుతున్నాడని తెలిసి ప్రమోషనొస్తే కొండ కొచ్చి నీ దర్శనం చేసుకుంటా మని శ్రీ వెంకటేశ్వర స్వామికి మొక్కుకుంది అన్నపూర్ణ. అది యిప్పుడు చెప్పి బయల్దేరమంది.

ససేమిరా వల్లకా దన్నాడు శేఖర్రావు. "నా కసలు అలాటి పిచ్చి నమ్మకాల్లేవు. నువ్వు మొక్కుకునే ముందు నాతో ఆలోచించ వలసింది. ప్రమోషనొచ్చిన కొత్తలోనే పది రోజులు సెల వడిగితే ఆఫీసరు సెలవు యివ్వడు సరిగదా నా గురించి దురభిప్రాయ పడతాడు కూడానూ. అంతగా వెళ్ళే తీరాలని నువ్వనుకుంటే మీ అన్నయ్యని రమ్మని రాయి. ఇద్దరూ కలిసి పిల్లల్ని తీసుకు వెళ్ళండి" అన్నాడు.

అన్నపూర్ణ అలా వీల్లేదంది. "దేముడికి మొక్కుకోడానికి మీతో ఆలోచించడ మేమిటి. ఇంతకీ నేను మొక్కుకో బట్టి కదా మీ కీ ప్రమోష నొచ్చింది. తిరపతి వెళ్తా నని సెలవడిగితే ఇవ్వనని ఏ ఆఫీసరూ అనడు. మీ రసలు సెలవడిగి చూడండి. మీరే రావాలి. మా అన్నయ్య రాకపోడు గాని మీతో వెళ్ళిన సాటొస్తుందా ?" అన్నది.

"అదేమో నాకు తెలీదు. ప్రతీ దానికీ ఏమిటి నీ అల్లరి? నాదగ్గిరిప్పుడు డబ్బులేదు" అన్నాడు శేఖర్రావు.

"అబద్ధా లాడకండి. అందులో స్వామి దర్శనానికి చేసే యాత్ర ఎగ్గొడదామను కోడం మహా పాపం. మీ దగ్గిర నిజంగా డబ్బు లేదూ ?" అంది అన్నపూర్ణ చిలిపిగా నవ్వుతూ.

ఈ ప్రమోషను దావతు వుద్యోగంలో శేఖర్రావు తొమ్మిది నెల్లుగా కింది ఉద్యోగం జీతం మీదే యాక్టు చేస్తూ వుండడంవల్ల ఈ ఇచ్చిన ప్రమోషన్ ఆ యాక్టు చేస్తున్న తేదీ నించి వర్తించేటట్టు యివ్వడం జరిగింది. అందు మూలంగా తేడా జీతం తొమ్మిది ముప్పయిలు రెండువందల డెభ్భై, కరువు భత్యం దాదాపు యాభై అంతా మూడువందల యిరవై రూపాయల వరకూ శేఖర్రావుకి ఇవాళే ముట్టింది. ఆఫీసులో టీ పార్టీ చేశాడుకూడానూ అతను. ఆ విషయమంతా సాయంకాలం 'పేప్స్' పట్టుకొచ్చిన ప్యూను వివరించి చెప్పి 'అయ్యగారు బంగార మంటి వారమ్మా. ఎంత అదృష్టమో నీది" అని వో కాంప్లిమెంటు పారేసి వెళ్ళాడు.



"బంగారంలాంటి పిల్లంటే నమ్మండి."
"ఎన్ని కేరట్లేమిటి ?"

'ఏడిశావులే నోరు ముయ్యి' అనవలసిన అన్నపూర్ణ ఆ వృద్ధుడి మాటలకి గుండెల్లోంచి పులకరించి పోయింది.

ఎలాగో బయల్దేర దీసింది భర్తని అన్నపూర్ణ. పదిరోజులు సెలవుపెట్టి పిల్లల్నిద్దర్నీ భార్యనీ తీసుకుని తిరుపతి బయల్దేరాడు శేఖర్రావు.

దేవస్థానం ఆఫీసులో, సత్రంలో గది కోసం ఘర్షణ అయింది గాని పనికాలేదు. ఇవతలికొచ్చి మార్గాంతరం ఏమిటా అని ఆలోచిస్తూ అన్నపూర్ణ అడిగే ప్రశ్నలకి సమాధానం చెబుతున్నాడు శేఖర్రావు.

"అటుచూడూ, మీ నాన్నగారుకాదూ ? ఇక్కడికెలా వొచ్చారీయనా ?" అన్నాడతను హఠాత్తుగా.

"అరె ! నాన్నగారే !" అంది అన్నపూర్ణ.

శేఖర్రావు మామగారు అతను వేసిన

(9)

కేకవేసి వచ్చాడు. ఆయనా వాళ్ళని అక్కడ చూసి ఎంతో ఆశ్చర్యపడ్డాడు. "ఈయన గార్ని చూడాలని ఎన్నాళ్ళనించీ అనుకుంటున్నా పడిందిగాదు. ఏం పేరే అమ్మాయి వీడిదీ ?" అని శేఖర్రావు కొడుకుని ఒకటే ముద్దులాడ్డం ప్రారంభించాడు.

"అదిసరే గాని మీ రిక్కడి కెలా వచ్చారు నాన్నా ? కూడా ఎవరైనా వచ్చారా ?"

వ్యాపారం పనిమీద మద్రాసు వెళ్ళడమూ, స్నేహితుడి కొడుక్కి తిరుపతిలో జరిగిన పెళ్ళికి అక్కణ్ణించే రావడమూ చెబుతూ, ఇంకో అరగంటలో ఇంటికి బయల్దేరుతున్న సంగతీ చెప్పాడాయన.

"మీరు కనబడకపోతే చాలా అవస్థ పడిపోదునే ! ఇంకా గుంటూర్లో దిగి మీ యింట్లో ఒక పూట వుండి వెళదా మనుకున్నాను. నయమే. ఇదుగోనమ్మా శేఖరం. నీ కిస్తానన్న ఉంగరం. ఎంతో కాలంగా అనుకోడం - అశ్రద్ధ అయిపోడం. మరేం అనుకోకు నాయనా: మొన్న మద్రాసులో సడన్‌గా జ్ఞాపకమొచ్చి వీకమ్‌సీస్ లో రడీమేడ్ వుంటే తీసుకున్నాను. ఏదో ఆలస్యమైనా అనుకున్నట్టు కుదిరింది."

శేఖర్రావు సిగ్గుతో ముడుచుకుపోయాడు.

"లేదండీ, నేనా మాటెప్పుడో మరిచిపోయాను. అన్నపూర్ణే నేనెప్పుడో సరదాకన్న మాట పుచ్చుకుని రాసింది. నాకిల్లా కొసాకి పుచ్చుకుంటూ వుండడమంటే యిష్టం లేదు. మీకూ తెలుసుగా" అన్నాడతను ఇబ్బంది పడుతూ.

అన్నపూర్ణ చురుగ్గా, ప్రశ్నార్థకంగా చూసింది అతని వేపు.

"అదేమిటి నాయనా ఆ మాట. నేనిస్తానన్నదే గాని నువ్వు నన్ను అడిగి విసిగించిం దేముంది యిందులో. అమ్మాయి రాసిందనే తెచ్చాననుకున్నావా: మెడ్రాసు వెళ్ళడం, మా స్నేహితుడు వాళ్ళ కోడలికి పెట్టబోయే వస్తువుల కోసం షాపుకి వెళ్ళడం జరక్కపోతే యిప్పుడూ తెచ్చివుండే వాణ్ణి కాదు. ఏదో దైవ కృపవల్ల యిప్పటికి సరైన టైములో గుర్తుకొచ్చింది. అశ్రద్ధ చేసేనని ఏమనుకోకు. మంచివాడివి గనక అలా వూరుకున్నావు. స్వల్పానికి తేలిపోకుండాసూ" అంటూ కూతురి చేతిలో పెట్టాడాయన ప్యాకెట్టుని.

"మీరు కూడా వుండండి నాన్నా. రెండు మూడు రోజులుండి ఇవన్నీ చూసేసి అందరమూ కలిసి వెళదాం. ఎలాగూ గుంటూర్లో దిగే ఉద్దేశం ఉంది గదా"

"అయ్యో, నన్ను బలవంతం చెయ్యకు తల్లీ. ఇప్పటికే చాలా లేటయిపోయింది. ఇక్కడికి రావడానికే ఎంతో యిదయ్యాన్నేను. ఏదో దైవ కృపవల్ల ఇక్కడ కలిశాం. పిల్లల్ని, నిన్నూ చూశాను. నన్నిలా వెళ్ళనీ"

ఆయన వెళ్ళాడు. అన్నపూర్ణ కుతూహలంగా ఉంగరం చూసింది. చాలా బాగుంది. అయితేనేం అది పెట్టుకోడానికి శేఖర్రావు ఏమీ ఉత్సాహం చూపించడం లేదు. 'మీ నాన్నగార్ని పీడించి తెప్పించావు. పైగా నేనేదో సాధించినట్టూ, దెప్పిపొడిచినట్టూ ఉత్తరాలు రాసి నన్నో రాక్షసుణ్ణి చిత్రించావు. నాకిది అక్కర్లేదు. నీ యిష్ట మొచ్చినట్టు చేసుకో" అన్నాడతను.

"ఆయన్ని వొదిలి నాదగ్గిర అలుగుతున్నా రేమిటండోయ్ !" అంది అన్నపూర్ణ.

"ఛీ వూరుకో. నన్ను ఆఖరికి ఎల్లా అర్థం చేసుకున్నావు:"

కొత్త వస్తువు వెంటనే వాడాలి. అని చెప్పి ఎలాగో శేఖర్రావు వేలికి తొడిగింది అన్నపూర్ణ. శేఖర్రావు వేళ్ళు ఉంగరాలు పెట్టుకుందికి వీలైనవి. చక్కని కండ గలవి. అనుభవం ఉన్న బత్తుడు చేసినదీ, బాధ్యతగల వ్యాపారసంస్థ అందించిందీ గనక కాబోలు; పనితనం, ఆకారం, వర్ణం కుదిరి చక్కగా ఉంది ఉంగరం. 'శేఖర్' అని చెక్కివున్న పేరులోని అక్షరాలు ప్రత్యేకంగా ఎవరికైనా నచ్చేటంత అందంగా వున్నాయి. కొంచెం వొదులుగా వుందన్న మాట గాని, చాలా చక్కగా అమిరింది అతని కా ఉంగరం. బావుందని అతనే ఒప్పుకున్నాడు. పదే పదే తను చూసుకుంటూ ఎవరేనా చూసినప్పుడు 'ఎలా వుంది ?' అని అడిగేస్తూ వుండడం ద్వారా కొంతసేపు గడిచేక ఆ కొంతసేపట్లోనూ 'కాంచనం' మీద 'పురుషుడికి' పెరిగిన మమకారం గుర్తించి మురిసిపోయింది అన్నపూర్ణ. కామిని తరవాత కాంచనమే యీ విధంగా చెయ్యగలగడం కళ్ళారా చూసి. అఖర్లే దన్నాడు గాని. ఎలాగో పెట్టుకుంటాడు లెమ్మని సమాధాన పడింది.

"కొంచెం లూజుగా వుందీ గదూ. మన వూరెళ్ళాక చిన్న ముక్క తీయించి సైజుకు చేయించు కుందాం లెండి" అన్నది అన్నపూర్ణ.

* * *

ఆ సాయంత్రానికి తిరుమల చేరుకొని మర్నాడు పొద్దున్నే గుడిలోకెళ్ళి దర్శనం, మొక్కు, అన్నీ అయ్యాక గుడిదాటి యివతలి కొచ్చారు శేఖర్రావు దంపతులు.

ఇరుగూ పొరుగూ అడుగుతారని అయితేనేం, సరదా తీరడానికయితేనేం. బొమ్మల షాపు దగ్గిర కొచ్చి చందనపు బొమ్మలూ, కాగితపు బొమ్మలూ ఎంచింది అన్నపూర్ణ.

'డబ్బిచ్చే సెయ్యండి'

అప్రయత్నంగా ఆమె చూపు జేబులోంచి బైట పడుతున్న శేఖర్రావు చేతి మీద పడింది.

వేలిని ఉంగరం లేదు.

రెండో చేతి వేలికి పెట్టుకున్నా డేమో అనుకుంటూ అటు చూసింది. ఆ చేత్తో పాపని పట్టుకున్నాడు శేఖర్రావు. దాన్నీ లేదు ఉంగరం.

'ఉంగర మేదండీ ?' అంది గాభరాగా అన్నపూర్ణ.

శేఖర్రావు నవ్వాడు.

"దాచారా యెక్కడైనా ? లూజుగా వుంది. ఎక్కడైనా పడ్డదేమో నని హడిలిపోయాను" అంది మళ్ళీ వేరే విధంగా అనుకోడానికి కిష్టం లేక.

● **గమనిక :** "జ్యోతి" ఉగాది సంచికతోపాటు ఉల్ఫాగా వచ్చిన శోభకృన్నామ సంవత్సర (ప్ర) పంచాంగం గుణించినవారు "జ్యోతి" శాస్త్రవేత్త భాగవతుల శంకరశాస్త్రిగారు పురఫ్ ఆరుద్ర.

శేఖర్రావు చల్లగా 'పోయింది' అన్నాడు.

"వోశ్, నిజం చెప్పండీ, దాచలేదూ?"

"నిజమే. ఇంతకు ముందే హుండీలో డబ్బులేస్తూ ఉంటే జారి పడింది. సరే స్వామికే గదా వెళ్ళిందని చెప్పలేదు నీతో. ఇంత తొందరగా చెప్పవలి సొస్తుందనీ అనుకోలేదు" అన్నాడు శేఖర్రావు నవ్వుతూ.

'నిజం ?'

అన్నపూర్ణ మొహంలో విచార రేఖలు కనబడి పోతున్నాయి. వాటి ఫలితం కొంత కాలం - బహుశా చాలా కాలం - వ్యథ. నాన్నగారు పెళ్ళినాడు అన్న మాట ప్రకారం యిచ్చిన ఉంగరం, చాలా చర్చకి కారణమైన కానుక, ఏమీ కాకుండా పోయిందే అని ఆమె పడబోయే బాధ శేఖర్రావుకి స్పష్టంగా కనబడుతోంది. అది పంచుకోడానికి గాని, ఆమెని అనుభవించనియ్యడానికి గాని అతను సిద్ధంగా లేడు. అతను ఉపాయం వెతుక్కోడానికి సమయం లేదు.

"నిజమే. ఎందుకలా బాధ పడతావు ? మనం యిస్తామన్నదేగా :- మరిచి పోయావా ? ఆనాడు పంతానికి - మీ నాన్నగారు ఉంగరం యివ్వడమే తటస్థిస్తే ఏడుకొండల వాడి కిస్తానన్నానుగా!"

"ఎంతపని చేశారండి—కావాలనే చేసి నట్టున్నారు ; నమ్మకం లేదంటూ కడానూ."

"ఇందులో నమ్మకాని కేముందీ? నువ్వు మరిచిపోయినా ఆ స్వామి మరిచిపోకుండా జమ కట్టుకున్నాడు—అసాధారణమైన శక్తి సుమా ఆయన్ది ! కాకపోతే ఏడేళ్ళనాడు ఉంగరం యిస్తానన్న పెద్దమనిషి ఇన్నాళ్లూ యివ్వక పోవడ మేమిటి. మనం తిరపతి వొస్తున్నామని తెలియకపోయినా మీ నాన్నగారు యిక్కడ తటస్థపడి యిచ్చేసి చక్కా పోవడమేమిటి!—వ్యాపారం పనంటూ ఒకటి కల్పించి ఆయన్ని మెడ్రాసు పంపించి, అక్కడ కొనిపించి. స్నేహితుడి కొడుకు పెళ్ళి ఒకటి ఏర్పాటు చేసి ఇక్కడికి రప్పించి—అంతా తనకి రావలసిన ఉంగరం కోసం ఆ స్వామి చేసిన మాయ కాదూ ?" అన్నాడు శేఖర్రావు.

క్షణంలో విచారమంతా మరిచి పోయింది అన్నపూర్ణ. ఆమె కళ్ళు జ్యోతుల్లా మెరిశాయి. "ఇప్పుడు తెలిసిందా మీకు, ఆ స్వామి మహిమ !" అంది పారవశ్యంతో నవ్వుతూ.

శేఖర్రావు సంతోషించాడు. అన్నపూర్ణకి నచ్చచెప్పడం ఎంత సులువు ! "ఇంకా నయంకాదూ : ఆ ఉంగరంకోసం మరో ట్రిప్పు వేయించకుండా ఎవరికీ ప్రాణం మీదికి తేకుండా ఏదో పనిలో పని జరిపించి రైలుఖర్చులు మిగిల్చాడు" అన్నాడు.

అన్నపూర్ణ తృప్తిగా భర్తనీ పిల్లల్నీ చూసుకుంది. గోపురంకేసి తిరిగి నమస్కారం చేసి లెంపలేసుకుంది. ●



సృష్టిలో కనీసం సగానికి ప్రాతినిధ్యం వహించగల ఏకైక ఏకాక్షర పదం ఏది ?

స్త్రీ !

మన భాషలో స్త్రీకి వున్నన్ని పర్యాయపదాలు మరి దేనికీ లేవు. నారి, నాతి, చాన, కాంత, పడతి, సుదతి, తన్వి, తరుణి, మహిళ, వనిత, ప్రమద, లలన — యింకా కవుల కల్పనా చాతురికొద్దీ-లతాంగి, కుసుమ కోమలి, చక్రస్తని, చంద్రానన, కుంద రదన, కలకంఠి, మీనలోచని, ఇభరాజ గమన—ఇలాగ కొన్ని వందల, వేల పదాలకు అర్థం కాగలిగిన ఒకే ఒక పదార్థం కూడా స్త్రీయే !

ప్రబంధ కవులే ననుకుంటే వారిని మించి భావకవులు స్త్రీని అద్భుతమైన ఆరాధ్యమూర్తిగా తీర్చి దిద్దారు, ఒకాయనకి "ఆమె కన్నుల ననంతాంబరంపు నీలి నీడలు" కనబడ్డాయి. "ఆమె నా యంతరంగ శాంతి దేవత" ఆవటా అని మరొకాయన చెప్పుకున్నారు. టాగోరుగారికి స్త్రీ సగం సత్యం, సగం స్వప్నంలా కనబడింది.

కొందరామెను శక్తిస్వరూపిణిగా భావిస్తే, మరికొందరు వట్టి అబల

అనేవారు. కొందరికి స్త్రీ జగజ్జనని అయితే, మరికొందరికి జగత్ప్రేయసి.

కాని, ప్రపంచ సాహిత్యమంతా వెతికినా, స్త్రీని భవభూతి వర్ణించినంత ఆదర్శమూర్తిగా ఇంకెవరూ వర్ణించ లేదని నాకు అనిపిస్తుంది.

"ఇయం గేహేలక్ష్మీ...." అని ఉత్తర రామ చరిత్రంలో రాముడు సీతను గురించి అన్నమాటలకు సమానమైన కవిత్వం బహుశా మరెక్కడా దొర కదు.

అయితే, భవభూతిని తలదన్నిన మరొక ప్రాచీనకవి ఉన్నాడు. అత డెవరో తెలియదుగాని, స్త్రీ సృష్టిని ఇలా వర్ణించినట్టు నెహ్రూగారు తమ "డిస్కవరీ ఆఫ్ ఇండియా" లో ఉటంకించారు.

"సృష్ట్యాదిలో త్వష్ట పురుషుడిని ముందు సృష్టించి, స్త్రీని సృష్టించ వలసి వచ్చేసరికి, సాధనాలేమీ మిగ ల్లేదు. అప్పుడాయన గాఢంగా ఆలో చించాడు. చివరికి- చంద్రుడి వలయా కృతి,లేతరెమ్మల వంపుల సొంపులు, తీవల ఆలంబన గుణం, శాద్వల పత్రాల కంపనత్వం, వేణువులోని సన్నదనం, పువ్వులలోని వికాసం, ఆకుల లేతదనం, హస్తి హస్త చాల నం, హరిణేక్షణాల చాంచల్యం, తుమ్మెద బారుల చిక్కదనం, సూర్య కిరణాల హర్షోన్మత్తత, వర్ష మేఘాల రోదనం, పవన వీచికల చాపల్యం, శశకిశోరాల భీరుత్వం, నెమలి సౌం దర్య గర్వం, చిలుకల వక్షోమార్దవం. గండశిలల కాఠిన్యం, మాధ్వీరప మాధుర్యం, శార్దూలాల నిర్దయత్వం, చలిమంటలోని వెచ్చదనం, మంచు జడుల చల్లదనం, శారికల వాచాలత, కోకిలల కలకంఠం, బకధ్యానంలోని వంచన, చక్రవాకాల స్నిగ్ధప్రేమ - వీటన్నిటిని కలిపి రాశిచేసి రమణీ మణిని సృష్టించాడు. ఆమెను పురు షుడికి అప్పగించాడు."

బాగానేవుంది గాని, వెనకటికెవరో బుద్ధిశాలి "ఆడది ఆడదే" అన్నాడు ముక్తసరిగా.

స్త్రీకి ఇంతకంటె మంచి నిర్వ చనం నాపుట్టుకు నాకు తోచడం లేదు!

రచన: ఎల్. కె. మూర్తి

● కిందటేడు ఇండియానుంచి కొంతమంది జర్నలిస్టులం కలిసి అమెరికా వెళ్ళాము. న్యూయార్కులో మాబస 48 అంతస్తులు, కొన్ని వేలగదులు,కొన్నివందల నడవలుగల వాల్డార్ఫ అస్టోరియా హోటల్‌లో. ఒక రోజున నేను 13వ అంతస్తులోని నాగదినుంచి బయలుదేరి అర గంట తరవాత హోటల్ నౌకరును అడిగాను : "న్యూయార్కుకు దోవ చెబుతారా దయచేసి" అని.

—ఎన్నార్

శ్రీ రుద్ర బాణాక్షిని

పావక మహాశ్రయులారా!

అనేక సాష్టాంక గండప్రమాదంబు లావరించి భయదీయుడు సమర్పించు కొనే విపన్నములు.

నెలనెల ప్రవర్తమాన మగుచున్న మా క్యోతి పుత్రికలో నేను నిర్వధి స్తున్న ఈ 'ప్యూఛరు' మీకు ప్రమాణభరితమగుట మాకు సందోషదాయకము.

కొన్ని పురపాతకసంఘాల ఆరోగశాఖలు మంచినీతి సదుపాయాలు కలిగించడం లేదట!

నూతన శిలబస్సులను అనుకరించి వ్రాస్తున్నందువల్ల పెట్టుబుక్కుల శైలి కఠినముగా వుంటోంది.

లే! లే! రష్యా!-మారో ప్రపంచం.

"హిమాలయ పర్వతాలకు ఉత్తరదిశలో వున్నదే భూతాల స్వర్గం." అంటాడు చౌ-ఎన్- లయకారుడు.

మెడపట్టుకొని గెంటినా చూపుపట్టుకొని వ్రేళ్ళాడే భీమాకంపెనీ ప్రతి నిధియే జెంటు అనిపించుకొంటాడు.

ఎందుకైతే వుంచీనావూ? బొందిఖానాలో!

డబ్బిచ్చి మార్కులు వేయించుకున్నవారు చదువు కొన్నవారు.

ఇట్లు,
ప్రూఫ్ లేడరు.



వెళ్ళొస్తానండీ? అన్నది ఆవిడ.

"వెళ్ళిరామ్మా" అన్నది సత్యవతి.

ఆవిడ వెళ్ళిపోయింది.

"చూశారా సిస్టర్! ఆ అమ్మాయికి గర్భంరాగానే హిస్టీరియా దానంతటదే పోయింది." అన్నది మిడ్‌వైఫ్ శారద దూరాన వెడుతున్న ఆ అమ్మాయిని చూస్తూ.

"నువ్వింకా చిన్నదానివి. నీకు చెబితే మాత్రం అర్థమౌతుందా ? స్త్రీ భగవంతుని సృష్టికన్నా తన సృష్టినే ఎక్కువగా ప్రేమిస్తుంది. స్త్రీకి మాతృత్వంకన్నా పెద్ద కోరికలేదు. అర్థమైందా ?" అన్నది సత్యవతి.

శారద తల వూపింది.

"ఏమితే అంతా అర్థమైనట్లుగా తలూపుతావు. నీ కర్థం కాలేదు. ఇది అర్థం కావాలంటే మరోవిషయం చెబుతాను విను."

శారద సత్యవతిముందు కూర్చుంది. సత్యవతి గతంలోకి అంతర్ముఖమైన చూపుతో- ప్రారంభించింది.

"....అర్థరాత్రి సమయం. ఆస్పత్రి లోని దీపాలు పాలవెన్నెల సోనల్ని కురిపిస్తున్నాయి....నాది రాత్రి డ్యూటీ : ఆ రోజు జాగ్రత్తగా చూడవలసిన కేసులు రెండే రెండు. ఒక కసుగందు, మరొక పచ్చిబాలెంత : చీమ చిటుక్కుమన్నా విని పించే నిశ్శబ్దంలో ఆ బాలెంత పడుకున్న మంచం కిర కిర లాడింది. త్వరగా ఆ పడకవద్దకు వెళ్ళాను. ఆమె కళ్ళు చికిలించి చుట్టూరా చూస్తున్నది.

"ఏమిటమ్మా పార్వతీ ?" అన్నాను తల నిమురుతూ.

ఎలక్ట్రిక్ దీపాలకేసి చూస్తున్న పార్వతి ఉన్నట్టుండి మంచాని కిరువైపులా చూసింది. అదిరిపడి తన పరుపు మీద తడివింది. క్షణంలో పార్వతి కళ్ళు కన్నీటి కొలను లయ్యాయి. నీరు నిండిన కళ్ళతో నా వైపు దీనంగా చూసింది. ఆ చూపులో ధ్వనించిన వేదన, ఆ చూపులో కణ కణ లాడుతున్న ప్రశ్న నా కర్థమైంది. కాని ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయాను.

"విశ్రాంతి తీసుకో పార్వతీ! ఇంజక్షను యిస్తాను" వెళ్ళిపోవడానికి వెనుదిరిగాను. నా గౌను కొస పార్వతి చేతిలో వుంది. పార్వతి బుగ్గలు కన్నీటితో తడిసి పోయాయి. ఆవిడ దుఃఖాన్ని చూడలేక నా గదిలోకి వచ్చేశాను. పార్వతి బెడ్ వద్ద నుంచి ఎక్కిళ్ళు వినబడుతూనే వున్నాయి; క్రిందటిరాత్రి పార్వతి నాకు చెప్పుతున్న దీన చరిత్ర నా మనసులో మెదల సాగింది....

పార్వతి భగవంతుడు సృష్టించిన స్త్రీ. అందం చిందే వయసూ, అర్ద్రిత తొణికే మనసూ ఆమె లక్షణాలు. పార్వతి మనసులో యవ్వనం మేల్కొనేసరికి ఆమె మనస్సు శేఖరానిదై పోయింది. శేఖరం

కాలేజీలో పార్వతికి ఒక సంవత్సరం సీనియరు. కాని పార్వతికి గిరిధర్ అని ఒక మేనమామ ఉన్నాడు. అతనికి పార్వతంటే చాలా అభిమానం. పార్వతి, శేఖరాలసంగతి గిరిధర్‌కు తెలిసి పార్వతిని అడిగాడు.

"ఔనుమామయ్యా : నిజమే" అన్నది పార్వతి తలవంచుకొని.

"ఇది నీకు న్యాయమేనా పార్వతీ ?" ప్రశ్నించాడు గిరిధర్.

"క్షమించు మామయ్యా!" అనిపాదాలంటి ప్రార్థించింది పార్వతి. గిరిధర్ మనసున్నవాడు. పార్వతి మనసు తెలుసుకున్నాడు. ఆనాటినుంచీ పార్వతికి దగ్గర కావాలని అతను ప్రయత్నించలేదు.

పార్వతి ఇంటరూ, శేఖరం బియ్యే పాసయారు. చంద్రశేఖరానికి మరుసటి సంవత్సరమే ఐ. ఏ. ఎస్ వచ్చింది. వారి వి వా హ ం చాలా సామాన్యంగా జరిగిపోయింది. పార్వతి తల్లిని ఒంటరిదాన్ని చేసి హైదరాబాదు వెళ్ళిపోయింది."

"గిరిధర్ యేమయాడు ?" శారద ప్రశ్నించింది.

శారద ప్రశ్న సత్యవతికి వినిపించలేదు. శూన్యంలోకి దూసుకుపోతూ, సృష్టి రహస్యాన్ని ఛేదిస్తున్న చూపుతో చెప్పుకుపోతున్నది.

"పార్వతి భర్తకు స్వర్గాన్ని చూపింది. వాళ్ళిద్దరూ వలపు కొమ్మకు పూచిన రెండు పూవుల్లా గడిపారు ఒకసంవత్సరం. ఒక ఆదివారం ఇద్దరూ పబ్లిక్ గార్డన్స్‌కు వెళ్ళారు. పచ్చని తివాసీలాంటి పచ్చిక మీద కూర్చున్నారు. నీలిబట్టమీద తెగిపడ్డ ముత్యాల్లా నక్షత్రాలు మెరుస్తున్నాయి. లేతవలపులా మందంగా వీస్తున్న పిల్లగాలి. ఇద్దరి మనసుల్లోనూ సందడి చేస్తున్న మధురభావాలు :

శేఖరం పార్వతి బుగ్గలు తాకి తుళ్ళిపడ్డాడు.

"పారూ : జ్వరంగావుందా ?" ప్రశ్నించాడు.

"లేదు" అన్నది పార్వతి సిగ్గుతో.

పార్వతి కళ్ళల్లో, బుగ్గల్లో వెలిగిన సిగ్గు శేఖరానికి కనిపించలేదు.

"పద ఇంటికి వెడదాం. డాక్టరుకు చూపించాలి" అన్నాడు మళ్ళీ.

"అబ్బా. నాకు జ్వరం లేదంటే వినరేం :"

"లేదంటా వేమిటి, శరీరం యింత వేడిగా వుంటే ?"

పార్వతి అసలు విషయం చెప్పాలని ఎంత ప్రయత్నించినా సిగ్గుతో చెప్పలేకపోయింది.

మరుసటి రోజు యింటి కెళ్ళగానే డాక్టరు కోసం కబు రంపాడు శేఖరం. అంతలోనే ఆఫీసు నుంచి తొ ం ద ర గా రమ్మని ఫోను వస్తే శేఖరం వెళ్ళిపోయాడు. "డాక్టరుగా రొస్తారు, జాగ్రత్తగా పరీక్ష చేయమను. ఓ అరగంటలో వస్తాను" అంటూ వెళ్ళాడు శేఖరం.

మరో అరగంటలో డాక్టరు వచ్చింది పార్వతిని పరీక్షించి చివరకు ప్రశ్నించింది.

"నీకు అమ్మాయి కా వా లా ? అబ్బాయా ?"

పార్వతి నేలను చూస్తూ నిలుచుంది.

"మరి అంత సిగ్గు తగ దమ్మాయ్ ! నే వెడతాను. శేఖరంగారు వస్తే చెప్పు— అబ్బాయి నిస్తానని"

"ఏమండీ డాక్టరుగారూ ! నాకు అదో రకంగా వుంటుందండీ....మీరే చెప్పండి"

"ఊఁ హుఁ....నే చెప్పను. నువ్వే చెప్పాలి. అలా చెప్పడంలో గొప్ప ఆనందం వుంది. దాన్ని పోగొట్టుకోకు" డాక్టరు వెళ్ళిపోయింది.

డాక్టరు పార్వతికి కొత్తగా చెప్పిన విషయం యేమీ లేదు. ఆ సంగతి పార్వతి కంతకు ముందే తెలుసు. కాని, భర్తకు సిగ్గుతో చెప్పలేక పోయింది. ఇక చెప్పక తప్పదు. ఎలా చెప్పాలని ఆలోచిస్తూ కూర్చున్న పార్వతికి శేఖరం ఆఫీసు డ్యూటీ మీద పొరుగూరు వెళ్ళాడని, సాయంకాలం వస్తాడని ఫోను వచ్చింది. పార్వతి చాలా నిరాశ పడిపోయింది. కాని ప్రతి క్షణమూ భర్త కోసం యెదురు చూస్తూ కూర్చుంది....సాయంకాలమైంది. స ం జ చీకట్లు పలుచగా వ్యాపించి కారు చీకట్లయ్యాయి. పార్వతి మగతగా కన్ను మూసింది. చాలా సేపటి తర్వాత యెవరో తలుపు తట్టారు. పార్వతికి మె ల కు వ వచ్చింది. ఇంతసేపూ అనుకున్న దేదీ స్ఫురించలేదు. ప్ర ఆలోచించింది .... తలుపు తీయాలి. భర్త లోపలికి రాగానే భుజాలమీద చేతులేసి, అతని గుండెల్లో తల దాచుకుని, తన సోగ కళ్ళతో అతని కళ్ళల్లోకి చూస్తూ "మీకు కొడుకు కావాలా - కూతురు కావాలా ?" అని ప్రశ్నించాలి. అప్పుడు అతని హృదయంలోని సం తోషాన్ని వింటూ, అతని కళ్ళలోని సంతోష తరంగాల్ని చూడాలి. మెల్లిగా తలుపు తీసి ఒదిగి నిలబడింది పార్వతి. శేఖరం లోపలికి రాలేదు. బయటికి తొంగి చూసింది. పోర్టికోలో నిలిచిన జీపులోంచి నలుగురు పట్టి, రక్తపు ముద్దలా వున్న శేఖరం శరీరాన్ని మోసుకొచ్చి హాల్లో వున్న సోఫాలో పడుకోబెట్టారు. కెవ్వున అరిచి, నేల కూలింది పార్వతి. తర్వాత కొన్ని రోజులకు తన పసుపు కుంకుమలు కారు ప్రమాదంలో చనిపోయిన శేఖరాని కర్పించి, అతని అంశను మోసుకొని తల్లి వద్దకు చేరింది. సత్యవతి ఆగి కథ వింటున్న శారదను చూసింది.

శారదకు సత్యవతి మబ్బు మబ్బుగా కనిపించింది. "చెప్పండి సిస్టర్" అన్నది కళ్ళు తుడుచుకుంటూ.

తన కడుపులో కదులుతున్న శేఖరం అంశను చూసుకొని దుఃఖాన్ని దిగమింగుతూ....కానుపుకు ఆస్పత్రిలో చేరింది పార్వతి. అంతకుముందు అప్పుడప్పుడూ ఆస్పత్రికి వచ్చేది. పా ర్వ తి ని చూ సి ఆశ్చర్యపోయేదాన్ని. స్త్రీకి మాతృత్వం అంత బలమైన వాంఛ అన్న సంగతి పార్వతిని చూస్తేకాని నాకు అ ర్థ ం కా లే దు. ఆమెలోవున్న వాంఛ దావాగ్నిలాంటిది. మాతృత్వం కోసం ఆవిడ భగవంతుణ్ని కూడా తృణీకరిస్తుందనిపించేది నాకు......

పార్వతినిగురించి యిలా ఆలోచిస్తున్న నన్ను ప్రక్కనే వున్న వుయ్యాలలోంచి ఏడ్చిన పాప వాస్తవ జగత్తులో పడేసింది పాప ఏడుపు దూరాన పడుకున్న పార్వతి

● నటీనటులు ఆడేది ఏనాటకమైనా, బాగుండకపోతే, ప్రేక్షకులు ప్రదర్శించేది పాదుకా పట్టాభిషేకమే.

ఎక్కిళ్ళతోకలిసి వినిపిస్తోంది. ప్లాస్కు లోంచి పాలుతీసి పత్తిని పాలల్లో తడిపి ఆ కనుగందునోట్లో పిండాను. నిదానంగా గుటకలు వేసింది పాప. పాపకు పాలు పోసి వెనక్కి తిరిగేసరికి పార్వతి నిల బడి వుంది. ఆవిడ ఉయ్యాలలో పడుకున్న పాపను నిశితంగా పరిశీలిస్తోంది."

"ఏం పార్వతీ ?" అన్నాను.

"నా పాప" అన్నది.

"లేదమ్మా ! నువ్వు దక్కేసరికే చాలా కష్టమైపోయింది."

"నా పాపకు లేకపోతే నేనెందుకూ ? నేనూ చచ్చిపోతాను."

"తప్పు పార్వతీ ! అలా అనకూడదు"

"నా పాపకు నాకు కావాలి" అన్నది మూర్ఖంగా.

చాలా కష్టంమీద పార్వతిని పడుకో బెట్టి, మళ్ళీ లేచి అల్లరి చేస్తుందేమోనని నిద్రకు ఇంజక్షన్ యిచ్చాను. మనసులో అంత కల్లోలం వున్నా పార్వతి నిద్రపోయింది.

నాకూ చాలా అలసటగా వుండటంవల్ల నేనూ టేబిలు మీద తల వాల్చాను. మళ్ళీ నాకు మెలకువ వచ్చేసరికి తెల తెల వారు తోంది. అదే సమయానికి అతనూ పాల ఫ్లాస్కుతో లోని కొస్తున్నాడు.

"ఎలా వుందండీ అమ్మాయి ?" ఉయ్యాలలో నిద్ర పోతున్న పాపను చూస్తూ అడిగాడు.

"బాగానే వుందండీ. కానీ, యింకా నాలుగైదు రోజులు ఆస్పత్రిలోనే వుంచాలి" అన్నాను.

"వారెవరు సిస్టర్ ?" శారద సత్యవతి మాటలకు అడ్డం వచ్చింది.

"ఆయన ఆ వూళ్ళో పెద్ద వ్యాపారి. అతని భార్య ప్రసవించి చనిపోయింది. అతని కూతురే ఆ కళ్ళు తెరవని కసు గందు. తర్వాత ఉయ్యాల ప్రక్కనే కూర్చొని, భార్యను తలచుకొని పేగులు కుళ్ళిపోయేలా యేడ్చాడు. మరి కాస్సేపటికి పగలు డ్యూటీ స్టాఫ్ వచ్చారు. వారికి పార్వతి విషయాన్ని చెప్పి యిల్లు చేరాను.

మళ్ళీ నేను ఆస్పత్రికి వెళ్ళేసరికి సాయంకాలం ఆరు గంటలైంది. వెడుతూనే అడిగాను.

"పాప ఎలాగుంది ?"

"బావుంది"

"పార్వతి ?"

"ఇప్పుడే నిద్ర లేచింది. బలవంతంగా కొంచెం ఆహారం యిచ్చాము. ఏడుస్తూ పడుకుంది" అన్నది డ్యూటీ నర్సు.

నేను గదిలో కెళ్ళగానే పార్వతి వచ్చింది. "రా పార్వతీ ! కూర్చో" అన్నాను.

కూర్చుంది.

"ఏమిటమ్మా ?"

"నాకు యిక్కడ అదోరకంగా బాధ.... గా....వుందండీ" అన్నది అరచేత్తో రొమ్ము రుద్దుకుంటూ.

"దానికి మందిస్తాలే తల్లీ! తగ్గిపోతుంది"

"ఎప్పటికి తగ్గుతుందో యేమో ! చూడండీ - చాలా బాధగా వుంది. లోపల యేదో కదులు తున్నట్లుగా, గుండె బరువెక్కి పోయినట్లుగా వుంది"

"అది బాధ కాదమ్మా ! పాలు పడ్డాయి. ఇప్పుడు తీసేసి పాలు పోవటానికి మంది స్తాను. బాధ తగ్గిపోతుంది.

"తీసేయట మెందుకండీ ! ఈ పాప కిస్తాను." అన్నది ఉయ్యాలలోని పాపను చూపుతూ. పార్వతి ఆ మాట అంటున్న ప్పుడు ఆవిడ కళ్ళు జ్యోతుల్లా వెలిగాయి.

"అలా యివ్వ కూడదమ్మా ! మొదట తీసేయాలి"

"అలాగా !" అన్నది పార్వతి.

తర్వాత మిడ్‌వైఫ్‌ను పిల్చి శారదను లోనికి తీసుకెళ్ళ మన్నాను.

ఎనిమిది గంటల ప్రాంతంలో వార్డు బయట నిలబడి వున్న నా వద్దకు పరు గెత్తు కొచ్చింది మిడ్‌వైఫ్.

"ఎందుకే అంత గాభరా ?" విసుక్కు న్నాను.

"ఉయ్యాలలో పాప కనిపించటం లేదండీ" అన్నది.

నా కర్థమైంది - పాప యెవరి వద్ద వున్నదో. సరాసరి పార్వతి మంచం వద్దకు వెళ్ళాను. పాపను కొంగులో దాచుకొని పాలిస్తోంది పార్వతి. పార్వతి ముఖంలో యేదో అనంతమైన శాంతి తాండవ మాడు తోంది. పాపను గుండెల్లో దాచుకుంది నన్ను చూసి.

"పాపను యివ్వు పార్వతీ !" చాలా మృదువుగా అన్నాను.

"ఇవ్వను పో" అన్నది.

"ఎందుకూ ?"

"ఈ పాప నాది"

"కాదమ్మా ! నీ పాపడు పోయాడు"

"అంతా అబద్ధం"

"కాదమ్మా....!"

"పాపను యివ్వను, యివ్వను, యివ్వను" వెర్రిగా అరిచింది.

ఇంతలో పాప నాన్న వచ్చాడు:

"ఇలా చూడు పార్వతీ ! ఈ పాప వీరి కూతురు. వారు వచ్చారు. పాపను వారి కివ్వమ్మా !" అన్నాను అతణ్ణి చూపుతూ.

ఒక్కసారిగా అదిరి పడింది పార్వతి. అతణ్ణి చూడగానే సందేహం, భయం పార్వతి కళ్ళలో వ్యాపించాయి. పాప నెత్తుకొని లేచి నిలబడింది. పాప నోటి చివరనుండి పాలు కారుతున్నాయి. అతను కూడా పార్వతిని చూసి స్థాణువులా నిల బడి పోయాడు. "పాపను తీసుకోండి" అన్నాను.

అతను ముందుకు పోయి చేతులు చాచాడు. కానీ పాప నలిగి పోయేలా గుండెలకు హత్తుకుంది పార్వతి.

"ఈ పాపను నా కివ్వు మామయ్యా ! నువ్వు మంచివాడివి కదూ ? పాపను నాకు యివ్వవూ ?"

నా ఆశ్చర్యానికి హద్దుల్లేవు.

"ఏమండీ ! మీకు పార్వతి తెలుసా ?" అడిగాను.

"తెలుసు....పార్వతి మా...."

"మీ పేరు ?"

"గిరిధర్"

పార్వతిని పెళ్ళి చేసుకోవా లనుకొని నిరాశ పడ్డ గిరిధర్ యితడే ! "ఇలా ఒక సారి వస్తారా ?" వార్డ్ బయట తోటలోకి నడుస్తూ గిరిధర్‌ని పిలిచాను.

"ఎందుకండీ పిల్చారు ?" అన్నాడు గిరి ధర్ తోటలో.

"పార్వతి పాప కోసం ఎలా తల్లడిల్లి

● గయ్యాళిదాని భర్త : "అమ్మో! అయ్యో!" అని బాధపడ కూడదు. "అత్తో, మామో!" అని మూలగాలి.

పోతోందో మీరు చూశారు కదూ! మీ పాపకూ పాలు కావాలి. అందువల్ల పార్వతి ఆస్పత్రిలో వున్న నాలుగు రోజులూ మీ పాప పార్వతి దగ్గరే వుంటే మీకేమైనా అభ్యంతరమా?"

గిరిధర్ జవాబు చెప్పలేదు.

"మీకు యిష్టం లేకపోతే వద్దులెండి"

"ఇష్టమే ననుకోండి .... కానీ నేను కూడా నా పాపను విడిచి బ్రతకలేక పోతున్నాను. రేపటినుంచి నెల రోజులు ఫ్యాక్టరకి వెళ్ళదలుచుకో లేదు. ఇప్పుడు పాపను యింటికి తీసుకెళ్ళాలని వచ్చాను. నా భార్య నా కెలాగూ దక్కలేదు. నా పాపలో ఆవిడను చూసుకుంటూ బ్రతుకుతాను సిస్టర్! నేనూ, నా పాపా చాలా దురదృష్ట వంతులం" గిరిధర్ కంఠం గద్గదమై పోయింది.

"తొందర పడకండి గిరిధర్! పాప మరి నాలుగు రోజులు యిక్కడే వుండటం మంచిది. చంటి పాపను పెంచడం తేలిక పని కాదు. అంతేకాదు, చాలా కారణాలున్నాయి. పాపను నాలుగు రోజులు యిక్కడే వుంచాలి" అన్నాను. సరే నన్నాడు గిరిధర్.

నేనూ గిరిధర్ లోపలి కొచ్చేసరికి పాపను పక్కలో పడుకో బెట్టుకొని జో కొడుతోంది పార్వతి. బుగ్గల మీదా, గడ్డం మీదా పాల మరకలున్న పాప పిడికిళ్ల బిగించి, ఓరగా నవ్వుతూ నిద్ర పోతోంది.

తర్వాత నాలుగు రోజులు పార్వతి ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయాయి. పాప నవ్వితే తానూ నవ్వుతూ, పాపతో బాటు తానూ ఏడుస్తూ ఆ నాలుగురోజులూ గడిపింది పార్వతి. మరుసటి రోజు ఒక వూహించని సంఘటన జరిగింది. మరుసటి రోజునుంచీ తనకు పాప దక్కదన్న బాధతో పాపను తీసుకు పారిపోవాలని ప్రయత్నించింది పార్వతి. కాని వీలుకాలేదు. పాపను రహస్యంగా పొత్తిళ్ళలో దాచుకొని కాంపౌండు దాటుతుండగా పట్టుబడి పోయింది. కాంపౌండు దాటగలిగినా పాప తనకు లభించదన్న ఆలోచన లేదు, పార్వతికి. ఆవిడ వున్న స్థితిలో అంత దూరం ఆలోచించే విచక్షణ ఆవిడకు లేదు.

ఈ విషయం ఏలాగో గిరిధర్‌కు తెలిసింది. ఒక్క వరుగున ఆస్పత్రికి వచ్చాడు. పార్వతి చేతిలో వున్న పాపను నిర్దయగా లాక్కున్నాడు. పార్వతి ఏడ్చింది. మొత్తుకుంది. గోడకేసి తల బాదుకుంది. కాని పార్వతిని లాగి మంచం మీదికి తోసి పాపను లాక్కొని యింటి కెళ్ళిపోయాడు గిరిధర్.

ఆ రోజు పార్వతి తల్లి పార్వతిని యింటికి తీసుకెళ్ళి పోయింది. అప్పటి పార్వతి రూపాన్ని చూసి నాకు కళ్ళు తిరిగాయి. కృశించిన ముఖం, చెదరిన కోరికలాంటి జుట్టు, నిరాశ నీడలు దట్టంగా వున్న కళ్ళు, మనసులోని మాతృత్వం వల్ల నిండుగా పొంగిన వక్షస్సు - ఆ రూపాన్ని చూడలేక పోయాను. పార్వతి తల్లిని దూరంగా పిలిచి పాలు పోవటానికి మందిచ్చి, ఎలాగైనా పార్వతికి త్రాగించమన్నాను..వాళు వెళ్ళి పోయారు. నేను మిగిలిపోయాను. తర్వాత రెండు రోజులు నాకు అన్నం రుచించలేదు. కన్ను మూసినా తెరచినా దైన్యం కన్నీరుగా కారుతున్న కళ్ళతో పార్వతి కనిపించేది. ఆవిడ హృదయంలో ఝరీపాతంగా ప్రవహిస్తున్న మాతృత్వాన్ని బలవంతంగా అణచివేసిన పాపానికి భగవంతుడు నా కెలాంటి శిక్ష విధిస్తాడోనని వణికి పోయేదాన్ని. మరుసటి రోజు సాయంకాలం పార్వతితల్లి వచ్చింది. మందు పార్వతి కివ్వటానికి వీలులేకపోయిందనీ, పార్వతి పారిపోవాలని ప్రయత్నిస్తున్నదనీ, యిప్పుడు గదిలోపెట్టి తాళం వేసి వస్తున్నాననీ చెప్పింది. నాకేమీ తోచలేదు. రాత్రికి పార్వతిని చూడటంకోసం వాళ్ళింటి కొస్తానని చెప్పాను.

ఆరోజు నాకు డ్యూటీ లేదు. సాయంకాలం చీకటి పడగానే పార్వతిని చూట్టానికి బయలుదేరుతుండగా గాభరాగా గిరిధర్ లోపలకొచ్చాడు.

"పాపకు చాలా సుస్తీగా వుందండీ. కళ్ళు తెరవటమేలేదు. మీరు ఒక్కసారి వచ్చి చూడాలి. ప్లీజ్" అన్నాడు కన్నీళ్ళతో.

నా మనస్సు కలత పడిపోయింది. పార్వతిని తర్వాత చూడవచ్చుననుకొని గిరిధర్‌తో బయలుదేరాను. గిరిధర్‌ది చాలా పెద్దయిల్లు. వరదతీసిన తర్వాత కనబడే నిశ్శబ్దబీభత్సం ఆ యింటిని పాలిస్తోంది. గిరిధర్ ఒంటరివాడు. జీవన పథంలో తోటి బాటసారిని పోగొట్టుకున్న వాడు....అతనికి తోడూ నీడా ఆ కసుగందే!

పాపను చూసి ఏదో మందు పోశాను. కానీ పాప కళ్ళు తెరవలేదు. బలంగా వూపిరి పీలుస్తూ పడుకొనివుంది. నేను యింటికి వెడతానంటే మరికాస్సేపు వుండమన్నాడు గిరిధర్. పార్వతిని చూట్టానికి ఉదయం వెళ్ళవచ్చుననుకొని సరే నన్నాను. గంట పది దాటింది. కష్టాల మేఘాలు కప్పుకున్న గిరిధర్ బ్రతుకులా వుంది ఆకాశం. పాపను చూసినప్పుడు అతడిలో తళుక్కుమనే ఆశలాంటి చిన్న చిన్న చుక్కలు మేఘాల సందున మిల మిల లాడుతున్నాయి....ఎవరో తలుపు తట్టారు. ఆలోచనల్లో కూరుకుపోయి కూర్చున్న గిరిధర్ వెళ్ళి తలుపు తీశాడు. పెనుగాలిలా లోపలికొచ్చింది పార్వతి. వస్తూనే గిరిధర్ పాదాలవద్ద పడి భోరున ఏడ్చింది. దిగాలు పడి నావైపు బేలగా చూశాడు గిరిధర్. పార్వతిని లేవనెత్తి కళ్లు తుడుస్తూ అడిగాను.

"ఎందుకమ్మా యింత రాత్రిపూట యిలా వచ్చావు?"

పార్వతి జవాబు చెప్పలేదు. రెండు చేతులతోనూ రొమ్ములు కప్పుకుంటూ భయంతో చూస్తోంది.

"చెప్పమ్మా." అన్నాను మళ్ళీ.

నూనెలేని ప్రమిదెలోని దీప శిఖలా రెప రెప లాడిపోతోంది పార్వతి. ఉయాల వద్దకు పరుగెత్తి పాపనందుకుంది.

"ఇలా తే పాపను" పార్వతి చేతుల్లోని పాపను గుంజుకున్నాడు గిరిధర్.

పాప కేరుమంది.

"ఒక్కసారి....ఒక్కసారే! పాపకు పాలిచ్చి వెళ్ళిపోతాను మామయ్యా! ఒక్కసారేమామయ్యా....మీరు చెప్పండి" నన్ను కౌగలించుకుంది పార్వతి. ఆ కౌగిలిలో నా ఎముకలు పొడైపోతాయేమో ననిపించింది.

"వెళ్ళమ్మా. ఇవ్వు" అన్నాను.

"పీల్లేదండీ : ఇది రాక్షసి. పాప నేమైనా చేస్తుంది" అన్నాడు గిరిధర్.

"ఫరవాలేదులెండి. నువ్వు యివ్వు పార్వతీ : మనం మే డ మీ ద కెడదాం రండి" అన్నాను.

గిరిధర్ క్షణం తటపటాయించి, పాపను పార్వతి చేతి కిచ్చి నన్ను అనుసరించాడు.

పార్వతి పాప నందుకుంది. పాప మాంగల్యం లేని పార్వతి మెడను తాడుతోంది.

నేనూ, గిరిధర్ మేడ మీది కెళ్ళాము. గిరిధర్‌కు చెప్పాలనుకున్న ఒక మాట నా మనసులో మెదిలింది. కానీ, నాకూ గిరిధర్‌కూ వున్న పరిచయం చాలా తక్కువ. అందువల్ల సాహసించలేక పో యా ను. పాపను తీసుకొని పార్వతి పారి పోతుందేమో నన్న భయంకొద్దీ గిరిధర్ నాలుగు వైపులా జాగ్రత్తగా చూస్తున్నాడు. అర్ధ గంట తర్వాత దిగి వచ్చాము. పాపను హృదయానికి హత్తుకొని ప డు కు ం ది పార్వతి. పాప చేయి పార్వతి మెడమీద వుంది. నేను గిరిధర్‌ను చూశాను. అతని కళ్ళు నీళ్ళు నిండాయి. పెదవులు వ ణు కు తున్నాయి. నా హృదయం సంతోషంతో గంతేసింది.

"నేను వెడతాను! రిధర్‌గారూ" అన్నాను.


నా మాటలు గిరిధర్‌కు వినిపించ లేదు.

కానీ నేను వచ్చేశాను. మరుసటి రోజే నాకు బదిలీ వచ్చింది. అప్పు డప్పుడూ పార్వతీ గిరిధర్ జ్ఞాపకం వచ్చేవారు. ఏమయ్యారో, ఎలా వున్నారో అనుకునే దాన్ని. ఇలా మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకరోజు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను.

కదులుతున్న రైల్లోంచి గిరిధర్‌నూ, పార్వతినీ చూశాను. గిరిధర్ వేలు పట్టుకొని మెల్లిగా అడుగు లేస్తున్న పాప : పార్వతి చంకలో అరునెల్ల కుర్రాడు : పార్వతి మహా లక్ష్మిలా కనిపించింది. సరిగంచు తెల్ల చీర పైటలోంచి మాంగల్యం తళ తళ లాడుతోంది. పచ్చటి ఫాల మధ్యంలో ఎర్రటి కుంకుమ వె లి గి పోతోంది. ప్లాట్‌ఫారం మీ ద వా రు కనిపించే దాకా కళ్ళారా చూశాను. అంతే : మళ్ళీ ఈనాటివరకూ వాళ్ళు నాకు కనిపించలేదు...." సత్యవతి ఆగి చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంది.

ఆశ్చర్యంతో విశాలాలైన కళ్ళతో శారద సత్యవతి ము ఖ ం లోకి చూస్తూ కూర్చున్నది. ●

● ఎడారిలో ఒక రోజున తొంభై తొమ్మిది ఉష్ట్రి పక్షులు ఇసకలో తలలు దూర్చి పడుకున్నాయి. వాళ్ళని చూడ్డానికివచ్చిన నూరో ఉష్ట్రి పక్షి "ఏమై పోయారబ్బా వీళ్లంతా" అని ఆశ్చర్యపోయింది.



డ్రూడిల్స్

పీటి వివరణకు 86 వ పేజీ చూడండి. చూసేముందు మీరుకూడా కాసేపు ఆలోచించరాదూ ?

దాశరథి మధుమంజరి



ఎన్ని పాలు త్రావి ఏమి లాభంబోయి!
ఇంత మధువు చుక్క కీడురాదు

తీపి జూచినంత తిన నిచ్చగల్గదు,
చేదుకొరకు వెదకు చిత్త మెపుడు.

బాధ తీర్పు కొరకు వచ్చును మృత్యువు,
బాధ కూర్పుకొరకు వచ్చు జన్మ.

ఇంతి అందము చెడగొట్టనెంచి వారు
విలువగల ఆభరణములు పెట్టినారు

ఆమె కానుపించ ఆకలి యనిపించు,
చెంతలేని నా డజీర్ణ మగును

కత్తి జూచినంత గజగజ వణకును,
యుద్ధభూమికేగ సిద్ధపడును!

ముట్టుకొనిన కందిపోవు కోమలి యామె
పట్టు పట్టి వదలిపెట్టబోదు.

అడుగు గురుతు లరసి ఆమెవే యనుకొని
ఎంత దవ్వో చనిన నెవరు లేరు!



తెలియనిది

గొల్లపూడి మారుతీరావు

క్లబ్బులో సుందరి నవ్వులూ, మధ్యపధ్య మాటలూ, కీచుగొంతుకేకలూ. ఎవరో బోయ్ అని అరిచారు. బోయ్ పరుగెత్తిన చప్పుడు. సార్.... అన్నాడు. కాఫీ తీసుకురా అంది కీచుగొంతు. కాఫీగ్లాసుల సందడి.... ఆతరువాత ఆవలింతలూ, విజిల్ మీద పాటలూ, అంతా హడావుడిగా వుంది క్లబ్బు. దూరంగా రేడియోలో సన్నని వీణావాద్యం వాతావరణానికి మంచి ఆహ్లాదపు పూత పూసింది.

రఘునాథం : ఏమిటండీ పర్వతాలరావు గారూ, యీ మూల ఒక్కరే కూచొని పేక తిరగేస్తున్నారు?

పర్వతాలరావు : తిరగెయ్యక ఏం చెయ్యమంటావోయ్ రఘునాథం. అందరూ చెస్ బోర్డు దగ్గరికీ, కారమ్సు దగ్గరికీ పరిగెత్తే

వాళ్ళే కాని, పేకముక్కను ఒక్కడు ముట్టుకోడు కద. పైపెచ్చు పేకాట ఆడరావయ్యా అంటే బూతుమాట్లాడినట్టు వింతగా చూస్తున్నారు గూడాను.

రఘు : వాళ్ళంతేలెండి. అందుకే కాకికేమితెలుసు సైకో అనాలిసిస్ అన్నాడోకవి.

పర్వ : అదిగో - నువ్వూ సైకో అనాలిసిస్ అని పట్టుకున్నావు ?

రఘు : నాకదేం తెలీదు లెండి. ఏ ఆట వేస్తున్నారు ?

పర్వ : ఏదో నా మొహం. పేషన్సు ఆడుతున్నాను. సెట్లు వేయడానికన్నా మరో చెయ్యి కలవాలా ? మరి కూచో, మొదలెడదాం.

రఘు : ఉండండి. సైకిలుమీద వస్తూంటే దారిలో పిచ్చేశ్వరరావుగారూ, రామారావు కనిపించారు. వాళ్ళూ కలిస్తే రన్ మోర్ వేసుకోవచ్చు.

పర్వ : ఎవరు ? కాలేజీ లెక్చరర్ రామారావేనా ?

రఘు : అవును, అతనే. మన ముఠాలో కలిసేవాడు ఇంకెవరున్నా రండీ?

పర్వ : వాడా నా మొహం. వాడి వూసెత్తకు. నాకు వళ్ళు మండిపోతుంది. వాడు ఉత్త ఫూల్, ఇడియట్ ——

రఘు : అదేమిటండీ ? మీ యిద్దరికీ యీ మధ్య చెడిందేమిటి ?

పర్వ : చెడడమేమిటి నా మొహం. ఒకప్పుడు బాగుండి చచ్చింది కనకనా.

రఘు : ఏమిటి విశేష మసలు ?

పర్వ : ఏవోతే నా మొహం. వాడు నాకెదురుగ్గా కూచుంటే ఛస్తే ఆట ఆడను. ఈ క్లబ్బునుంచయినా పోతానుగాని వాడితో కూచోను.

రఘు : అయితే ఏదో పెద్ద గొడవే జరిగిందన్నమాట. నేను జ్వరం నుండి తేరుకొనేలోగా యింత జరిగిపోయిందా ఏమిటి ?

పర్వ : జరిగిపోయిందా అని అంటావేమిటి నా మొహం. అసలేం చేశాడో తెల్సునా ?

రఘు . చెప్పండి.

పర్వ : సైకాలజీ, నా శార్ధం అంటూ యీ మధ్య తిరుగుతున్నాడుగా ?—— ఆ ఏడిచేదేదో కాలేజీలోనే ఏడవకూడదూ—— ఈ క్లబ్బులోకూడా సైకాలజీ అంటూ చావాలా , ఏమంటావు ?

రఘు : చావకూడదు.

పర్వ : ఓరోజు ఆట వేస్తూండగా జలుబుచేసి ముక్కుపొడుం దట్టించాను. నాకు సంవత్సరం పొడుగునా జలుబేనని నీకు తెలుసుకదా ?-- ఆమాటకొస్తే అతనికీ తెలుసు. మధ్య మధ్య రెండు చిటికలు పొడుం ఎక్కువ మోతాదులో దట్టించాను.

రఘు : ఎప్పుడూ చేసే పనేగా అది ?

పర్వ : అలా అని ఊరుకొన్నాడా ?- నేను ఆరోజు నాలుగుపట్లు ఎక్కువ లాగేసరికి వింతగా చూసి, అడివి జంతువును చూసినట్టు నాలుగుకోణాల్లో పరీక్షించి, లేచి నిలబడి, అల్లంతదూరం నడిచివచ్చి సైకో అనాలిసిస్ చేస్తాను అన్నాడు.

రఘు : మీమీదే,

పర్వ : నామీదేమిటి నా మొహం ?—— అలాగన్నా బాగుంది. నా ముక్కుమీదా, ఈ ముక్కుపొడుం అలవాటుమీదా చేస్తాట

రఘు : (విరగబడి నవ్వి) బాగుంది.... బాగుంది.

పర్వ : నీకూ నవ్వొస్తూందా ?-నవ్వు, నవ్వు.

రఘు : అదికాదండీ. ముక్కుపొడుంకి సైకో అనాలిసిస్ ఏమిటండీ ?

పర్వ : నువ్వు ఎన్నిసార్లు పొడుం పీలుస్తావన్నాడు. చెప్పాను. నువ్వెన్ని చేతి రుమాళ్ళు వాడుతావన్నాడు. వారానికి అయిదో ఆరో అన్నాను. ఏదీ జేబులో రుమాలు చూపెట్టు అన్నాడు. అదెందుకయ్యా వాడికి- చెప్పు మరి.

రఘు : అవును. ఎందుకూ ?

పర్వ : నేనేదో పిల్లలు గలవాణ్ణి. ఖర్చుపెట్టలేక మా ఆవిడ చీరెముక్కలు జేబులో కుక్కుకున్నమాట వాస్తవం. అది కాస్తా కనిపెట్టి నాగుట్టంతా క్లబ్బులో పైకి లాగుతా నంటాడేమిటి వాడిమొహం?

రఘు : ఏం చేశాడు చెప్పండి.

పర్వ : వాడిబాధ కాదనలేక ఆ గుడ్డ ముక్కలుతీసి చూపించాను. అవి చూశాక వాడిమొహం చేటంతయిపోయింది. ఇక్కడే క్లూ ఉందన్నాడు. హిడెన్ మోటివ్ అన్నాడు. సబ్ కాన్షస్ అన్నాడు. ఏదో నా మొహం అన్నాడు. ఏదో అని అని ఆ రుమాలు తనకివ్వమన్నాడు. ఇలాంటి రుమాళ్ళే అన్నీ ఉన్నాయా అన్నాడు. మీ ఆవిడనడిగే యీ చీరెముక్కల్ని చింపుతావా అన్నాడు. ఒకటేమిటి ? గంగ వెర్రిలెత్తిపోయి నన్ను ప్రశ్నల్తో చంపేశాడు ? -

రఘు : చివరకేమిటి తేల్చాడు ?

పర్వ : తేల్చేదేమిటి. నా మొహం. ఈ చీరె ముక్కల్ని చింపుతున్నానని మా ఆవిడ సాధింపు పడలేక, జలుబు బాధపోవడానికి యీ ముక్కుపొడుం అలవాటు ప్రారంభించాను. చేతి రుమాలు అవసరం లేకుండా ముక్కులోనే పొడుం దట్టించి వారాంతంలో ఒక్క వాష్ చేస్తూంటానట. చేతి రుమాళ్ళ ఖర్చు తగ్గించడానికి ముక్కుపొడుం అలవాటు చేసుకొన్నానని తేల్చాడు.

రఘు : [గుక్క తిప్పుకోకుండా నవ్వి]

పర్వ : నువ్వూ నవ్వుతున్నావా. సరి, ఇక చెప్పన్లే.

రఘు : అదికాదండీ - మీ ఆవిడ సాధించేమాట నిజమేనా ?

పర్వ: సాధింపేమిటి నా మొహం. చీరెలు ముక్కలు ముక్కలుగా చింపేస్తున్నాను మొర్రో అని ఏడిచేది.

రఘు : ముక్కుపొడుం ప్రారంభించాక చేతి రుమాళ్ళ అవసరం తీరిపోయిందా ?

పర్వ : ఆఁ. సగానికి సగం తగ్గిపోయింది. ముక్కులోది ముక్కులోనే నిలిచిపోతోందిగా మరి ? ఏమిదో ఇదంతా రిసెర్చి అంటాడు. నా పిండాకూడు. ముక్కుపొడుం మీదా, చేతి రుమాలు మీదా రిసెర్చి ఏమిటి ?

రఘు : అహ. అలాకాదు. అతని వాదంలో ఏదో రీజన్ వున్నట్టు తోస్తోంది నాకు - సైకో అనాలిసిస్‌లో——

పర్వ : ఇదిగో - నువ్వూ అదేమాటా?

రఘు : పోనీండి. అననులెండి. ఆట ప్రారంభిద్దాం రండి-అరె. ఇదిగో పిచ్చేశ్వరరావుగారూ, రామారావు వచ్చేశారు.

[ఇద్దరూ గట్టిగా ఏదో వాదించుకుంటూ వస్తారు]

రఘు : అదేమిటి. ఇద్దరూ అలా తగువులాడు కొంటున్నారేమిటి ?

పర్వ : చూశావా, చూశావా - అతగాడి వాలకం, రఘునాథం!

రఘు : అబ్బ, ఊరుకోండి. అసలేం జరిగిందండీ విచ్చేశ్వరావుగారూ ?

విచ్చే : అలా కూచో చెప్తాను.

రఘు : రామారావూ నువ్వలా కూచో. చెప్పండి.

విచ్చే : నేను పరాశక్తి రాజకీయ పార్టీలో చేరి ఎన్నాళ్ళయిందంటావు ?

రఘు : దాదాపు మూడేళ్ళ.

విచ్చే : పార్టీలో చేరడంలో నా వుద్దేశ మేమిటో నీకు తెలుసుకదూ ?

రఘు : ఏమిటీ ?

విచ్చే : అదేనయ్యా - దేశభక్తి వగైరాలు -

రఘు ; అవునవును.

విచ్చే : ఇప్పుడీయనేమంటాడంటే —

రామా : అక్కడినుంచి నే చెప్తాను వినవోయ్. అది పార్టీ భక్తి, దేశభక్తి కాదు టోపీభక్తి అన్నాను. తప్పా ?

విచ్చే : తప్పా. తప్పున్నరా. మళ్ళీ ఆ మాట అంటే పరువునష్టం దావా వేయిస్తాను.

రఘు : అదేమిటోయ్. టోపీ భక్తి ఏమిటి ?

పర్వ : ఏమిటేమిటి నా మొహం. సైకో అనాలిసిస్.

రామా : విచ్చేశ్వరావుగారు అంత శ్రద్ధగా టోపీ పెట్టుకు తిరగటం నాకు ఆశ్చర్యమేసింది. ఎప్పుడూ లేనిదీ ఏభయ్యో పడిలో యీయనికి హఠాత్తుగా దేశభక్తి ఎలా పుట్టుకొచ్చింది / ఎనలైజ్ చెయ్యడం ప్రారంభించాను. ఈయన ఒక్క రాజకీయ సభకు వెళ్ళలేదు. ఒక్కసారి వార్తా పత్రిక కొనలేదు. నెహ్రూ ఎవరంటే తక్కున చెప్పలేడు.

విచ్చే : అదిగో మళ్ళీ....

రఘు : ఆయన్ని పూర్తిగా చెప్పనివ్వండి.

రామా : అలాంటి విచ్చేశ్వరావుగారు ఎందుకు టోపీ పెట్టాలా అని ఆలోచించగా ఆలోచించగా కొన్ని టెస్టులు జరిపాక ఒక్క విషయం తేలింది.

రఘు : ఏమిటది ?

రామా : ఆయనకి పంపులాంటి బట్టతల. ఎండకీ, వానకీ చివికి పోతుందని మహా బెంగ ఆయనకి. మూడేళ్ళకిందట విచ్చేశ్వరావుగారు దొరటోపీ పెట్టారట.

డ్రూడిల్స్

81 వ పేజీలోని డ్రూడిల్స్ వివరణ :

1. కలిమి 2 లేమి 3. ఏకాకి 4. లోభిచేసిన ఎనిమిసంకె 5. పోపుల పెట్టెలో మిగిలిన ఆవగింజ 6. టోపీలో వడ్డవాడు.

దొరటోపీకి, ఆ సైకిలుకట్టు పంచెకీ, పొత్తు కుదరలేదట. బట్టతలకి ఏ రక్షణా కుదరక పోయేసరికి గిజ గిజ లాడి పోయారు. ధాన్నలా. ఖాళీగా వదిలెయ్యడంవల్ల ప్రమాద మనిపించింది. ఒకరోజు పౌర పాటున రాజకీయమహాసభ పక్కనుంచి వెళ్తుండగా రాజకీయనాయకుల టోపీ విచ్చేశ్వరావుగారిని ఆకర్షించింది. ఆ టోపీ ఈయన ప్రాణానికి పెన్నిధిలాగ కనిపించింది. పనిలో పని కదా పార్టీలో చేరి టోపీ ధరించాడు.

విచ్చే : చూశారండీ పర్వతాలరావు గారూ? పెద్దలందరిముందు నా పరువు ఎలా తీసేస్తున్నాడో ?

పర్వ : నిన్నేమిటయ్యా నా మొహం. నన్నూ అన్నాడు.

[ఇద్దరూ నవ్వుకుంటారు]

రఘు ; అసలు ఏమిటీ థియరీ ? రామారావ్ !

రామా : చాలా సింపుల్ బ్రదర్. మనం చేసే చాలా గొప్ప గొప్ప పనులకీ. ఆలోచనలకీ వెనక చాలా చిన్న మోటివ్ ఉంటుంది. జేబులు కత్తిరించే దొంగ వెధవకి ఆ పని వల్ల వచ్చే డబ్బుకంటె కత్తిరతో జేబులు కత్తిరించే నైపుణ్యం మీద మక్కువ ఉండవచ్చు. ఒక అమ్మాయిని నువ్వు ప్రేమిస్తున్నావంటే అందుకు మనస్సులో అంతరాంతరాలలో ఉద్దేశం-ఆమె జడకుచ్చులో, నడకలో నీకు నచ్చి వుండవచ్చు.

రఘు : ఛ, నే న్నమ్మను. కథలాగ వుంది నువ్వు చెప్పేది.

రామా : కానీ యిది నిజం. సైకాలజీలో వున్న తమాషాయే యిది.

రఘు : ఏమోనోయ్. నాకూ నమ్మకం లేదు. మా ఆవిణ్ణి నేను ప్రేమిస్తాను. నాకు ప్రాణం. నేనంటే అమెకీ అంతే. అందుకు కారణం ఆమె జడమీద ప్రేమో, నడకమీద ప్రేమో నంటావా ?

రామా : అంత హఠాత్తుగా చెప్పలేను కాని, ప్రారంభదశలో అలాంటిదేదో అయి వుంటుంది.

రఘు : ఉహూం, నేన్నమ్మను. మేము మనఃపూర్వకంగా ప్రేమించుకున్నాం.

రామా : తరువాత జరిగిన విషయం అది. మొదట ?

రఘు : మొదటి నుంచీను.

రామా : మీరు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారా ? లేక పెళ్ళి చేసుకొన్నాక ప్రేమించుకొన్నారా ?

రఘు : పెళ్ళి చేసుకొన్నాక.

రామా : అయితే తప్పక ఏదో విచిత్రమయిన ఆకర్షణో, ఆలోచనో మిమ్మల్ని దగ్గిర్నీ ఆకర్షించి వుంటుంది. తప్పదు.

రఘు : అంటే ?

రామా : చెప్తాగా ! రేపు ఆదివారం. ఉదయమే టిఫినుకి మీ యింటికి వస్తాను. రెడీగా వుండు. వచ్చి ఎనలైజ్ చేస్తాను. సరేనా ?

రఘు : రైటో,

* * *

రఘు : శారదా....ఏం చేస్తున్నావు శారదా ?

శారద : అబ్బ. ఎన్నాళ్ళకి మీ అంతట మీరు పలకరించా రండీ. ఆ పుస్తకాల మధ్య నుంచి ఎప్పుడన్నా తలెత్తితేనా ?

రఘు : వెక్కిరించడంకాదు. ఇదిగో... యిలా చూడు....దగ్గిరకి రా .... నిజంగానే అడుగుతున్నాను చెప్పు.

శారద : ఏం చెప్పేది ?

రఘు : నాలో ఏముందని ప్రేమించావు?

శారద : అదుగో ప్రేమంటే నాకు వొళ్ళు మండుతుంది. ఇదేం సినీమాలా ? ప్రేమిస్తూంత డానికి. ప్రేమంటే నాకు తెలీదుబాబూ -

రఘు : అహ. తప్పు తప్పు. ప్రేమ కాదులే. చెంపలు వేసుకుంటున్నాగా. ఎందుకు పెళ్ళిచేసుకున్నావు చెప్పు ?

శారద : ఆడదాన్నయి పుట్టాక పెళ్ళి చేసుకోనేమిటి ?

రఘు: మరినన్నే ఎందుకుచేసుకొన్నావు

శారద : మిమ్మల్నే చేసుకోవాలని దేవుడు రాసిపెట్టాడుకనక.

రఘు : అలాకాదు శారదా. నాలో ఏదో మంచో, చెడో నీకు కనిపించలేదా మరి ?

శారద : పెళ్ళిచేసుకొన్నాక మీలో చెడు ఎందుకు కనిపిస్తుందండీ. మీరే నాకు దేవుడు.

రఘు : అబ్బబ్బ. నన్ను చంపుతున్నావు. నే నడిగేది కాస్త అర్థం చేసుకో. చూడు. నా కళ్ళు బాగున్నాయని చేసుకొన్నావా ?

శారద : అబ్బ.ఏమిటండీ ఆ ప్రశ్నలు ;

రఘు : నేను రచయితనని చేసుకొన్నావా ?

శారద : పెళ్ళయేవరకూ మీరు కథలు రాస్తారని తెలీదు.

రఘు : తెలిస్తే చేసుకొనేదానివి కాదా ఏమిటి ?

శారద : ఏమోబాబూ. నాకీ తికమకలు తెలీవు.

రఘు : చూడుమరి. నీతో మాట్లాడాలని మంచి మూడ్‌లో వున్నాను. ఇలా కూచో.

శారద : నన్నేం చూసి చేసుకొన్నారో మీరు చెప్పండి. చూదాం.

రఘు : ఏమో. గుర్తులేదు. నీమొహాన్ని చూసి అనుకొంటాను.

శారద : నాకు తెలుసులెండి. మా నాన్న గారి ఆస్తిని చూసి చేసుకున్నారు.

రఘు : అంతేకదా. మీ నాయనమ్మని చూసో, మీయింటో పాడి ఆవుని చూసో అన్నావుకాదు.

శారద : పొండి. మీతో మాటాడి జయించడం కూడా కష్టమే.

రఘు : శారదా, యిలా చూడు శారదా. యివాళ యిలా వెన్నెల్లో కూచుంటే మొదట మనం కలుసుకొన్న రోజు నాకు గుర్తుకొస్తోంది.

శారద : నిజంగా ?

రఘు : అవును శారదా ! [దీర్ఘంగా] నువ్వు ఆ రోజు తలనిండా మల్లెపువ్వులు పెట్టుకొన్నావు....

శారద : అవును. మీ అమ్మగారే తెచ్చి యిచ్చారు. ఆమె కూడా తలనిండా పెట్టుకున్నారు.

రఘు : పసుపు పచ్చని చీరె కట్టుకుంటే బంగారం ముద్దలాగ కనిపించావు.

శారద : అవును, సంక్రాంతికి కొను కొన్న కొవాయి చీరె.

రఘు : పచ్చటి బ్లౌను....

శారద : అబ్బ. ఎంతబాగా గుర్తుంచుకొంటారండీ మీరు.

రఘు : నాతో యిలా వెన్నెల్లో పడుకొనే రోజు వస్తుందని ఆ రోజు ఆలోచించావా శారదా?

శారద : అలాంటివి అడిగితే ఆడది ఎలా



చెప్తుందండీ? ఎప్పుడూ నాకు సిగ్గు కలిగే విషయాలే అడుగుతారు మీరు.

రఘు : చెప్పి సిగ్గుపడడం ఓ అందం కాబోలు. పోనీ. ఇప్పుడయినా అనిపిస్తోందా. రచయిత పెళ్ళానివి అయావు కనక యిలా వెన్నెల్లో పడుకొనే అవకాశం వచ్చిందని. ఏ ఇంజనీరో, ఖడిపంతులో అయితే రోడ్ల మరమ్మత్తు గురించో, కాంపోజిషన్ పుస్తకాల గురించో మాట్లాడే వాడు. అవునా ?

శారద : ఊరుకోండి మరీను.

రఘు : ఇంకా చెప్పు. నువ్వా రోజు పాట పాడావు కదూ?

శారద : అవును. ఆ రోజు నా గొంతు ఖంగు మంటోంది. పాట సరిగా వస్తుందో రాదో నని పొద్దుటినుంచీ భయపడుతూనే

జాగ్రత్తగా వున్నాను. నాకు బాగా గుర్తు. దేవాలయమున వినబడు నవిగో .... అని పాడాను.

రఘు : నిజం, చాలా బాగా పాడావు. పెద్ద కళ్ళు నీవి. నన్ను కొరికేసేటట్టు చూడ డం ప్రారంభించావు మొదటి రోజే.

శారద : ఎంత చమత్కారంగా చెప్తా రండీ - మీరు చూడండీ నేను చూసినట్టు ఎలా తెలిసింది మీకు ?

రఘు : పిచ్చిపిల్లా - మగాడు అమ్మా యిని చూడడానికే పెళ్ళిచూపులు.

శారద : ఆడది చూసుకో నక్కరలేదా ఏమిటి ? పొరపాటున ఏ తెలివి తక్కువ దద్దమ్మో మొగుడయితే ?

రఘు : ఇప్పుడు కాలేదని నమ్మకమేనా?

శారద : ఉహూఁ, కాలేదు.

రఘు : నిజం ?

శారద : ఊఁ.

రఘు : ఎలా తెలుసుకొన్నావు నేను తెలివయిన వాడినని ?

శారద : ఉహూఁ, చెప్పను నేను.

రఘు : చెప్పు శారదా, ఇటు చూడు. మల్లెపువ్వులు తెప్పిస్తాగా రేపు. చెప్పాలి మరి. ఊఁ....

శారద : ఆరోజు ఎంతో గర్వంగా, ఠీవిగా, మీరు కుర్చీలో కూర్చున్నారు.

రఘు : ఎప్పుడూ నేనలాగే కూర్చుం టాను.

శారద : నాకలా అనిపించింది. అంతే. తెల్లటి పాంటు బూట్లు - ఎంత గొప్పగా ఉన్నారు అనుకొన్నాను.

రఘు : ఇంకా ?

శారద : చక్కగా వంపులు తిరిగిన క్రాపు దువ్వుకొన్నారు. మంచి ఉంగరాలు తిరిగిన జుట్టు నుదుటిమీదకు పడుతూ....

రఘు : అలాగా.

శారద : అవిగో .... అలా వెక్కిరిస్తే చెప్పను.

రఘు : మా అమ్మవుకదూ - వెక్కి రించనులే. చెప్పు....చెప్పుమరి.

శారద : ఎంత బాగుంది జుట్టు....అను కొన్నాను.

రఘు : ఇంకా ?

శారద : ఇంకేముంది ?

రఘు : ఇంకా ఏం జ్ఞాపకం లేదూ?

శారద : మరో విషయం చెప్పేదా ?

రఘు : ఊఁ.

శారద : అటు తిరగండి మీరు.

రఘు : ఊఁ... ఇప్పుడు చెప్పు.

శారద : మీరు అచ్చు సినిమా నటుడి లాగ వున్నారు అప్పుడు.

రఘు : అమ్మదొంగా .... చాలా పెద్ద ఆలోచనే వచ్చిందన్నమాట. ఇదిగో .... శారదా- నామాట విను-శారదా....(నవ్వుతూ పారిపోతుంది. రఘు మెల్లిగా నవ్వుకుం టాడు.)

* * *

రఘు : ఇదీ అసలు విషయం. ఇప్పుడు చెప్పు. ఇందులో మా ప్రేమకు కారణం ఏమిటో.

రామా : ఉండుండు. తొందరపడకు. ఆరోజు నువ్వు ఆమెను చూసినప్పుడు ఏం అనిపించింది ?

రఘు : బుద్ధిమంతురాలు అని పిం చింది.

రామా : ఇంకా ?

రఘు : నేను సాహిత్యంలోపడి కొట్టుకు పోయినా ఓపికతో ఉంటుందని.

రామా : అగాగు. ఎలా అనిపించింది ?

రఘు : అంతే—

రామా : ఆ ఆలోచన రావడానికి ఏదో కారణం వుండాలిగా.

రఘు : అదా ? ఏం లేదు. ఊరికినే తోచింది. ఆఁ, ఉండుండు - ఒక్క విష యం గుర్తుకొస్తోంది. శారద పాట పాడు తూంటే మా చెల్లెలు వేడి కాఫీ గ్లాసు తీసు కొని తాగబోయింది. కాని వేడికి చెయ్యి కాలి వంటిమీద వలక బోసుకోబోయింది. పాట పాడుతున్నా శారద చటుక్కున ముం దుకు వచ్చి గ్లాసు అందుకొని, నవ్వుతూ చెల్లెల్ని బుజ్జగించింది - ఇంతసేపూ పాట ఆపలేదు. చక్కగా పాడింది.

రామా : దేర్ దేర్ - ఇంత గొప్ప సంఘటన వుండగా చెప్పవేమిటోయ్ భగ వాను. అది చూడగానే నీకే మనిపించిం దంటే - ఆహ్లా నా చేతకానితనాన్నింది యీమె రక్షించగల దనిపించింది. తన పని చేసుకొంటూనే నీకూ సహాయం చెయ్యగల దనిపించింది. ఆమె సమయస్ఫూర్తి నీకు నచ్చింది. అవునా ?

రఘు : అవును.

రామా : అంటే తేలిపోలేదూ కథ ? నువ్వు చెప్పిన విషయాలన్నింటిని బట్టి, మీ యిద్దరి ఆకర్షణలకూ కారణం యిది - మీ ఆవిడ నీ ఉంగరాల జుత్తుని,నువ్వు కూడున్న తీరుని, నీ మాటల చమత్కారాన్ని, అంతకు మించి నువ్వు సినిమా నటుడిలాగ కన్పించడాన్ని చూసి మూర్ఛపోయింది. నువ్వు ఆమె పాటనీ, ఆమె కాఫీ కప్పుని అందుకున్న చాకచక్యాన్నీ చూసి మూర్ఛ పోయావు. ఈ ఆకర్షణలు పెరిగి పెరిగి పెళ్ళిగా మారి, ఇప్పుడు ప్రేమ గా మారాయి. అదీ కథ. ఇక నా కాఫీ, టిఫిన్ —

రఘు : చాలా బాగుందోయ్ నీ థియరీ. చాలా ఇంటరెస్టింగ్‌గా వుంది. నిజమేనని పిస్తోంది నాకూను. ఉండు, మా ఆవిడకి యీ వార్త చెవిని వేస్తాను - శారదా.... శారదా....

శారద : ఏమండీ ?

రఘు : నేను నిన్నెందుకు పెళ్ళి చేసు కున్నానో తెలుసా ?

శారద : ఎందుకండీ ?

రఘు : నీ పాటను చూసి, నువ్వు కాఫీ కప్పు అందుకోవడంలోగల చాకచక్యాన్ని చూసి.

శారద : అదేమిటండీ ?

రఘు : అదంటే శారదా, నువ్వు నన్నెం దుకు పెళ్ళిచేసుకున్నావో తెలుసా ?

శారద : ఎందుకూ ?

రఘు : నా ఉంగరాల జుట్టు, నేను కుర్చీలోకూర్చున్న ఠీవి, నా వాక్చాతుర్యం, నేను సినీ నటుడిలాగ కన్పించడం — చూసి.

శారద : ఇదెవరండీ చెప్పారు ?

రఘు : ఇదంతా సైకో అనాలిసిస్ శారదా. నీకు తెలీదులే. త్వరగా కాఫీ తీసు కురా. ఇదంతా చెప్పిన మిత్రుణ్ణి చూసె స్తాను.

శారద : మీకేదో పిచ్చెత్తినట్టుంది. ఉం డండి వస్తాను.

జానపదాలు

ముూడు చినుకులైన ముత్యాంపు చినుకులు
మూడునాళ్ళ వాన ముదికి వాన

నిరుల పంచుకొనగ సిగపట్లు గోత్రాలు
లేమి పంపకాన లేదు చిక్కు

కాకి వాలినంత కసరికొట్టెడి లోభి
కాకివోలె బ్రతుకు గడిపి చనును

నలువ గూర్చునంద్రు నరనారులకు జంట
కాళ్ళు వాయ తిరుగు కన్యా తండ్రి

నిదురకన్నను సుఖము నీడకన్నను రక్ష
ప్రేమకన్నను తీపి పృథివి లేవు

వాన లేక కఱవు వరదతోడ కఱవు
కలిగి కఱవుకేది కారణమ్ము!

పేరు గొప్ప కేమి పృథివి దాటునుగాక
వేరి మూడ తెలియు చేత గొప్ప

ఆత్మ వంచకులకు అనుభవమ్మేమౌనా
తప్పు లొప్పు లగును గొప్పలౌను

పుట్టినింటి గొప్ప బుద్ధిని పట్టెనా
మెట్టినింటి బ్రతుకు పట్టి రోత

గాలి విసురుకన్న కడు తీవ్రమై యుండు
మనసు లేని మగువ మాట విసురు

వేతలందు గొప్ప చెప్పక వేరొందు
చెప్పుకొనెడి గొప్ప ఒప్పదెందు.

—కస్తూరి.



విప్లవవాది - ప్రేమోన్మాది

కె. రామలక్ష్మి

చిట్ట చివరకు ఒంటె నడుం విరచినవి రెండు గడ్డి పోచలని తేలింది. అదే - పార్వతిని ఒంటె అనడానికి ఒప్పు కుంటేనే సుమండీ, ఇటువంటి పరిస్థితిలో ప్రాణాధిపుడైన భర్త కృష్ణమూర్తి అలా అని పిలిచినా పలికేదే పార్వతి!

చక్కని చిన్న యింట్లో చిన్న వంట గది మధ్యలో అగ్నిగోళంలా కోపంతో మండిపడి పోతూ నిలచింది పార్వతి. అప్పుడే వర్షంలో తడుసుకుంటూ బయటనుంచివచ్చిందేమో - ముంగురులన్నీ ముఖాని కంటుకు పోయాయి. చీర తడిసి ముద్ద అయింది.

కాలుతీసి కాలు పెట్ట వీలులేనంతగా అతుక్కుపోయింది వంటికి. పక్కగది మధ్యలో వెచ్చదనం పడుతూ పాంటు జేబులో ఒక చెయ్యి. రెండో చేత్తో రెండు పుస్తకాలూ పట్టుకుని 'ఔరా, ఎంతటి అల్పత్వం!' అన్నట్లు వున్నాయి చూపులూ, నోటి తీరూను. ఆ చేతిలో వున్న రెండు పుస్తకాలూ పార్వతి కష్టపడి బజారుకు వెళ్ళినప్పుడు కొని తెచ్చింది. వెళ్ళక, వెళ్ళక వెళ్ళినట్టే వర్షం ముంచుకు వచ్చింది. అప్పుడే కొన్న ఆ పుస్తకాలు తడవకుండా చూసేసరికి తాతలు ధిగి వచ్చారు. ఇంకా బట్టలేనా మార్చుకోలేదు. అంతట్లోకే కొంప లంటుకొన్నట్టు ఆ పుస్తకాలూ, ఆ పోజూ. ఏం మగవాళ్ళు!

"అయితే ఏమిటీ? నే చదువుదామని నే కొనుక్కున్న పుస్తకాలు నీకు నచ్చలేదూ?" అంత తడిలోనూ వేడిగా విసరింది మాటలు. "వెచ్చగా గువ్వ పిట్టలా కూర్చున్నావు చాలక. అట్టమీద బొమ్మలు చూసి కొన్నాననుకున్నావా? నువ్వు చదవడానికి కాదుగా నే కొన్నది?" చీర కుచ్చెళ్ళు పిసుకుకుంటూ అరవాలన్న కుతూహలాన్ని కాస్తా గట్టిగా అణిచి పెట్టుకుంది. 'ఛ ఛ! ఏం మగవాళ్ళు! ఏం సభ్యత! నే నేం చదివితే తన కెందుకు? ఏం ఏడిస్తే తన కెందుకు?' స్వగతం పలుక్కుంది.

"అదికాదు పార్వతీ.... నే చెప్పబోయినదీ."

"ఓస్, నువ్వేం చెప్పక్కరలేదు" తుఫానులా ఆ గదిలోంచి తప్పించుకుపోదామని అడుగు వెయ్యబోయింది. తడిచీర నడవనియ్యలేదు. "నిన్నటికి నిన్నసూ అంతే. వెధవది, మూడు నయాపైసల స్టాంపులకోసం నానాగొడవ చేశావు. పెద్ద దొంగతనం చేసినట్టు ఆరాలు తీశావు. నే రాసిన ఉత్తరాలకి అంటించడానికి నీదగ్గర కొట్టేశానన్నావు."

"నువ్వెప్పుడూ అంటావుగా, స్టాంపులెప్పుడు తీసినా జ్ఞాపకంచెయ్యి. తిరిగి కొని పడేస్తాను. అవసరానికి వుండవు. అందుకేగా నే జ్ఞాపకం చెయ్యబోయాను" చేతిలో పుస్తకాలు యిటూ అటూ తిప్పుతూ సగం స్వగతంగా అన్నాడు కృష్ణమూర్తి.

వెధవది-గతుకుగుప్ప అన్న సంగతి మరిచి కాళ్ళకి జోళ్ళు లేవన్నది మరిచి కాలు నేలకి కొట్టింది కోపం ప్రదర్శించాలని పార్వతి. అబ్బ! అనక తప్పలేదు. గోరుచుట్టుమీద రోకటి పోటు! ఈ దెబ్బ వస్తున్న కోపాన్ని రెచ్చకొట్టింది. "అదిగో ఆదే వద్దన్నాను. 'ఎప్పుడూ అంటావు! ఎప్పుడూ అంటావు.' అంటూ వూ యిద్రైపోతావు ఎప్పుడూ ఎప్పుడూ 'ఎప్పుడూ' లుదీని తోటే నాకు పిచ్చెత్తి పోతూంది. మొగుడూ పెళ్ళాలిలా అస్తమానూ ఎప్పుడూ అనుకోకుండా వుంటే తక్కువ విడాకులంటాయట" వ్యంగ్యం ధ్వనించింది. షాక్ కొట్టినట్టు రెండడుగులు ముందరికి వచ్చాడు కృష్ణమూర్తి. అది గమనించనట్టే నిలబడింది పార్వతి.

"అవును—మనకి పెళ్ళయి ఎనిమిదేళ్ళయింది. అయినా నే చేసిన ప్రతిపనీ నువ్వు విమర్శించడం. దెప్పడం మానలేదు. ఎప్పుడూ నన్నర్థం చేసుకోలేవు"

"ఎప్పుడూ నా?" నన్నగా నవ్వబోయాడు కృష్ణమూర్తి.

"ఏదో నవ్వేసి నవ్వించేసి యిదంతా హాస్యానికి అనేయకు కృష్ణా.... దేన్ని పట్టించుకోకుండా వూరుకుంటున్నాను యింతకాలం. కాని యిక లాభంలేదు. నేనూ పేరీజు వేసుకోవాలి." గోడనున్న అద్దంలో తన ముఖం చూసుకుంది పార్వతి. వర్షంలో తడవటంవల్ల కోపంచేత బుగ్గలు కందాయి. కళ్ళు మెరుస్తున్నాయి. జుట్టు తడిసి అంటుకుపోయింది నుదుటిమీద. గడ్డం పైకెత్తి పెదవులు బిగించింది పార్వతి.

"వెళ్ళు చిన్న పిల్లల నిలా, కీలుబొమ్మల్లా ఆడించు, టోకరా కొట్టించు, నమ్మించు. నన్ను కాదు - దయచేసి హాల్లోకి వెళ్ళిపో" అంటూ బాత్‌రూమ్‌లోకి దారి తీసింది. తడిసిన చీరతో కష్టపడి నడుస్తూంటే వెనక నుంచి చూడ్డాని కెంతో అందంగా కనిపించింది కృష్ణమూర్తి కళ్ళకి. మామూలు మూడ్సులో వుంటే అమాంతం వెళ్ళి కౌగలించుకునేవాడు. వినుక్కోకుండా, తోసేయకుండా తనూ కౌగలించుకుని అతని తలని గుండెలకు అదుముకొనేదే పార్వతి! కాని కాలం కలిసిరాలేదు. అందుకు చింతిస్తూ హాల్లోకి వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

మర్నాడు పనిలోంచి యింటికి చాలా హుషారుగా వచ్చాడు కృష్ణమూర్తి. ఇంటికొచ్చి పడ్డం ఎంత సంతోషకరమైన సంగతో పార్వతికి తెలియాలని అతని కుతూహలం. ఈ యిల్లూ వాకిలీ — పెళ్ళాం పిల్లలూ, ఎంత గర్వించతగ్గ సంపాదన! అని ఛాతీవిరుచుకున్నాడు. జేబులోంచి మల్లెపువ్వుల పొట్లాం అతిజాగ్రత్తగా తీసి చేత్తో పట్టుకున్నాడు. అదో అమూల్యమైన వస్తువుగా అతిభద్రంగా పట్టుకుని వంటింటి గుమ్మంలోకి వెళ్ళాడు. అప్పుడే చీరచెంగుతో చేతులు తుడుచుకుంటూ యిటు తిరిగింది పార్వతి.

"ఇదిగో శాంతి చిహ్నం. పుస్తకాంపట్ల మోటుగా ప్రవర్తించాను. ఏం అనుకోకు పార్వతీ" అంటూ చేయి జాచాడు. ఇక లాభంలేదు. అన్నట్టు నవ్వుతూ 'చాలా థాంక్స్'. యివికొని తెచ్చి పెట్టావు మరిచిపోకుండా...." యింకా ఏదో అనబోయింది. మధ్యలోనే "అలా అంటావేమిటి. నీ కివి రోజూ యివ్వాలి. ప్రతి రోజూ నీ కిక మీదట పువ్వులు తెస్తాను. వద్దనవుకదూ" అంటూ ముందుకువంగి కళ్ళు మూసుకున్నాడు కృష్ణమూర్తి. స్పర్థలన్నీ మరిచి ఓ ముద్దు పెట్టకపోతుందా అని. బహూ నేర్పుగా, ముందుకు వచ్చిన ముఖాన్ని తప్పించుకుంటూ పక్కకి వెళ్ళి పువ్వుల పొట్లాన్ని పోపులడబ్బా మీద పెట్టింది పార్వతి. జాపిన చేతుల్లోకి ఎవరూ చిక్కక పోగా బోర్లపడ్డంత అవమానం అనిపించింది కృష్ణమూర్తికి.

"ఏం పార్వతీ! ఏమైంది - ఏం అలా వున్నావ్?" అన్నాడు తేరుకుంటూ.

"ఏం లేదే" ఎంతో తేలికగా అనేసింది. "ఏదైనా వుండాలనుకున్నావా?" అంటూ పొయ్యమీద గిన్నెను దింపి యింకో గిన్నెను ఎక్కించే పనిలో నిమగ్నమై పోయి యిటు చూడనే లేదు. స్టౌ వెలుగు గమ్మత్తుగా ఆమె బుగ్గలమీదా, జట్టు మీదా పడుతోంది. ఆ చీకటి వెలుగులలో పార్వతి చాలా అందంగా

● ఆసలు ప్రేమంటే ఏమిటో ఎరక్కుండా వుండడంకంటే భార్యనైనా సరే ప్రేమించడం మంచిది.

కన్పించింది కృష్ణమూర్తి కళ్ళకి. కాని ఏం లాభం ! అనుకుని నిట్టూర్చాడు. "అంతా రడీ అంటే పెందరాడే భోజనాలు చేసేద్దాం. కొంచెం కాగితాలున్నాయి చూసుకోవాలి"

"ఓ దానికే వుంది. తినేస్తే సరి." అనేసి వూరుకుంది పార్వతి. ఈ రోజు అన్ని రోజుల్లాగా కాదు. ఏదో వుంది అనుకుని మాట్లాడక వూరుకున్నాడు. 'ఈ ఆడవారి మనస్సులలో జరిగే విషయాల నెలాగ గుర్తించడమో ప్రయత్నించాలి. అస లవి ఎలా పని చేస్తాయో ? ఆ బుర్రలో ఏం పెడ తాడో కదా భగవంతుడు' అనుకున్నాడు "పాపం. ఆ తప్పు ఆ బుర్రదే ! తెగ పని చేసేసి అలసిపోయింది వెర్రిపిల్ల !" అనుకుని జాలి పడ్డాడు. అంత నిశ్శబ్దంలో భోజనా లెప్పుడూ జరగలేదు. వాతావరణం గంభీరంగా వుంది. ఎందు కొచ్చిన గొడవ ? ఇదెలాగో తేలక పోతుందా - అని వెళ్ళి హాల్లో కూర్చున్నాడు.

పార్వతి పని ముగించుకుని హాల్లోకి వచ్చింది. ఓ పత్రిక పట్టుకుని కూర్చుంది. నిశ్చింతగా కాగితాలు చూసుకుందామనుకున్న కృష్ణమూర్తికి పనే సాగడంలేదు. కాగితాలు పక్కకినెట్టి పార్వతి కుర్చీదగ్గర కూర్చున్నాడు. ఎలా ప్రారంభించాలో తెలియడం లేదు. కాని ఈ స్తబ్దత మటుకు భరించలేడు. "మల్లెపూలు తెచ్చి మళ్ళీ అంతా మామూలు అవాలని నా మనస్సు చెప్పాను కదూ పార్వతీ ? ఎందు కింత కోపం ? నీ పుస్తకాలను విమర్శించాను. నిజంగా సారీ చెప్పాను కదా ! ఆ స్టాంపుల సంగతి కూడా మరిచిపోదామన్నాను - అయినా కూడా అంతా నవ్యంగా లేదు. నా మెడ చుట్టూ నీ చేతులు వేసి కౌగలించుకుంటే గొడవే లేదుగా. కాని నువ్వలా చేయ లేదేం పార్వతీ ?"

ఎంత జాలిగా, దారితప్పిన మేకపిల్లలా వున్నాడు ! మనస్సు వెన్నలా కరిగిపోయింది పార్వతికి. అమాంతం అతన్ని గుండెల కదుముకోవాలన్న కోరిక మేరువులా పెరిగింది. కాని తమాయించింది. పౌరుషపడింది. పార్వతి సన్నగా నవ్వింది. "మల్లెలకి థాంక్స్ చెప్పానుగా. నీ సుకుమారమైన ఫీలింగ్సుకి ఎప్పుడూ విలువ యిచ్చాను! కాని నా ఫీలింగ్స్ యీ మల్లెలతో, చీరలతో, నగలతో కొనుక్కోవాలని చూడడం అత్యాశకదూ ?" అడిగింది.

"అలా అనకు ప్రియా. చిన్న చిన్న బహుమతులతో స్త్రీలు ప్రసన్నులవుతారంటాయి అన్ని పుస్తకాలూ."


"నాకు నీ బహుమతు లక్కరలేదు. నా వ్యక్తిత్వం గుర్తించడం కావాలి" మహారాణిలా లేచి నిలబడింది పార్వతి.

కృష్ణమూర్తి ముఖం వేలేశాడు. అంత సింపుల్ దాంబు విసిరిందేమిటి అనుకున్నాడు. కన్నార్పకుండా చూస్తున్నాడు....అంతేకాదు శక్తులు కూడదీసుకుని "నీకు ఏమిటి కావాలన్నావు ?" అని ప్రశ్నించాడు కూడా.

"నా వ్యక్తిత్వం. దాన్ని నిలుపుకొనేందు కిప్పుడేనా ప్రయత్నించాలి నేను. ఈ తరుణం కూడా చేయిజారిపోతే యిక అది శాశ్వతంగా పోగొట్టుకుంటాను. నిన్నరాత్రి నే కొన్నపుస్తకాలను విమర్శించావు. ముష్టి స్టాంపులకోసం బేరం సాగించావు....వాటిని గురించీ. నిన్ను గురించికూడా ఆలోచిస్తున్నాను కృష్ణా. పాపం ! గోవులాంటి వాడివిగా."

జ్యోతి

చిత్రాక్షరి



"నిన్ను హృదయంలోపెట్టి పూజించే వ్యక్తి నీ దృష్టికి ఆనడంలేదా పార్వతీ" ఎంతో యిదిగా అడిగాడు.

"నా ఆలోచనల కలాంటి రూపం తటస్థ పడలేదు....నన్ను చిన్నచూపు చూసే నా చిన్నతనం గోచరించింది. నిన్ను సంతోష పెట్టాలని ఏం చేసినా దాన్ని వ్యంగ్యంగా తప్ప యింకోలా చూడలేని నా దృష్టిదోషం నన్ను కుంగతీస్తూంది....నీకు నీ ఆలోచనేతప్ప ఎదుటివారి గొడవే అక్కరలేదు. నన్నూ, నా ఉనికినీ యు ఆర్ టేకింగ్ ఫర్ గ్రాంటెడ్. తెలుసా ? ఆ మాట తెలుగులో ఎలాగ చెప్పడం ?" ఆగింది పార్వతి.

అంత మాట పడిపోయిన పరిస్థితిలోనూ నవ్వొచ్చింది కృష్ణమూర్తికి. "పట్టిపెళ్ళాంగా....కుర్చీ, బల్లల్లాగా రోజూ భోజనంలాగ అలవాటు పడిపోయానంటావ్ ! అంతేనా ?"

"ఆహా ? అక్షరాలా"

"పార్వతీ ! అది నిజం కాదు. కాదని నీకు తెలుసును" ఆవేశంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు కృష్ణమూర్తి. ఈ విషమ పరిస్థితిని ఎలాగైనా తేలికగా కొట్టిపారేయాలని అనుకున్నాడు. "చిన్నగా, సన్నగా వేళాకోళం చేస్తాను....అంతేగాని లోకువ ఎలా చేస్తాను నిన్ను ? చెప్పు పార్వతీ?"

"అది జోకు కాదు. హేళన. వ్యంగ్యం. చాలా సాఫీగా చెప్పింది పార్వతి. "అలాంటప్పుడు నే నేం ఆలోచిస్తానో కూడా నీకు తెలుసు. అయినా జోకు ఎంజాయి చేయడానికిద్దరు కావాలి కదూ ?" రెం డడుగులు వేసి గోడనున్న అద్దం ముందు నిలచింది పార్వతి. సన్నగా పొడుగ్గా వున్న కుడిచేతి చిటికెన వేలుతో కను పాప సరిచేసుకుంది. హఠాత్తుగా కృష్ణమూర్తి వేపు తిరిగి దగ్గరగా వచ్చింది. "నువ్వస్తమానూ అంటూ వుంటావు. నా చిన్న చిన్న అర్థంలేని భయాలతో, కోపాలతో కలిసి బ్రతకడం కష్టమని. కాని పాపం ! నువ్వు దేవుని వంకలేని సృష్టివా ? నాకూ అనిపిస్తూంది - అసలు నీలాంటి వాడితో జీవితం పంచుకునే శక్తి నా కెలా వచ్చిందా అని"

"పార్వతీ, అలా అనకు." గట్టిగానే అరిచాడు కృష్ణమూర్తి.

అయితే పార్వతికి అక్కడితో పూరుకోవడం యిష్టం లేదు. ఇంతదాగా తను చెప్పదలచుకొన్నది చెప్పే అవకాశం మళ్ళీ రాకపోవచ్చు. కృష్ణమూర్తికిక చచ్చేకోపం పెంచుతుంది. చూపుడు వేలును కబడ్దారు అన్నట్టుపట్టి "ఏదోరోజు పొద్దుట నీ పక్కలో కనబడను. ఉదయం పేపర్లో చూస్తావు ఓ పిచ్చిదెవత్తో చెరువులోనో నూతులోనో పడిందని, తెలిసిందా" అంటూ గంభీరంగా పడగ్గదికేసి నడిచింది. గుమ్మంలో ఆగి వెనక్కితిరిగి "అదెవరో నీకు సులభంగానే గుర్తు తెలుస్తుందిలే !" అంటూ లోపలికి వెళ్ళిపోయింది. ఈ పిడుగుపాటుతో జేరపడిపోయాడు కృష్ణమూర్తి. పడకగదిలో అలికిడి సన్నపడిందాకా అలాగే కూర్చుని ఆలోచించాడు. అంతుచిక్కలేదు. నల్లని వుంగరాల జుట్టు రెండు చేతులా పీక్కున్నాడు. నిస్పృహతోనే లేచి గడియారానికి కీ యిచ్చాడు. "నే పొరపడ్డాను. ఆ చిన్ని బుర్రలో పుట్టలేదు యీ కోపకారణాలు. నే నేదైనా తప్పు చేశానేమో" అంటూ యింకోదారిన ఆలోచన సాగించాడు .... అలాగే నిద్రపోయాడు కృష్ణమూర్తి !

తెల్లవారి ఏం జరగనట్టే లేచింది పార్వతి. చక్కగా కాఫీ, టిఫినూ అందించింది. ఆఫీసు బట్టలు తీసి పెట్టింది. వెళ్ళబోయే ముందు రెండోసారి కాఫీ అందిస్తూంటే యిక వుండలేక పోయాడు కృష్ణమూర్తి. "నువ్వెంత అందంగా వున్నావిపూట. నన్ను కొంచెం ప్రేమిస్తావా పార్వతీ ?" జాలిగా అడిగాడు.

దీనంగా వున్న అతని ముఖం పరిశీలించి చూసింది పార్వతి. "రాత్రి నా కో భయంకరమైన కల వచ్చింది. దానిలో నువ్వున్నావు. కసాయివాడి కత్తి చేత్తో పట్టుకుని నన్ను తరుముకు వస్తున్నావు. అప్పుడూ యిలా సన్నగా నవ్వుతూ జాలిగానే వుంది సుమా నీ ముఖం !"

ఇక ఆ తరవాత ఆఫీసులో పనెలా సాగుతుంది ? ఎలాగో కాలం గడిపాడు కృష్ణమూర్తి. మనసు మనసులో లేదు. అంతా పార్వతిదే తప్పు, అయినా యిదేం ఆడవాళ్ళు ! హేళాకోళం చేస్తే వుడుక్కుంటారు. సీరియస్‌గా మాట్లాడితే కోపగించుకుంటారు. ఇంటికి వస్తూ పేపర్లో పజిల్ పూర్తిచేశాడు. అర్థంకానిది—అంటే ఆడదీ పార్వతీ అని కసికొద్దీ నొక్కి రాశాడు కూడా.

ఇంట్లో అడుగుపెట్టగానే తన కళ్ళవద్ద దృశ్యాన్ని తనే నమ్మలేకపోయాడు. గాలిలో కదలాడుతున్న మేఘంలాగా నిలచి సన్నగా మెరుపులా చిరునవ్వు నవ్వుతూంది పార్వతి. "త్వరగా బట్టలు మార్చుకురా. మిరపకాయ బజ్జీలు చేశాను" అంటూ వంటింటిలోకి నడిచింది. ఆమె వెనకనే వంటింట్లోకి వస్తూ "ఏమిటోయ్ కథ అడ్డం తిరిగిందా ?.... ఈ విందంతా దేనికి" అడక్కూడదనుకుంటూనే అడిగాడు.

"రామ రామ ! విందా ! నీకు నిండైన భోజనం సమపాయాలు సమకూర్చకపోతే నా విధి నిర్వర్తించనట్టు. ఈ విషయాలలో లోటు రానివ్వడం యింటి యజమానిగా నీ వ్యక్తిత్వాన్ని కించపరచడం కదూ ?" నవ్వింది పార్వతి.

"ఓ....వ్యక్తిత్వం ! స్టేటస్ ! దాష్" మూలిగాడు కృష్ణమూర్తి.

"మధ్యాహ్నం మహిళామండలిలో ఒక టాక్ విన్నాను. చాలా బాగుంది. ఇంట్లో స్త్రీ స్థానం. మొత్తంమీద ప్రపంచ విషయాలన్నిటిలోనూ స్త్రీల ప్రతిపత్తిని గురించి. గమ్మత్తుగా వుంది సుమా" మాట్లాడే దోరణిలో సాగించింది పార్వతి. "ఓహ !" నిట్టూర్చాడు కృష్ణమూర్తి. "అవన్నీ చాలా ప్రమాదమైన విషయాలే. వినీ విననట్టు వినాలి వాటిని. ఒంట పట్టించు కోకూడదు" అన్నాడు.

"నాకు చాలా నచ్చింది."

"ఆ కార్యక్రమం మొత్తంమీద మగాడి గొంతుక వినిపించిందా ?"

"లేదు" ముక్తసరిగా సమాధానం చెప్పింది.

"చూశావా మరి నే చెప్పలే. అంతా ఆడ గోల."

"అదిగో అదే వద్దన్నాను. నువ్వు ఒక్కముక్క వినలేదు. అప్పుడే.... దాని విలువనంతా స్టఫ్ అంటూ వూది పారేస్తున్నావు"

కృష్ణమూర్తి వాతావరణం మార్పుగ్రహించాడు. తను తప్పుధోరణి తొక్కానని గ్రహించాడు. "సారీ పార్వతీ. అలా నే అనడం తప్పనుకో !"

"నువ్వు తప్పు ఒప్పుకోవడం సంతోషంగావుంది కృష్ణా ! పెరటి తలుపులు జేరవేసి వస్తాను. కొంచెం డిస్కస్ చేద్దాం" అంటూ లోపలికి వెళ్ళింది. వెడుతూ "నేను చాలా సీరియస్‌గా చెప్తున్నాను. వ్యక్తిత్వం కావాలని అనుకోవడంలో తప్పు లేదుగా.... దానికోసం కావలిస్తే దీర్ఘకాలం పోరాటం సాగిస్తాను కూడా."

తన వ్యక్తిత్వం దిగజారుతూందని తోచినప్పుడు మగవాడేం చేస్తాడు - శుభ్రంగా క్రాపు చేయించుకుంటాడు. మంచి సూట్లు కడతాడు. అద్దంలా మెరిసేలాంటి బూట్లు తొడుగుతాడు. కొత్త ఫ్రేము వేస్తాడు కళ్ళజోడుకి....

పల్చటి నీలంచీరలో దూది పింజెల్లాంటి మేఘసముదాయంలా వుంది పార్వతి. చక్కగా తలంటిన జుట్టు గమ్మత్తుగా మెరుస్తూంది. కోపంతో బిగిసిన నుదుటిమీద ఆడుకుంటున్నాయి ముంగురులు. పెద్దకళ్ళు కాటుకతో యింకా అందంగా కనిపిస్తున్నాయి. నిండైన పెదవులు ఎదుటివాడి నిగ్రహాన్ని పరీక్షకు పెడుతున్నాయి. వీటిఫలితం కలిసి బ్రహ్మాండ[illegible]ంది. స్త్రీ తన ఆయుధాలన్నీ సమీకరించి యుద్ధరంగానికి సంసిద్ధురాలైనట్టు—ఈ ఆకర్షణన్నీ —

"అది జోకు కాదు. హేళన. వ్యంగ్యం. చాలా సాఫీగా చెప్పింది పార్వతి. "అలాంటప్పుడు నే నేం ఆలోచిస్తానో కూడా నీకు తెలుసు. అయినా జోకు ఎంజాయి చేయడానికిద్దరు కావాలి కదూ ?" రెం డడుగులు వేసి గోడనున్న అద్దం ముందు నిలచింది పార్వతి. సన్నగా పొడుగ్గా వున్న కుడిచేతి చిటికెన వేలుతో కను పాప సరిచేసుకుంది. హఠాత్తుగా కృష్ణమూర్తి వేపు తిరిగి దగ్గరగా వచ్చింది. "నువ్వస్తమానూ అంటూ వుంటావు. నా చిన్న చిన్న అర్థంలేని భయాలతో, కోపాలతో కలిసి బ్రతకడం కష్టమని. కాని పాపం ! నువ్వు దేవుని వంకలేని సృష్టివా ? నాకూ అనిపిస్తూంది - అసలు నీలాంటి వాడితో జీవితం పంచుకునే శక్తి నా కెలా వచ్చిందా అని"

"పార్వతీ. అలా అనకు." గట్టిగానే అరిచాడు కృష్ణమూర్తి.

అయితే పార్వతికి అక్కడితో పూరుకోవడం యిష్టం లేదు. ఇంతదాగా తను చెప్పదలచుకొన్నది చెప్పే అవకాశం మళ్ళీ రాకపోవచ్చు. కృష్ణమూర్తికిక చచ్చేకోపం పెంచుతుంది. చూపుడు వేలును కబడ్దారు అన్నట్టుపట్టి "ఏదో రోజు పొద్దుట నీ పక్కలో కనబడను. ఉదయం పేపర్లో చూస్తావు ఓ పిచ్చిదెవత్తో చెరువులోనో నూతులోనో పడిందని, తెలిసిందా" అంటూ గంభీరంగా పడగ్గదికేసి నడిచింది. గుమ్మంలో ఆగి వెనక్కితిరిగి "అదెవరో నీకు సులభంగానే గుర్తు తెలుస్తుందిలే !" అంటూ లోపలికి వెళ్ళిపోయింది. ఈ పిడుగుపాటుతో జేరపడిపోయాడు కృష్ణమూర్తి. పడకగదిలో అలికిడి సన్నపడిందాకా అలాగే కూర్చుని ఆలోచించాడు.

అంతుచిక్కలేదు. నల్లని వుంగరాల జుట్టు రెండు చేతులా పీక్కున్నాడు. నిస్పృహతోనే లేచి గడియారానికి కీ యిచ్చాడు. "నే పొరపడ్డాను. ఆ చిన్ని బుర్రలో పుట్టలేదు యీ కోపకారణాలు. నే నేదైనా తప్పు చేశానేమో" అంటూ యింకోదారిన ఆలోచన సాగించాడు .... అలాగే నిద్రపోయాడు కృష్ణమూర్తి !

తెల్లవారి ఏం జరగనట్టే లేచింది పార్వతి. చక్కగా కాఫీ, టిఫినూ అందించింది. ఆఫీసు బట్టలు తీసి పెట్టింది. వెళ్ళబోయే ముందు రెండోసారి కాఫీ అందిస్తూంటే యిక వుండలేక పోయాడు కృష్ణమూర్తి. "నువ్వెంత అందంగా వున్నావీపూట. నన్ను కొంచెం ప్రేమిస్తావా పార్వతీ ?" జాలిగా అడిగాడు.

దీనంగా వున్న అతని ముఖం పరిశీలించి చూసింది పార్వతి. "రాత్రి నా కో భయంకరమైన కల వచ్చింది. దానిలో నువ్వున్నావు. కసాయివాడి కత్తి చేత్తో పట్టుకుని నన్ను తరుముకు వస్తున్నావు. అప్పుడూ యిలా సన్నగా నవ్వుతూ జాలిగానే వుంది సుమా నీ ముఖం !"

ఇక ఆ తరవాత ఆఫీసులో పనెలా సాగుతుంది ? ఎలాగో కాలం గడిపాడు కృష్ణమూర్తి. మనసు మనసులో లేదు. అంతా పార్వతిదే తప్పు. అయినా యిదేం ఆడవాళ్ళు ! హేళాకోళం చేస్తే వుడుక్కుంటారు. సీరియస్‌గా మాట్లాడితే కోపగించుకుంటారు. ఇంటికి వస్తూ పేపర్లో పజిల్ పూర్తిచేశాడు. అర్థంకానిది — అంటే ఆడదీ పార్వతీ అని కసికొద్దీ నొక్కి రాశాడు కూడా.

ఇంట్లో అడుగుపెట్టగానే తన కళ్ళవద్ద దృశ్యాన్ని తనే నమ్మలేకపోయాడు. గాలిలో కదలాడుతున్న మేఘంలాగా నిలచి సన్నగా మెరుపులా చిరునవ్వు నవ్వుతూంది పార్వతి. "త్వరగా బట్టలు మార్చుకురా. మిరపకాయ బజ్జీలు చేశాను" అంటూ వంటింటిలోకి నడిచింది. ఆమె వెనకనే వంటింట్లోకి వస్తూ "ఏమిటోయ్ కథ అడ్డం తిరిగిందా ?.... ఈ విందంతా దేనికి" అడక్కూడదనుకుంటూనే అడిగాడు.

"రామ రామ ! విందా ! నీకు నిండైన భోజనం సమపాయాలు సమకూర్చకపోతే నా విధి నిర్వర్తించనట్టు. ఈ విషయాలలో లోటు రానివ్వడం యింటి యజమానిగా నీ వ్యక్తిత్వాన్ని కించపరచడం కదూ ?" నవ్వింది పార్వతి.

"ఓ....వ్యక్తిత్వం ! స్టేటస్ ! దాష్" మూలిగాడు కృష్ణమూర్తి.

"మధ్యాహ్నం మహిళామండలిలో ఒక టాక్ విన్నాను. చాలా బాగుంది. ఇంట్లో స్త్రీ స్థానం. మొత్తంమీద ప్రపంచ విషయాలన్నిటిలోనూ స్త్రీల ప్రతిపత్తిని గురించి. గమ్మత్తుగా వుంది సుమా" మాట్లాడే దోరణిలో సాగించింది పార్వతి. "ఓహ !" నిట్టూర్చాడు కృష్ణమూర్తి. "అవన్నీ చాలా ప్రమాదమైన విషయాలే. వినీ విననట్టు వినాలి వాటిని. ఒంట పట్టించు కోకూడదు" అన్నాడు.

"నాకు చాలా నచ్చింది."

"ఆ కార్యక్రమం మొత్తంమీద మగాడి గొంతుక వినిపించిందా ?"

"లేదు" ముక్తసరిగా సమాధానం చెప్పింది.

"చూశావా మరి నే చెప్పలే. అంతా ఆడ గోల."

"అదిగో అదే వద్దన్నాను. నువ్వు ఒక్కముక్క వినలేదు. అప్పుడే.... దాని విలువనంతా స్టఫ్ అంటూ వూది పారేస్తున్నావు"

కృష్ణమూర్తి వాతావరణం మార్పుగ్రహించాడు. తను తప్పుధోరణి తొక్కాననీ గ్రహించాడు. "సారీ పార్వతీ. అలా నే అనడం తప్పనుకో:"

"నువ్వు తప్పు ఒప్పుకోవడం సంతోషంగావుంది కృష్ణా ! పెరటి తలుపులు జేరవేసి వస్తాను. కొంచెం డిస్కస్ చేద్దాం" అంటూ లోపలికి వెళ్ళింది. వెనుతూ "నేను చాలా సీరియస్‌గా చెప్తున్నాను. వ్యక్తిత్వం కావాలని అనుకోవడంలో తప్పు లేదుగా.... దానికోసం కావలిస్తే దీర్ఘకాలం పోరాటం సాగిస్తాను కూడా."

తన వ్యక్తిత్వం దిగజారుతూందని తోచినప్పుడు మగవాడేం చేస్తాడు - శుభ్రంగా క్రాపు చేయించుకుంటాడు. మంచి సూట్లు కడతాడు. అద్దంలా మెరిసేలాంటి బూట్లు తొడుగుతాడు. కొత్త ఫ్రేము వేస్తాడు కళ్ళజోడుకి....

పల్చటి నీలంచీరలో దూది పింజెల్లాంటి మేఘసముదాయంలా వుంది పార్వతి. చక్కగా తలంటిన జుట్టు గమ్మత్తుగా మెరుస్తూంది. కోపంతో బిగిసిన నుదుటిమీద ఆడుకుంటున్నాయి ముంగురులు. పెద్దకళ్ళు కాటుకతో యింకా అందంగా కనిపిస్తున్నాయి. నిండైన పెదవులు ఎదుటివాడి నిగ్రహాన్ని పరీక్షకు పెడుతున్నాయి. వీటిఫలితం కలిసి బ్రహ్మాండ[illegible]ంది. స్త్రీ తన ఆయుధాలన్నీ సమీకరించి యుద్ధరంగానికి సంసిద్ధురాలైనట్టు — ఈ ఆకర్షణలన్నీ —

కృష్ణమూర్తిని భయపెట్టాయి. ఇంత అందమైనదా తన భార్య అని తొలిసారిగా చూసుకున్నాడు. తిరిగి వచ్చిన పార్వతి అలవోకగా గడపకానుకుని నిలబడింది. రెండంగల్లో ఆమె ముందు వాలాడు కృష్ణమూర్తి. "ఓయ్. ఈ దీనుణ్ణిలా కాలిస్తే ఎలాగ చెప్పు....ఎంత బావున్నావ్"అంటూ ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"చాలా సంతోషం. సరేకాని ఆ టాక్ విన్నాక కొన్ని సూచనలు నోట్ చేశాను.... వింటావా ? ఒకటి : ప్రోత్సాహం. అంతే కాని నిర్ణయం చేయకూడదు. రెండు ; ఇద్దరూ కలిసి నిర్ణయాలు చేయాలి. మూడు : ఉహూఁ, అహాఁ లతో బాధ్యత నెట్టివేయకూడదు. నాల్గు ; నా తెలివి తేటలు గుర్తించాలి. ఐదు : సమానత్వం గాని, బానిసత్వం కాదు. నన్ను తక్కువగా చూడకూడదు. వింటున్నావా ?" అన్నీ విన్నాక మూర్ఛవచ్చినంత పనైంది కృష్ణమూర్తికి. పార్వతి ఇంత తీక్షణంగా వాటిని గురించి సతమతమైపోతూందని తెలుసుకోలేదు. సరికదా వూహించను కూడా లేదు. "అయితే వాటి విషయంలో ఏం చెయ్యమంటావు ?" అడిగాడు.

"ఆలోచించమంటున్నాను. నువ్వు బహు దుర్మార్గంగా వున్నావని కాదు నా వుద్దేశం. మనం హాయిగా లేమనీ కాదు.... కాని యిలాంటి విషయాలు తేల్చుకొనే సమయం ప్రతి దంపతులకీ ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది - అప్పుడే ఆ పెళ్ళి నిలిచేది.

"ఇదంతా వింటూంటే, నేనేదో భూత ప్రేతాముల వారసుణ్ణిలా తోస్తుంది నాకు" నిరాశతో ఒంకిన గొంతుతో అన్నాడు కృష్ణమూర్తి.

"నీ తల బద్దలు కొట్టినట్టు అలా వీరస పడిపోతా వేం ? అస లలా అనుకోనక్కర లేదు. నా ఉద్దేశం నీకు తెలుసు. నే నిలా ప్రవర్తించడం కొత్తగా వుంది నీకు—అలవాటు లేక. మగవాళ్ళెందు కిలాంటి విషయాలసలు చర్చకే రానివ్వరో యిప్పుడే అర్థం అవుతూంది నాకు"

"అది కాదు పార్వతీ: నేను"....అతని వాక్యం మధ్యలోనే కత్తిరించింది పార్వతి.

"నే నింకా మాట్లాడ్డం పూర్తి కాలేదోయ్ బావా, అలా కల్లు తాగిన కోతిలా గెంతుతావెందుకు ? నా మాటలు వినడం. వాటికి సరిగా బదులు చెప్పటం అలవాటు చేసుకో. యిలా తప్పించుకునే కంటే" అంది.

అటూ యిటూ తిరుగుతున్న వాడల్లా నిలబడ్డాడు కృష్ణమూర్తి. "అబ్బబ్బా : పార్వతీ నువ్విలా వుంటే నాకేం బాగా లేదు. నువ్వు ఏమీ తెలియని దానిలాగా. శుద్ధ అడదాని లాగా వుంటేనే బాగుంది"

"నే కొనుక్కొన్న పుస్తకాలూ. నే తీసుకున్న స్టాంపులూ యీ సంఘటనలకు ముందరనా నీ ఉద్దేశ్యం ? "రెచ్చకొట్టింది పార్వతి...." నీ ప్రతి మాటా చట్టంగా గుర్తించి నప్పుడా ?"

"ప్లీజ్ నన్నొక్కసారి కౌగలించుకోని. అన్నీ మరచి పోదాం - రా పార్వతీ" అంటూ రెండు చేతుల్లోకి పార్వతిని తీసుకున్నాడు కృష్ణమూర్తి.

"అది న్యాయం కాదు కృష్ణా : నేను నీతో వాదిస్తున్నప్పుడు కౌగలించుకోవడం న్యాయం కాదు"

మాటలకి తడుముకుంటూ "నాలో బలహీనతని ఆధారంగా చేసుకుని లోకువ చేస్తున్నావన్న మాట" అంది.

"సరే, నువ్వే గెలిచావు. రా పోయి పడుకుందాం" చేయి పట్టుకుని పడక గదివైపు దారి తీశాడు.

పార్వతి ముఖం గమ్మత్తుగా వుంది. ఏదో తెలియని బాధ ఆవరించిం దామె కళ్ళల్లో.

"చూడు కృష్ణా : నే నడిగేదేం ఎక్కువ కాదే....నా మీదేదో హక్కున్నట్టు కాకుండా నన్నెందుకు కొంచెం ప్రేమించి, కొంచెం లాలించి గెలుచుకో కూడదు ? నా వ్యక్తిత్వానికి తగిన గౌరవం ఎందుకు ఇవ్వకూడదు?" జాలిగా ధ్వనించాయి పార్వతి మాటలు.

"అది చాలా సులభం పార్వతీ : ఇప్పుడే మొదలు పెడతాను. ఆలస్యం అమృతం విషం అన్నారుగా :" నవ్వుతూ నడుంచుట్టూ చేయి వేశాడు కృష్ణమూర్తి.

"నువ్వన్నీ తేలిగ్గా తీసుకుంటావు. అక్కడే నా కొస్తుంది" ఇక మాట్లాడనియ్యకుండా తన కౌగిట బిగించాడు కృష్ణమూర్తి. "నువ్వు దీన్ని అలా తేలికగా కొట్టేపారేస్తున్నావుగా. నీ కేం తెలుసు నా బాధ" ఎంతో నేర్పుతో, ఎంతో కాంక్షతో ముద్దుపెట్టుకున్నాడు పార్వతి ఎర్రని పెదవులని.

"ఓ. నువ్వంటేనా కెంత ప్రేమ. నువ్వు వట్టి జంతువ్వి కష్ణా" సంతోషంలో తేలిపోతూ అంది పార్వతి.

"నువ్వేం తక్కువదానివా. కాంక్షలన్నీ దాచుకుని కొసరించుకుంటావ్. ఆవేశం తెప్పిస్తావు"

ఓ క్షణం మాట్లాడలేదు పార్వతి. కృష్ణమూర్తి జుట్టులో వేళ్ళు పోనిచ్చి నిమురుతూంది. "అయితే మరి నా స్టేటస్ సంగతి" గోముగా అడిగింది.

చూపుడు వేలితో ముక్కునొక్కేస్తూ అన్నాడు కృష్ణమూర్తి. "నువ్వే గెలిచావు పార్వతీ. నేను కొత్తగా ప్రేమ పాఠాలు నేరుస్తాను. స్నేహం, ప్రేమ, పెళ్ళి మొదలైన వాటిమీద పుస్తకాలు తెప్పించు. ఏం పార్వతీ ఈ మొద్దబ్బాయిని కొంచెం చదివింపుకో. మనిద్దరికీ పని లేనప్పుడు రాజకీయాలు చర్చించుకుందాం. ఏమంటావ్?"

అతని కౌగిట సర్దుకుంది పార్వతి. "ఛీ: ఛీ: నిజంగా మొద్దబ్బాయివే. కొంచెం కూడా రొమాంటిక్‌గా వుండలేవు వెధవ రాజకీయాలు : వాటిగొడవెందుకు ?"

ఆమె విదలిస్తూన్న తలను తన రెండు చేతులా పట్టుకున్నాడు కృష్ణమూర్తి. నుదుటి మీద—ముక్కు చివర తేలికగా ముద్దు పెట్టుకున్నాడు. తలంటుకున్న జుట్టు చిందరవందరగా పడి కిత కితలు పెడుతూంది.

"అయితే పార్వతి తిరిగి వచ్చేసినట్టేనా ?" అడిగాడు.

"ఛీ, పిచ్చి : ఎక్కడికెళ్ళిందేమిటి ?"

కాఫీ గ్లాసుతో ప్రత్యక్షమైన పార్వతిని ఒక చేత్తో దగ్గరగా తీసుకుంటూ "బాగా నిద్రపోయావు కదూ రాత్రి" అన్నాడు చిలిపిగా చూస్తూ.

"నాకో కలవచ్చింది." అందంగా కళ్ళు మూసుకుని జ్ఞప్తికి తెచ్చుకుంది. "ఆ కలలో ఏం జరిగిందో తెలుసా ? నేనో మహిళా మహాసభలో ఉపన్యాసం యిస్తున్నాను.... ఇంట్లో స్త్రీల ప్రతిపత్తి చట్టరీత్యా రక్షింపబడాలని తీర్మానించారు." అలవోకగా చూస్తూ ఆగింది పార్వతి.

"ఓ, అంతా కలేకదా" నిట్టూర్చాడు కృష్ణమూర్తి. తక్షణం నిటారుగా నిలబడింది పార్వతి.

"అంతే తోస్తోంది. మా మహిళాసభలో యీ విషయం చర్చించి చూస్తాం ఏదైనా కదిలించవచ్చేమో :" అంటూ కృష్ణమూర్తి తల నిమిరింది.

హతోస్మి : అనుకుని అందాకా పార్వతిని దగ్గరకి తీసుకున్నాడు కృష్ణమూర్తి.

"వీరికి మగవాళ్ళు : ఎందుకో అంత భయం" అంటూ అతనిమెడ క్రింద పెదవుల నాన్చింది పార్వతి.

జోకుల పోటీ! త్వరపడుడు!

"జ్యోతి" పాఠకులకు

మరొక వెయ్యినూటపదహార్ల బహుమతి!

ప్రపంచంలో మొదట ఆరే జోకులుండేవిట. మిగతా వన్నీ ఆ ఆరింటికి పుట్టినవేనని జోక్శాస్త్రకారుల సిద్ధాంతం. అయితే, ఏ ఆరుజోకులు మొదట వుండేవి? అనే విషయం ఇప్పటికీ తేలలేదనుకోండి. ఏమైనా ఒకటి మాత్రం నిజం : ఒక జోకునుంచి ఎన్ని జోకులైనా లాగవచ్చు. ఒక జోకును తిరగేస్తే కొత్త జోకు వస్తుంది. సాగదీస్తే ఇంకొకటి. కుదిస్తే మరొకటి. పేర్లు మార్చితే వేరొకటి. ఇలాగ అనంతకోటి జోకులు తయారు చేయవచ్చు.

పాఠకుల జోక్శక్తికి పరీక్షగా ఒక కొత్తరకంపోటీ పెడుతున్నాము. ఇందులో జోకర్లు అందరూ పాల్గొనవచ్చు అందరిలోకీ బాగా జోకిన జోకింగ్‌కాంగ్‌కు వెయ్యినూట పదహార్ల (నయాపైసలు మాత్రమే సుమండీ.) బహుమతి.

బాగా నలిగి, చివికి, చితికి, పచ్చడైపోయి, ఆర్నెల్ల పాపాయికికూడా నవ్వు పుట్టించనంత పాతజోకును తీసుకోండి. దాన్ని తిరగేసో, మరగేసో మంచి కొత్తజోక్‌ను కల్పించండి.

[ఒక ఉదాహరణ :- నిర్జనంగావున్న రోడ్డుమీద అర్ధరాత్రివేళ ఒకడు పోతున్నాడు. ఇంతలో మరొకడు హడావిడిగా అటువచ్చి "ఈ దగ్గర్లో ఎక్కడన్నా మీకు పోలీసు కనిపించాడా?" అని అడుగుతాడు. మొదటివాడు "లేదండీ" అంటాడు. "అయితే మీ పర్సు ఇలా ఇచ్చెయ్యండి" అంటాడు దొంగ. ఇది పాతజోకు.

పర్సు ఇవ్వమనగానే "నేనే పోలీసును. పద స్టేషనుకు" అంటాడు మొదటివాడు. ఇది కొత్తది.

లేకపోతే "నేనూ దొంగనే బ్రదర్! ఉహూ. లాభంలేదు" అంటాడు. ఇది ఇంకొకటి.]

మే 15 వ తేదీలోగా వచ్చిన ఎంట్రీలనే స్వీకరిస్తాము.

నక్షత్రమార్గం

చీకటిరాలుస్తున్న కన్నీళ్ళ చప్పుడు కింద
ఒదిగి ఒదిగి నడుస్తున్నాను
పిడికిట్నిండా పిడుగుల్ని వర్షించే ఖడ్గం
గాలిని గజగజ లాడించే దాని కాంతి
శాంతికి వారసుణ్ణి

ఎన్ని గీతాలు వెలిగించినా
వెలగని యీ నక్షత్రాలు
కాంతిని నా కళ్ళలో కుమ్మరిస్తాయని ఎలా నమ్మడం
వెకిలిగా నవ్వుతూ భయం వెలిగిస్తున్న మంటల్ని ఎలా ఆర్పడం
పన్నగం పడగకింద పరుగెత్తే నీడలు
విడిచే నిట్టూర్పులు యీ ఖడ్గానికెలా దొరుకుతాయ్
మునిగిపోతున్న ఓడలు విడిచే మూలుగులు
ఏ ద్వీపాల్ని చేరుకుంటాయ్

చీకటికి కళ్ళు లేవు
చిట్టడివిని నమ్మి ఏ చెట్టుకిందనో నిద్రపోకండి

బ్రతుకులో సంగీతం లేదు
సంతకం చెయ్యలేని వేళ్ళు
సరిగమల్ని ఎలా పలకరిస్తాయ్
ఎదురు చూడలేని కళ్ళు
ఎవర్నీ విశ్వసించవు
ఎదురుగా ఏ చూపున్నుండీ తప్పించుకోలేని భయం
ఎండుటాకులమీంచి నడవక తప్పదు

కన్నీళ్ళతో కాదు కలల్ని
ఖడ్గంతో సృష్టిస్తాను
వర్ణియ్యలైన హృదయ శకలాల్ని కలలతో అతికించి
పువ్వులదారి పట్టిస్తాను
కళ్ళు చూడలేని వెలుగుని
నా గీతాల్లో చూపిస్తాను
కన్నీళ్ళతో కాదు కలల్ని
ఖడ్గంతో సృష్టిస్తాను
యుద్ధాల్తో కాదు సరిహద్దుల్ని
చిరునవ్వుల్తో చెరిపేస్తాను

చీకటి గుహలో చిందుతున్న చిట్టడవి కన్నీళ్ళ చప్పుడుకింద
ఒదిగి ఒదిగి నడుస్తున్నాను
పిడికిట్నిండా పిడుగుల్ని వర్షించే ఖడ్గం
చుక్కల్ని ధగధగలాడించే దాని కాంతి
శాంతికి వారసుణ్ణి

కేశవరావ్

చైత్రయాత్ర

రమణీయ రామాయణ చిత్రం

నిర్మాత ఎ. శంకరరెడ్డి, దర్శకులు సి. పుల్లయ్య, సి. యస్. రావ్ అయిదేళ్ళు శ్రమించి లలితా శివజ్యోతి ఫిలిమ్స్ అధ్వర్యాన సమర్పించిన ఉత్తర రామాయణ గాథ వర్ణ చిత్రం "లవకుశ". వారి శ్రమ, సంయుక్త కృషి చాలమటుకు ఫలించిందనే చెప్పవచ్చు.

చిత్రం సీతారాముల పట్టాభిషేకంతో మొదలై లవకుశుల పట్టాభిషేకంతో ముగుస్తుంది. ఈ ఘట్టాలమధ్య నున్న రామాయణ కథాభాగాన్ని తరచి, అందులోని మీగడ తఱకలవంటి సంఘటనలను యేర్చి కూర్చిన సంపూర్ణ వర్ణ చిత్రమిది.

ఈ చిత్రంలో రాముడుగా ఎన్. టి. రామారావు నటించారు. ఆయన హావభావ ప్రకటన చూస్తుంటే సాక్షాత్తు తారక రాముడే అవతరించినట్లనిపిస్తుంది. సీతను పరిత్యజించిన పిమ్మట యేకాంతగృహంలో పడిన బాధ, "మా తల్లి సీత యేదీ" అని లవకుశులు ప్రశ్నించినపుడు లోనైన వ్యథ, రామారావు తప్ప మరెవరు అంత చక్కగా చూపగలరు?

సీతగా నటించిన అంజలీదేవి నిజంగా నటించటానికి రెండుచోట్లే అవకాశం వున్నది. ఆ రెంటిని ఆమె అనుపమానంగా ఉపయోగించుకున్నది. మొదటిది వనవాసం దృశ్యం, లక్ష్మణునితో సంవాదం, ఆ తరువాత భూదేవితో సంభాషణ. విషాద సన్నివేశం కదా అని వెక్కి వెక్కి ఏడ్వటం లేకుండానే, గుండెల్ని కలచివేసే విషాదం కంఠంలోని జీరతోనే వ్యక్తీకరించింది. రెండవది ఆఖరి దృశ్యం. ఇన్నాళ్ళు కోరి తపసు చేసి కనురెప్పలలో నిలుపుకున్న శ్రీరాముని దర్శనభాగ్యం నోచుకున్న మరుక్షణంలోనే భూదేవి ఒడిలో వాలి రాముని సాన్నిధ్యం బాసిన సీతగా అంజలీదేవి ప్రేక్షకుల హృదయాలను కలచి వేసింది.

లక్ష్మణుడుగా కాంతారావు హద్దు మీరకుండా, శ్రుతి తప్పకుండా తగిన నటన




"లవకుశ"లో ఒక సన్నివేశం

ప్రదర్శించడం జరిగింది. వదినగారిని నట్టడవిలో వదలి వచ్చిన సందర్భంలో ఆయన చూపిన భావ ప్రకటన వారి కళాజీవితంలో ఒక వెన్నెల రాత్రి.

చిన్న చిన్న భూమికలలో కౌసల్యగా కన్నాంబ, భూదేవిగా ఎస్. వరలక్ష్మి, శాంతగా సంధ్య, పాత్రోచితంగా కనపడ్డారు, సంభాషణలు చెప్పారు. చాకలి దంపతులుగా రేలంగి, గిరిజ మోతాదు మించని చక్కని సున్నితమైన హాస్యం అందించారు. సూర్యకాంతం, రమణారెడ్డి హాస్యం అంతంత మాత్రంగానే వుంది. ఇది లేక పోవడం కథా గమనానికి ఏ మాత్రం అడ్డురాదు కూడా : తక్కిన వారిలో చాలమంది పౌరాణిక పాత్రలుగా పోజులు యిచ్చారు. కొందరు అదీ చేయలేదు. ఇక చెప్పుకోవలసినది లవకుశులుగా నాగరాజు, సుబ్రహ్మణ్యం, వాల్మీకిగా నాగయ్య.

సదాశివబ్రహ్మం కథనం చక్కగా వుందికాని, సంభాషణలు అక్కడక్కడ పాత్రోచితంగానూ లేవు. సన్నివేశోచితంగానూ లేవు. ఈ లోపం సరిదిద్దవలసిన



"ఈడూ జోడూ"లో మణిమాల, జగ్గయ్య

బాధ్యత దర్శకులపై యెంతైనా వుండినది. వెంపటి సత్యం నృత్యాలలో మొదటిది జానపదుల ఊపుతో బాగా వుంది. రెండవది అర్థంలేని కదలికలతో పేలవంగా వుంది.

పలురంగుల ఈ వర్ణ చిత్రానికి మరొక మనోహరమైన రంగు ఘంటసాల సంగీతం. పాటల్లోకాని, పద్యాల్లోకాని, నేపథ్య సంగీతంలోకాని వారి ప్రతిభ కనపడని క్షణమంటూ లేదు. సదాశివబ్రహ్మం, కొసరాజు, సముద్రాల వ్రాసిన పాటలు అన్నిట్లో ఒక ఉదాత్తత కనిపిస్తున్నది. చిత్రం ఒక సారి చూడగానే నచ్చిన పాటలు "ఏనిమిషానికి యేమిజరుగునో" (ఘంటసాల-కొసరాజు) "రామన్న రాముడూ" (రాణి, సుశీల—కొసరాజు) "ఒల్లనోరి మామా" (ఘంటసాల, జిక్కి, రాణి, రాఘవులు—సదాశివబ్రహ్మం). సముద్రాల రచనలైన రామాయణగాథ పాటల వరసలుకట్టడంలో భక్తి భావానికన్న సంగీత శాస్త్రానికే యెక్కువ ప్రాధాన్యం యివ్వబడినా, జనరంజకంగానే వున్నవి. "లేరు కుశలవుల సాటి" అచ్చం సంగీత పోటీ పాటలాగే వుంది. పద్యాలలో ఎస్. వరలక్ష్మి పద్యం మకుటాయమానం,

ఎన్. టి. రామారావు నటన, ఘంటసాల సంగీతం మరొక రెండు వర్ణాలై రాణించిన వర్ణచిత్రం "లవకుశ". నిర్మాతల ధైర్య సాహసాలకు జోహార్లు.

చదువుకున్న అమ్మాయిలు

"కథ తక్కువ. పేరుకు, కథకు సంబంధం తక్కువ. అన్నపూర్ణావారి పూర్వపు చిత్రాలంత బాగా లేదు. పద్మనాభం పాత్ర బాగాలేదు...." "చదువుకున్న అమ్మాయిలు" పై వినబడుతున్న కొన్ని విమర్శ లివి.

ఈ విమర్శలు ప్రజాభిప్రాయాన్ని ఎంత వరకు ప్రతిధ్వనిస్తున్నాయో చెప్పలేను గాని, వాటితో ఏకీభవించ లేను. అన్నపూర్ణావారి కొత్త చిత్రం వారి పూర్వపు చిత్రాల స్థాయికి తగ్గలేదు సరికదా, ఎన్నో అంశాలలో వాటికంటె హాయిగా, ఆహ్లాదకరంగా, చూస్తున్నంతసేపు కన్నుల పండువుగా వుంది.

చిత్రం హాయి గొల్పడానికి కథ చాలా భారీగా వుండనవసరం లేదు. అది నమ్మదగినదిగా, పాత్రలు సజీవంగా, నటన, దర్శకత్వం ప్రతిభావంతంగా వుండాలి. ఈ గుణాలన్నీ "చదువుకున్న అమ్మాయిలు" పుణికి పుచ్చుకున్నది.

ఈ ముగ్గు రమ్మాయిలు, ముగ్గు రబ్బాయిల కథలో సావిత్రి ధరించిన సుజాత పాత్ర ధీరోదాత్తమైనది. విద్యావతి, గుణవతి. తాను ప్రేమించిన శేఖర్ తిరిగి తనను ప్రేమించడంలేదని తెలిసి లబో దిబో మని ఏడవదు. నా ప్రేమో అంటూ ఆరు నొక్కొక్క రాగంలో విరహ గీతాలు పాడి నానా హంగామా చెయ్యదు. ఒక్క క్షణం దిగ్భ్రమ చెంది తిరిగి తేరుకుంటుంది. మరుక్షణంలో తన స్నేహితురాలు వసంతనే శేఖర్ ప్రేమించాడని తెలుసుకుని, తన సఖి అదృష్టానికి సంతోషిస్తుంది. ఈ పాత్రను సావిత్రి తనకు సహజమైన అమృతశైలిలో నటించింది. ఎంత స్థూలమైన భావాన్నయినా, అతి సూక్ష్మమైన ముఖకవళికతో, ఒక కంటి చూపుతో, ఒక పెదవి కదలికతో అనువదించగల నేర్పు బహుశా ఆమె కున్నంతగా ఎందరికో వుండదనిపిస్తుంది.

మరొక చదువుకున్న అమ్మాయి వసంతగా కృష్ణకుమారిది కూడా ఇంత ప్రాముఖ్యం వున్న పాత్రే. సన్నగా, సన్నజాజి తీవలా, నాజూకుగా కనబడడమే కాదు, అంతకు మించిన ఆకర్షణను తన పాత్ర పోషణలో ఆమె కనబరచింది. నటిగా ఆమె నానాటికీ అనుభవం, నేర్పు గడిస్తున్నదనడానికి ఈ చిత్రంలో ఆమె నటనే చాలు.

వీరిద్దరి ప్రేమకు పాత్రుడై, వీరిలో ఒకరినే వరించిన శేఖర్‌గా నాగేశ్వరరావు తనకు సహజమైన సౌలభ్యం (ఈజ్) తో నటించాడు. ఆయన పాత్ర పోషణ సహజత్వానికి సన్నిహితంగా, సరళంగా, తామరాకుపై నీటిబిందువులా తళ తళ మెరుస్తుంది. అందుకే సాంఘిక చిత్రాలలో నాగేశ్వరరావుకు ఈడైన నటన మరెవరూ ప్రదర్శించ లేరనుకోవడం.

ఇక రేలంగి, సూర్యకాంతం పాత్రలు ఈ చిత్రంలో ఒక కొత్త తరహా వృద్ధ ప్రణయాన్ని పరిచయం చేస్తాయి. గుమ్మడి పాత్రలో నటనకు అంతగా అవకాశం లేదు. పద్మనాభం కామెడీ, విలనీ మిళాయించి ఒక కొత్త ప్రయోగం చేసి చూశాడు.

ఆదుర్తి దర్శకత్వం సావిత్రి, కృష్ణ

ప్రక్క పేజీలో : అనురూపావారి "అనురాగం"లో భానుమతి, పాపాయి



కుమారి కలిసి వున్న ప్రతి సీనులోను దేదీప్యమానంగా ప్రకాశించింది. ఒకే పరిస్థితిలో వున్న రెండు పాత్రల భిన్న మనస్తత్వాలను, భిన్న భావాలను అతి నేర్పుతో చిత్రించారు. ఆ తేడా ఎంత సూక్ష్మమైనదో గమనిస్తే దర్శకుని గొప్పతనం తేటతెల్లమవుతుంది.

సెల్వరాజ్ ఛాయాగ్రహణం అత్యుత్తమంగా పాశ్చాత్య స్థాయిలో వుంది. ప్రతి ఫ్రేము అతి జాగ్రత్తగా కంపోజ్ చేశారు. మొత్తం మీద చిత్రంలోని సాంకేతిక ప్రమాణాలు మెచ్చుకోదగినవిగా వున్నాయి.

ఎస్. రాజేశ్వరరావు వరసలలో కొత్తదనం కొట్టవచ్చినట్టు కనిపించక పోవచ్చు. కాని జనరంజకత్వానికి లోటు లేదు. సుశీల పాడిన "వినిపించని రాగాలే" వేసవిలో వెన్నెల రాత్రిలా వుంది. రచనలలో దాశరథి "వినిపించనిరాగాలు", నారాయణరెడ్డి "కిలకిల", కొసరాజు "అవతారం", ఆరుద్ర "ఆడవారికోపం" హుషారుగా వున్నాయి.

తల్లీ బిడ్డలు


ఒకప్పుడు రోనా ఫిలిమ్స్ పేరిట యడవల్లి లక్ష్మీనారాయణ నిర్వహణంలో తయారై, ఈనాడు శ్రీ హరిహర మూవీస్ పేరిట ఆర్. వి. హెచ్. హెచ్. ప్రసాద్ సన్స్ బృందం ఆధ్వర్యాన విడుదలైన "తల్లీబిడ్డలు" అనుకున్న దానికంటే చాలా బాగుంది.

అంత బాగా వుండదనుకోవటానికి కారణాలు దర్శకత్వం కొత్తవారు నిర్వహించటం. కథ, సంభాషణలు స్వతంత్రంగా మొదటిసారి యడవల్లి వ్రాయటం. తారాగణంలో అన్నీ చిన్న పేర్లే వుండటం. వీటన్నిటికంటె ముఖ్యమైన కారణాలు నిర్మాణం మధ్యలో ఆర్నెల్లు ఆగిపోవటం. చిత్రం పూర్తయిన తరువాత మరొక ఆర్నెల్లు వాయిదా పడడం.

ఎన్ని ఒడుదుడుకులకు లోనై నిర్మించినా, చిత్రం మొత్తంమీద బాగుంది. పి. శ్రీనివాసరావు దర్శకత్వం యడవల్లి కథలోని వడిని, వేడిని యెక్కడా తగ్గించకుండా అతి నేర్పుతో చిత్రీకరణ చేసింది. యడవల్లి కథ ఏమంత కొత్తది కాకపోయినా, బరువైన సంఘర్షణలతో వారే వ్రాసిన నిఖార్సైన సంభాషణలతో, సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులను యిట్టే ఆకట్టేస్తుంది.

కథ ఇది: జమీందారు కేశవరావు. అతని భార్య శాంత పిల్లలులేక విచారపడుతుంటారు. వారి డ్రైవరు వెంకన్న తన స్వంత కొడుకుని అనాథ శిశువని చెప్పి వారికి పెంపకం యిస్తాడు - తనకులేని హోదా తన కొడుకైనా వుంటుందనే దృష్టితో. కొన్నాళ్ళకు శాంత కొడుకుని కంటుంది. తన కొడుకుకి న్యాయం జరగదని శంకించి ఆ పసికందుని వెంకన్న దొంగిలిస్తాడు చంపివేయాలనే ఉద్దేశంతో. వెంకన్న భార్య లక్ష్మి ఆ పాపను రక్షించి మరొక వూరు పారిపోయి వాడినక్కడ పెద్దవాడిని చేస్తుంది.

కుమార్‌గా జమీందారింట్లో పెరిగి యుక్త వయస్కుడైన వెంకన్న కొడుకు దుస్సాంగత్యాలకు లోనై చెడుతిరుగుళ్ళు తిరుగుతుంటాడు. జమీందారు కొడుకు ప్రకాశ్‌గా లక్ష్మి పెంపులో పెరిగి పోలీస్



ఆర్. ఆర్. పిక్చర్సువారి "మంచి - చెడూ"లో బి. సరోజాదేవి



అనుపమవారి "ఈడూజోడూ"లో గుమ్మడి, జమున

యినస్పెక్టర్ అవుతాడు.

ఆ తరువాత కథానాయిక గీత ప్రవేశం, నర్తకి పుష్ప హత్య, కుమార్‌పై నిందారోపణ, ప్రకాశ్ ఆచూకీ తీయటం చివరికి అందరు సంతోషంగా కలుసుకోవటం.

మొదటనే చెప్పుకున్నట్లు యెక్కడా ఒక్క క్షణమైనా విసుగెత్తకుండా ఈ కథను తెరకు తర్జుమా చేసిన ఘనత దర్శకునిది. కొంతవరకు ఎడిటర్లు సూర్య, తంగవేలు ప్రభృతులది. వై. ఎస్. ప్రసాద్ ఫొటోగ్రఫీ పటిష్ఠంగా సన్నివేశంలోని ప్రధాన రసానికి అనుగుణంగా వుంది. కోవలంలో తీసిన ఔట్‌డోర్ పాట అంత ముచ్చటగా వుంది. కొత్త సంగీత దర్శకుడు బి. శంకర్రావు బాణీలలో కొత్తదనం యేమంత లేదుకాని పాటలుగా "నగుమోము", "మనసిచ్చి నే నొకదొంగకు" బాగానే వున్నాయి. శ్రీనివాస్, జానకి బాగా పాడారు. మల్లాదివారు వ్రాసిన ఒక్కపాటే రచనలలో బాగుంది.

ఈ కథకు సూత్రధారులు వెంకన్న పాత్ర ధరించిన లింగమూర్తి, లక్ష్మిగా నటించిన హేమలత. ఈ రెండు పాత్రలు లేకపోతే కథ యేమాత్రం నడవదు. ఇంత ముఖ్యమైన పాత్రలయినా వాటికి యెక్కడా అనుచితమైన ప్రాముఖ్యం ఇవ్వకుండా కథా రచన జరిగింది. వారిద్దరూ కూడా అసమాన నటనా చాతుర్యంతో వారి వారి పాత్రలను నిర్వహించారు. కుమార్‌గా హరనాథ్ నటన కొత్త పంథాలు త్రొక్కింది. అతి అనిపించిన రెండు సీనులలో తప్ప అతని నటన అతి సహజంగా వుంది. దీనితో హరనాథ్ నటనా సోపాన పంక్తిలో మరొక మెట్టు యెక్కినట్టే. నాయికగా కృష్ణకుమారి అందంగా రసపోషించింది. అంతకుమించి చేయటానికి ఆ పాత్రకు అవకాశం లేదు. జమీందారు దంపతులుగా నాగయ్య, రజని, జమీందారు హుందాతనాన్ని చూపించారు. శివరావు, పేకేటి, మీనాకుమారి, శివరామకృష్ణయ్య తగుమాత్రం హాస్యం అందించారు.

ప్రకాశ్‌గా బాలయ్య సంతృప్తికరంగా నటించారు. హాస్య సన్నివేశాలలో యెప్పుడూ చేయనంత చలాకీగా, సహజంగా నటించడమేకాక సంభాషణలు లేని సన్నివేశాలలో కూడా హావభావ ప్రకటన అతి సమర్థంగా చేశారు. ఒకచోట సంభాషణ తీరు కర్కశంగా వుంది. ఇది అనవసర మేమో. ఫొటో కోసం వెతుకుతూ తల్లి పూజాపటాల వెనుక గొలుసు కనుక్కొన్నప్పుడు చూపిన నటన ఆయన యెంత ఉత్తమ తరగతికి చెందిన నటులో నిరూపిస్తుంది.

శ్రీనివాసరావు దర్శకునిగా చేయగూడని పనులు : హరనాథ్‌కి పిఠాపురం కంఠం, హేమలతకు జానకి కంఠం యెరువివ్వటం, అర్థంలేని రాకెన్‌రోల్ డాన్సు కథలో యిమడ్చటం. ఇవి తీసివేస్తే చిత్రం మరింత యింపుగా వుండే దనటానికి సందేహం లేదు.

సెహరా

వి. శాంతారాం కొత్త ముద్రిక క్రింద తయారయిన మొదటి చిత్రం సెహరా. రాజ్‌కమల్ కళామందిర్ నిర్మాణం కాదిది. వి. శాంతారాం ప్రొడక్షన్స్‌ది. కొత్తదనం ఈ ముద్ర మార్పులోనే వుంది.

ఊరూ వాడా చోటూ, స్థలం, కాలం, సమయం తెలియని ఈ కట్టు కథకు నాంది రెండు ముఠాల మధ్య కక్ష. ఒక ముఠా నాయకుని కూతురు శత్రుపక్షంలో ఒక యువకుణ్ణి ప్రేమిస్తుంది. అక్కడనుంచి లైలా మజ్నూ.



"సెహరా"లో సంధ్య

నటనలో చెప్పుకోవలసింది: ఉల్హాస్, లలితాపావర్, మన్మోహన్‌కృష్ణ. ఎప్పుడూ అతిగా నటించే వీరు మితిగా నటించటం మహదానందకరం. సంధ్య యింకా హిందీ భాషను మహారాష్ట్ర యాసతోనే మాట్లాడుతున్నది. కొత్త హీరో ప్రశాంత్ విగ్రహపుష్టి బాగానే వుంది. నైవేద్య నష్టి అని చెప్పేముందు మరొక చిత్రం చూడాలి. సంధ్య వెనువెంటనే తిరిగిన పిల్ల (పేరు తెలియదు) వింటినారిలాగ వుంది. ఎమ్. రాజన్ విలన్గా కనపడటానికి విఫల ప్రయత్నాలు చేశాడు.

సంగీతం రామ్లాల్ అనే కొత్త సంగీత

దర్శకునిదట. పరసలు మామూలుగానే వున్నాయి కాని వాద్యరచన గమనిస్తే యిది అతని మొదటి చిత్రమని నమ్మటానికి వీల్లేదు. తక్కిన సాంకేతిక విభాగాలు ఈ స్థాయికి తగ్గకుండా వున్నాయి.

కాంతారాం దర్శకత్వంలో ప్రత్యేక ప్రతిభ యేమీ గోచరించడం లేదు గాని కొన్నిచోట్ల, ముఖ్యంగా సంధ్యను ఉల్లాస్ సాగనంపిన దృశ్యం హృదయాన్ని ద్రవింప జేసింది.

యే రాస్తే హై ప్యార్ కే

కోర్ట్ రూమ్ డ్రామాలని పిలువబడే సినిమాలు ఆంగ్లంలో కొల్లలు. "ది పార డీన్ కేస్", "విట్నెస్ ఫర్ ది ప్రాసిక్యూషన్" అటువంటి చిత్రాలలో అత్యుత్తమమైనవి. తెలుగు సినిమాలలో కోర్టు దృశ్యాలున్నా అవి యెంతో హాస్యాస్పదంగా వుండి కోర్టు వ్యవహారాలకు, దర్శక మహాశయునికీ యెంతదూరం వుందో సుస్పష్టంగా నిరూపిస్తాయి. ఈ మధ్య హిందీ సినిమాలలో ఈ కోర్టు రూమ్ డ్రామా పద్ధతిని తెలివిగా ఉపయోగించుకోవడం జరిగింది. 'కానూన్', 'రాత్ ఏక్ రాత్ కీ' యింతకు మునుపే వచ్చినవి. మొన్న మొన్న విడుదలైనది "యే రాస్తే హై ప్యార్ కే"

ఇందులో కొత్తదనం కోర్ట్ రూమ్ డ్రామాలో నేకాక యెన్నుకున్న యితివృత్తంలోనూ వుంది. ఒక స్నేహితుని భార్య శీలాన్ని ఒక దుర్మార్గుడు చెరచటం భారతీయ చిత్రాల కథలకు క్రొత్తదనే చెప్పవచ్చు. ఇటువంటి వస్తువును యెక్కడా ఏవగింపు కలగకుండా, అతి జాగ్రత్తగా తెరపై మలచారు నిర్మాత సునీల్‌దత్, దర్శకుడు ఆర్. కె. నయ్యర్, రచయిత ఆగా జాని కాశ్మీరీ.

కోర్టు దృశ్యాలు యింత నిర్దుష్టంగా, వాస్తవానికి దగ్గరగా వుండటానికి కారణం వాటి రచనకు కోర్టు విషయాలు క్షుణ్ణంగా తెలిసిన బి. ఎస్. థాపా తోడ్పడటం. మన తెలుగు నిర్మాతలకు ఒక చిన్న సూచన. చిత్రాలలో అటువంటి సీనులు వచ్చేటప్పుడు తెలిసిన వారి సహాయం తీసుకొని వ్రాసుకోవచ్చును గదా. ఆ తెలిసిన వారు ఏ రాచకొండ విశ్వనాథశాస్త్రి వంటి, అటు చెయ్యి తిరిగిన రచయిత, యిటు పేరు మోసిన వకీలో అయితే యింకా మంచిది.

చిత్రంలో వెంటనే ఆకర్షించేవి అతి సహజంగావున్న ప్రేమ సన్నివేశాలు, సంభాషణలు. ముఖ్యంగా ఒక సీను. చక్కని ప్రకృతి ఒడిలో కూర్చొని ప్రేయసీ ప్రియులు వుంటారు. అప్పుడు ప్రియుడనే మాటలు: "పాస్ ఆ" ఏది పేశ్యల సాధారణ ప్రేమ డైలాగుల వలన, ఆడతారల వక్షోజాల క్లోజప్పుల వలన రాని, రాలేని భావం సునీల్‌దత్ భావగర్భితంగా ఆ మాటలు పదే పదే అంటుంటే వస్తుంది. ఉద్రేకాన్ని రేకెత్తించినంత మాత్రాన ఆ దృశ్యం అసహ్యంగా లేదు. అంత సున్నితంగా చిత్రీకరించారు. ఈ ప్రేమ సన్నివేశాల కోవలోకే వచ్చేది: "ఎభామోషియా ఏ ఏత్వ యియా" అన్న పాట. అటువంటి పాట వింటేచాలు. మరి ప్రేమ కలాపాలతో పని వుండదు.

మోసగింపబడిన భర్తగా సునీల్‌దత్, శీలాన్ని గోల్పోయిన భార్యగాలీలానాయుడు, అపహరించిన విలన్‌గా రహమాన్ అపూర్వమైన [illegible] ప్రదర్శించారు. రాజేంద్ర[illegible] అద్భుతంతంగా వున్నాయి. పైన చెప్పుకున్న ఒక్క పాట వరసే బాగుంది. కె. హెచ్. కపాడియా ఛాయ వెలుగునీడల మేలు కలయిక.

ఇంత వినూత్నమైన కథావస్తువును స్వీకరిస్తూ నిర్మాతలు రెండు చోట్ల అర్థంలేని బలహీనతలు చూపారు. ఒకటి : నాయికను సగం పాశ్చాత్యస్త్రీని చేయటం. చివర ఆ పాత్రను చంపివేయటం. ఆమెను హైందవ స్త్రీగా చూపించి చివర చంపివేయకుండా వుంటేఈ చిత్రానికి మరికొంత బలంవచ్చేది. కిలభంగం సీనులో మధ్యంలో మాత్రలు వేయించడం కూడా బలహీనత క్రిందే వస్తుంది.


అయితే అదీ ఆధునిక ప్రణయాలు తొక్కుతున్న దారి. అన్ని ప్రణయాలూ కావు. అందానికి భ్రమసి, ఆకర్షణకు ప్రేమఅనే నామకరణం చేసి ఆధునికత పేరిట వెర్రి మొర్రి వేషాలు వేస్తున్న ప్రణయాలు పయనిస్తున్న దారి. విజ్ఞావంతులందరు తప్పక చూడవలసిన చిత్రం ●






మాయమయ్యే అమ్మాయి

ఇంద్రజాలం! మహేంద్రజాలం! నేత్రావధానం! ఎడమకన్ను మూసుకొని, కుడిచేత్తో పుస్తకం పట్టుకుని, కుడికంటితో ఏకాగ్రదృష్టితో X అక్షరాన్ని చూస్తూవుండండి. మీ కంటికొననుంచి అమ్మాయికూడా కనిపిస్తోందికదూ. అలాగే X కేసిచూస్తూ మెల్లిగా పుస్తకాన్ని కంటివగ్గరికి జరుపుతూరండి. హఠాత్తుగా అమ్మాయి మాయమైపోతుంది.






పంచరు పంచరు పంచరు
ఆ పంచరు తలకోమోస్తరు
ప్రపంచమందున ప్రతీ విషయమూ
పంచరగుట గమనించరు

●

అనుపమ వారి
"ఈడూ జోడూ" లో
సంగీత సన్నివేశం





బస్తీకెళ్ళే అబ్బాయిగారూ
బలాదూరుగా తిరిగితే
పల్లెపట్టున తల్లిదండ్రుల
బంగారు కలలకె పంచరు

●

ఆడపిల్లలకు ప్రేమలేఖలు
అందించును నవయువకుడు
పెద్దవాళ్ళకు రిపోర్టు ఇస్తే
ప్రేమా గీమా పంచరు





ప్రజల మేలుకై పన్నులుపెంచి
ప్లానులువేయును ప్రభుత్వం
కంట్రాక్టర్ల కైంకర్యంచే
కమ్మని ప్లానులు పంచవ

అడుగు అడుగునా రిపేరొచ్చినా
ఆగదు మానవజీవితం
ఆశయాలుగల మంచిమనస్సు
అవనే అవదు పంచవ



ది ఆంధ్రబ్యాంక్ లిమిటెడ్

హెడ్ ఆఫీసు : : మచిలీపట్టణం

నెలసరి జీతాలు తెచ్చుకునేవారు తమ డబ్బు నిల్వ సమస్యను మా రికరింగ్ డిపాజిట్ స్కీముద్వారా పరిష్కరించుకోవచ్చును.

ప్రతినెల 10 రూపాయలు డిపాజిట్ చేస్తే

24 నెలలలో .... రూ. 250/—లకు

48 నెలలలో .... రూ. 520/—లకు

72 నెలలలో .... రూ. 820/—లకు

పెరుగుతుంది.

రికరింగ్ డిపాజిట్లను 10,20,30 ఆవిధంగా 500వరకుకట్టవచ్చును.

వివరాలకు : మీకు దగ్గరలోగల మా ఏ ఆఫీసులోనైనా అడగండి.

కె. ఎస్. దత్
చైర్మన్

టి. ఆర్. భాగవత్
జనరల్ మేనేజరు

సువర్ణ

"జ్యోతి" అంద చందాల పత్రిక

చందాలు మీరు కట్టండి

అందాలు మేమిస్తాము

"జ్యోతి"కి విరివిగా

చందాలు కట్టండి!

మే విడుదల



V.SHANTARAM PRODUCTIONS

V.Shantaram Productions

శాంతారాం ప్రొడక్షన్స

సెహరా

విజయరిలీజ్


తప్పకచూడండి
పరువు-ప్రతిష్ఠ
కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్
మానాపురం అప్పారావు
నిర్మాత
జూపూడి వెంకటేశ్వరావు
STUDIO Roopkala